

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 262

మంగళవారం 6-6-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


బసవ పూర్ణమ్మ

మొదట అక్కడ సేంద్రియ వ్యవసాయం మొదలైంది.
తర్వాత స్త్రీలు సేంద్రియ తినుబండారాలు మొదలుపెట్టారు.
రేకుల షెడ్డే వారి వంటశాల.
అరవై పైబడిన బసవ పూర్ణమ్మ వారి మేస్త్రి.
రాగి లడ్డు, జొన్నలడ్డు, నల్ల అరిసెలు, నువ్వుండలు... ఆ కారం... ఈ పచ్చడి...
ఎక్కడా రసాయనాల ప్రస్తావన ఉండదు.
ఆముదం, కాటుక, కుంకుమ కూడా తయారు చేస్తున్నారు.
వీరికి ఆర్డర్లు భారీగా ఉన్నాయి.
గుంటూరు జిల్లాలోని ఒక చిన్న ఊరు స్త్రీల వల్ల కరకరలాడుతోంది.
కళకళలాడుతోంది.

తూములూరు రుచులు ఊరు

2018లో మొదలైంది ఈ కథ.

'అమ్మా... మేము పండిస్తున్న సేంద్రియ పంటలకు మంచి డిమాండ్ వస్తోంది. కాని ఇవే సేంద్రియ పదార్థాలతో చిరుతిండ్లు చేయించి అమ్మమని అందరూ అడుగుతున్నారు. నువ్వు తయారు చేస్తావా?' అని అడిగాడు అవుతు వెంకటేశ్వర రెడ్డి తన తల్లి బసవ పూర్ణమ్మతో. ఆమెకు పల్లెటూరి పిండి వంటలు చేయడం వచ్చు. పండగలకు పబ్బాలకు పల్లెల్లో ఎవరు మాత్రం చేయరు? 'అదెంత పనిరా చేస్తాను' అంది.

అలా గుంటూరు జిల్లాలోని కొల్లిపరకు ఆనుకుని ఉండే తూములూరు అనే ఊళ్లో సేంద్రియ చిరుతిళ్ల తయారీ మొదలైంది. బసవ పూర్ణమ్మ ఇంటిలో వేపచెట్టు కింద ఉండే పశువుల కొట్టాం కాస్తా వంటల షెడ్డుగా మారింది. ఊళ్లో వంటలు చేయడం ఆసక్తి ఉన్న స్త్రీలకు ఇదొక ఉపాధిగా ఉంటుందని వారిని తోడుకమ్మని ఆహ్వానించింది బసవ పూర్ణమ్మ. అలా 'విలేజ్ మాల్' అనే బ్రాండ్‌తో 'కొల్లిపర మండల వ్యవసాయదారుల సంఘం' అనే లేబుల్ కింద తూములూరు చిరుతిండ్ల తయారీ మొదలైంది.


వంటశాలలో చిరుతిండ్ల తయారీ...


తాము తయారుచేసిన చిరుతిండ్లతో మహిళలు

రసాయనాలు లేని తిండి

'మా అబ్బాయి, ఇంకొంత మంది రైతులు 2015 నుంచి కొల్లిపర చుట్టుపక్కల ఊళ్లలో సేంద్రియ పద్ధతిలో వరి, పసుపు,అరటి, నిమ్మ పండించడం మొదలుపెట్టారు. వీళ్లకు 'గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం' అనే సంఘం ఉంది. రైతులంతా కలిసి ఒకరికొకరు మద్దతు ఇచ్చుకుంటూ పంటను మంచి రేటుకు అమ్ముతున్నారు. ఆ సమయంలోనే మార్కెట్‌లో కల్తీ నూనెలతో, పిండ్లతో తయారై వస్తున్న పిండి వంటలు తినలేక సేంద్రియ పిండివంటల కోసం కొందరు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. మా అబ్బాయి ప్రోత్సాహంతో రంగంలోకి దిగాను. మొదట వేరుశనగ ఉండలు చేశాం. నిడదవోలు, మాండ్య లాంటి చోట్ల నుంచి సేంద్రియ బెల్లం తెప్పించి చేశాం. రుచి భలే ఉండటంతో డిమాండ్ వచ్చింది. అలా ఒక్కోటి పెంచుకుంటూ వెళ్లాం. ఇవాళ 30 రకాల చిరుతిళ్లు తయారు చేస్తున్నాం' అని చెప్పింది బసవపూర్ణమ్మ. రాగిలడ్డు, జొన్న లడ్డు, నల్లబియ్యం అరిసెలు, నువ్వుండలు, పప్పుండలు, జంతికలు, కొబ్బరి లడ్డు, చెక్కలు ఇవి కాకుండా కరివేపాకు కారం, మునగాకు కారం వీరు తయారు చేస్తున్నారు. ఇక మామిడి, గోంగూర పచ్చడి గుంటూరు జిల్లా ప్రత్యేకం. అవీ చేస్తున్నారు. 'సేంద్రియ నూనె పేరుతో అమ్ముతున్న నూనెలు కూడా కరెక్ట్‌గా లేవు. చాలా నూనెలు ట్రై చేసి రాజస్థాన్‌లో ఒక చోట నుంచి మంచి సేంద్రియ నూనె తెప్పించి ఈ పిండి వంటలకు వాడుతున్నాం' అని తెలిపింది బసవ పూర్ణమ్మ.

ఆమె అజమాయిషీలో సాగే వంటశాలకు వెళితే చెట్టు కింద కట్టెలపొయ్యి మీద ఆముదం గింజలు కుతకుత ఉడికిస్తుంటారు కొందరు. వరండాలో జీడిపాకం ఆరబెట్టి, ఉండలు చుడుతుంటారు కొందరు. చిరుధాన్యాలతో లడ్డూలు, నల్లబియ్యంతో అరిసెలు చేస్తారు మరికొందరు. అంతా కళకళగా ఉంటుంది.

ఆముదం, కుంకుమ

'మార్కెట్‌లో సిసలైన ఆముదం దొరకడం లేదు. మా చిన్నప్పుడు ఎవరి ఆముదం వారే తయారు చేసుకునేవాళ్లం. అందుకనే ఆముదం కూడా తయారు చేస్తున్నా. లీటరు 800 పెట్టినా ఎగరేసుకుని పోతున్నారు. పసుపు నుంచి కుంకుమ తయారు చేసే పద్ధతి ఉంది. అలా స్వచ్ఛమైన కుంకుమ తయారు చేస్తున్నా. ఆముదం గింజల నుంచే కాటుక తయారు చేయవచ్చు. అదీ చేస్తున్నా. మా చిరుతిండ్ల కంటే వీటిని ఎక్కువమంది మెచ్చుకుని కొనుక్కుంటున్నారు' అని తెలిపింది బసవపూర్ణమ్మ. ఈ మొత్తం పనిలో పదిహేను మంది ప్రత్యక్షంగా మరో పదిహేనుమంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు.

కోటి టర్నోవర్‌కు...

వచ్చే మార్చికంతా కోటి టర్నోవర్‌కు ఈ పిండి వంటల పరిశ్రమ చేరుకోవచ్చని అంచనా. తూములూరు పిండి వంటలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని చాలా కేంద్రాల్లో అమ్ముడుపోతున్నాయి. కొందరు సరుకు తీసుకుని తమ బ్రాండ్ వేసుకుని అమ్ముకుంటున్నారు. సరుకు రవాణ మొత్తం ఆర్.టి.సి. కార్గో మీద ఆధారపడటం విశేషం. గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల సంఘం నగరాల్లో నిర్వహించే ప్రదర్శనల్లో తూములూరు పిండివంటల స్టాల్ కచ్చితంగా ఉంటోంది. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం నిర్వహించే సమావేశాలకూ ఈ పిండివంటలనే ఆర్డరు చేస్తున్నారు.

'ఈ రోజుల్లో ఆడవాళ్లకు పిండివంటలు చేసుకోవటం కష్టమవుతోంది. దీనికితోడు రసాయన అవశేషాలు లేని ఆహారపదార్థాలు దొరకటం దుర్లభంగా తయారైంది. అందుకే మాకు డిమాండ్ వస్తోంది. మరింతమంది రైతులను కలుపుకుని సేంద్రియ పంటలతో పిండివంటలను పరిశ్రమ స్థాయికి చేర్చాలనే ఆలోచన సంఘ సభ్యుల్లో ఉంది. అప్పుడు మా వంటశాలను విస్తరించాల్సి వస్తుంది' అని తెలిపింది బసవ పూర్ణమ్మ.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి

ఫ్యాషన్ బ్లాగర్‌గా ప్రయాణం మొదలుపెట్టింది ఢిల్లీకి చెందిన డాలీసింగ్. రైటర్, స్టైలిస్ట్, కంటెంట్ క్రియేటర్, ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయపథంలో దూసుకుపోతోంది. 'మనలో ఉన్న శక్తి ఏమిటో మనం చేసే పనే చెబుతుంది' అంటున్న 29 సంవత్సరాల డాలీసింగ్‌కు పనే బలం. ఆ బలమే తన విజయ రహస్యం...

నవ్వుల పువ్వుల దారిలో...

డాలీసింగ్ మాట్లాడితే చుట్టుపక్కల నవ్వుల పువ్వులు పూయాల్సిందే! ఆమె ఏం మాట్లాడినా సూటిగా ఉంటుంది. అదే సమయంలో ఫన్నీగా ఉంటుంది. 'స్పిల్ ది సాస్' అనే ఫ్యాషన్ బ్లాగ్‌తో ప్రయాణం మొదలు పెట్టింది. లైఫ్‌స్టైల్ పోర్టల్ 'ఐ-దివ' కోసం జూనియర్ రైటర్, స్టైలిస్ట్‌గా పనిచేసింది.

'రాజు కీ మమ్మీ' ఫన్నీ వీడియోలతో కంటెంట్ క్రియేషన్‌లోకి అడుగుపెట్టింది. ఈ వీడియోలు ఎంతో పాపులర్ అయ్యాయి. రోజువారి జీవితం నుంచే తన ఫన్నీ వీడియోలకు కావాల్సిన స్టఫ్‌ను ఎంపిక చేసుకునేది.

'బయట ఏదైన ఆసక్తికరమైన దృశ్యం కంటపడితే నోట్ చేసుకునేదాన్ని. ఆ తరువాత డెవలప్ చేసేదాన్ని. మనలోని శక్తి ఏమిటో మన రచనల్లో తెలిసిపోతుంది. రచన చేయడం అనేది నాకు ఎంతో ఇష్టమైన పని. ఎప్పటికప్పుడూ కొత్త కొత్త క్యారెక్టర్లను సృష్టించడానికి ప్రయత్నిస్తాను. ఐ-దివలో పనిచేస్తున్నప్పుడు స్క్రిప్ట్ రెడీ చేసుకోవడం అంటూ ఉండేది కాదు. ఒక టాపిక్ అనుకొని కెమెరా ముందుకు వచ్చి తోచినట్లుగా మాట్లాడడమే. ఆ తరువాత మాత్రం స్క్రిప్ట్ రాయడం మొదలైంది' అంటుంది డాలీ సింగ్. కామెడీ అయినా సరే, ప్రేక్షకులు కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. కాల్పనిక హాస్యం కంటే నిజజీవిత సంఘటనల నుంచి తీసుకున్న కామెడీనే ఇష్టపడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పంచ్‌లైన్స్ విషయంలో రకరకాలుగా ఎక్సర్‌సైజ్‌లు చేస్తుంటుంది డాలీ.

'ప్రేక్షకులను మెప్పించడం అనేది ఫన్ అండ్ చాలెంజింగ్‌గా ఉంటుంది. రెండు మూడు నెలలకు ఒకసారి రీస్టార్ట్ కావాల్సిందే. కంటెంట్ క్రియేషన్‌లో అతి ముఖ్యమైనది ఎప్పటికప్పుడు మనల్ని మనం పునరావిష్కరించుకోవడం' అంటుంది డాలీ.

తాము క్రియేట్ చేయాలనుకునేదానికీ, ప్రేక్షకులు ఇష్టపడుతున్న కంటెంట్‌కూ మధ్య కంటెంట్ క్రియేటర్ సమన్వయం సాధించాల్సి ఉంటుంది. మరి డాలీ సంగతి?

'అనేకసార్లు నిరాశపడిన సందర్భాలు ఉన్నాయి. మొదట్లో... నేను క్రియేట్ చేసేది ప్రేక్షకులకు నచ్చేది కాదు. వారికి నచ్చేది నాకు నచ్చేది కాదు. దీంతో ప్రేక్షకుల అభిరుచికి ప్రాధాన్యత ఇవ్వడం, ప్రేక్షకులు ఏం కోరుకుంటున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకోవడం మొదలుపెట్టాను' అంటుంది డాలీ.

కంటెంట్ క్రియేటర్‌లకు ఒత్తిడి అనేది సర్వసాధారణం. 'ఒత్తిడిని పనిలో భాగంగానే భావించాను. దాని నుంచి దూరం జరగడం అనేది కుదిరే పని కాదు. అయితే ఒత్తిడి ప్రభావం కంటెంట్‌పై పడకుండా జాగ్రత్త పడాలి' అంటుంది డాలీ. ఫ్యాషన్ బ్లాగర్, డిజిటల్ కంటెంట్ క్రియేటర్, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా గుర్తింపు పొందిన డాలీ అమెజాన్ ప్రైమ్ వీడియో వెబ్‌సిరీస్ 'మోడ్రన్ లవ్ ముంబై'తో నటిగా మంచి మార్కులు తెచ్చుకుంది.

'నేను విజయం సాధించాను అనుకోవడం కంటే, ఇప్పుడే బయలుదేరాను అనుకుంటాను. అప్పుడే ఫ్రెష్‌గా ఆలోచించడానికి, మరిన్ని విజయాలు సాధించడానికి వీలవుతుంది' అంటున్న డాలీసింగ్ ఒక షార్ట్‌ఫిల్మ్ కోసం స్క్రిప్ట్ రెడీ చేసుకుంటోంది. అందులో తానే నటించనుంది.

మల్టీ టాలెంట్


డాలీసింగ్

కిచెన్ టిప్స్

- పండిన అరటిపండు గుజ్జు, కొద్దిగా పెరుగు వేసి చపాతీ పిండిని ముద్దగా కలిపితే చపాతీలు మరింత మృదువుగా మెత్తగా, రుచికరంగా ఉంటాయి.
- సమోసా పిండిలో కొద్దిగా నిమ్మరసం వేసి కలిపితే సమోసాలు మరింత క్రిస్పీగా కరకరలాడతాయి.





సాగుబడి
మృగశిర కార్తె : జూన్ 8 నుంచి

ఆరుబయటే ఆరబెట్టి, నెట్టు కట్టొచ్చు!

- అత్యాధునిక బబుల్ డ్రయర్లు, కకూన్లతో ఎటువంటి విష రసాయనాలు వాడకుండానే ఇది సాధ్యం
- వరి ధాన్యం, మొక్కజొన్నలు, వేరుశనగలు.. విత్తనాలను సైతం బబుల్ డ్రయ్యర్ సమతుల్యంగా, సురక్షితంగా, సులువుగా ఆరబెడుతుంది..
- తాత్కాలిక గోదాముల (కకూన్ల)లో వ్యవసాయోత్పత్తులను పాడవ్వకుండా నిల్వ చేసుకోవచ్చు

రైతు కష్టాలు పంటల సాగులోనే కాదు, కోత అనంతరమూ కొనసాగుతాయి. వరి ధాన్యం, మొక్కజొన్నలు, మిరపకాయలు వంటి పంటలు ఏవైనా సక్రమంగా ఆరబెట్టుకొని జాగ్రత్త చేస్తేనే రైతుకు ఉన్నంతలో సరైన ధర దక్కుతుంది. అయితే, ధాన్యం, మొక్కజొన్నలు, మిరపకాయలు వంటి పంటలను సక్రమంగా ఆరబెట్టడం రైతులకు కష్టమైపోతోంది. మార్కెట్ యార్డుల్లో ఆరుబయట ధాన్యం కుప్పలు పోసుకొని ఎన్నో రోజులు ఎదురు చూడాల్సిన దుస్థితి మన రైతులు ఎదుర్కొంటుండటం విషాదకరం. ఒకటికి మూడు దఫాలు అకాల వర్షాలు విరుచుకుపడిన ఈ సంవత్సరం.. తడిసిన ధాన్యం బస్తాకు పది కిలోల తరుగు తీసేసి విక్రయించుకోవాల్సిన పరిస్థితులు కూడా రైతులకు ఎదురయ్యాయి. ఈ ఆధునిక కాలంలోనూ చేతికొచ్చిన పంటను చేజేతులా వానపాలు చేసుకొని వృథా చేసుకొని కష్టనష్టాలకు గురవ్వాల్సిందేనా...?

ముమ్మాటికీ లేదు!

వ్యవసాయోత్పత్తులను చక్కగా ఆరబెట్టుకునే అత్యాధునిక సాంకేతికతతో కూడిన 'మొబైల్ బబుల్ డ్రయ్యర్లు', ఆరుబయటే సురక్షితంగా నిల్వ చేసుకునే 'తాత్కాలిక గోదాములు' అందుబాటులోకి వచ్చేశాయి. నూర్చిన పంటను పొలాల దగ్గరే వేగంగా, సక్రమంగా, సులువుగా తక్కువ ఖర్చుతోనే 'బబుల్ డ్రయ్యర్ల'తో ఆరబెట్టుకోవచ్చు.

'ఇరి' పరిశోధనలు

ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఇరి–ఐఆర్‌ఆర్‌ఐ), జర్మనీకి చెందిన హొహెన్‌హీమ్ యూనివర్సిటీ, గ్రెయిన్‌ప్రో కంపెనీతో కలసి పరిశోధించి రూపొందించిన ఈ డ్రయ్యర్లు ఇప్పటికే అనేక దేశాల్లో రైతులు వినియోగిస్తున్నారు. వరి ధాన్యంతో పాటు మొక్కజొన్నలు, చిరుధాన్యాలు, మిరపకాయలు వంటి ఆహారోత్పత్తులను వర్షం, పశువులు, పక్షుల బెడద లేకుండా చక్కగా ఆరబెట్టుకుంటున్నారు.

'ఇరి' శాస్త్రవేత్త డా. మార్టిన్ గమ్మెట్ మాటల్లో చెప్పాలంటే.. పరదాలపైన, రోడ్లపైన ధాన్యాలను ఆరబెట్టుకునే రైతులు 15–30% వరకు ధాన్యాలను రైతులు నష్టపోతున్నారు. నాణ్యత క్షీణించటం వల్ల రైతుకు మంచి ధర దక్కటం లేదు. వరి ధాన్యాన్ని కంబైన్ హార్వెస్టర్‌తో నూర్చిన తర్వాత తేమ 20–24% వరకు ఉంటుంది. ఆ ధాన్యాన్ని బూజు పట్టకుండా, పురుగు పట్టకుండా నిల్వ చేయాలంటే తేమ శాతం 14కి తగ్గే వరకు ఆరబెట్టాలి. 'ఇరి'లో పరిశోధనలు, ప్రమాణీకరణ పూర్తయిన తర్వాత ఈ సోలార్ బబుల్ డ్రయ్యర్లను 2016 నుంచే దక్షిణాసియా దేశాల్లో వినియోగిస్తున్నారు. ఈ అత్యాధునిక డ్రయ్యర్లు ప్రస్తుతం భారత్‌లో కూడా అందుబాటులోకి వచ్చాయి.

కోత అనంతర వృథా 31%

చేతికి వచ్చిన ఆహార ధాన్యాలు తేమ ఆరబెట్టుకొని అమ్ముకునే లోగా 14%, వ్యాపారులు, వినియోగదారుల చేతుల్లో మరో 17% (మొత్తం 31%) వృథా అవుతోంది. ఇలా వృథా అయ్యే ఆహారం విలువ 40 వేల కోట్ల డాలర్ల మేరకు ఉంటుందని ఐరాసకు చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) లెక్కగట్టింది. ప్రపంచంలో 82.8 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ ఆకలితో అలమటిస్తున్న నేపథ్యంలో ఆహార వృథా ఇంత ఎక్కువగా జరుగుతూ ఉండటం మన మనసులను కలచి వేసే కఠోర వాస్తవం.


సోలార్ బబుల్ డ్రయ్యర్‌ను చదరంగా ఉండే నేలపై పెట్టుకొని ధాన్యాన్ని ఆరబెట్టుకోవచ్చు


ధాన్యం ఆరబెడుతున్నప్పుడు డ్రయ్యర్ లోపలి దృశ్యం

బబుల్ డ్రయ్యర్‌ను రైతులే నిర్వహించుకోవచ్చు

ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా ఆహార ధాన్యాలను పరిశుభ్రంగా, సురక్షితంగా, తక్కువ ఖర్చుతో ఆరబెట్టుకోవడానికి సోలార్ బబుల్ డ్రయ్యర్ ఉపయోగపడుతోంది. బబుల్ డ్రయ్యర్ సోలార్‌తో నడిచే మోడల్‌తో పాటు, విద్యుత్‌తో నడిచే మోడల్ కూడా ఉంది. వాడుతున్నప్పుడు పైకి చూడటానికి పొడవాటి బుడగ మాదిరిగా, లోపల కందకం మాదిరిగా ఉంటుంది. యూవీ రెసిస్టెంట్ పాలీఎథిలిన్ టాప్ కవర్, బ్లాక్ పీవీసీ డ్రైయింగ్ ఫ్లోర్ ఉంటాయి. టార్పాలిన్ పరదా మాదిరిగా చుట్టి దీన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్ల వచ్చు. చదునుగా ఉన్న నేల మీద పరుచుకొని రకరకాల వ్యవసాయోత్పత్తులను ఆరబెట్టుకోవచ్చు. పని పూర్తయిన తర్వాత మళ్లీ మడచి తీసుకెళ్లిపోవచ్చు. టెక్నీషియన్లు అవసరం లేదు. రైతులే దీన్ని నిర్వహించుకోవచ్చు.

గ్రెయిన్‌ప్రో సంస్థ రైతులకు అందుబాటులోకి తెచ్చిన చిన్న బబుల్ డ్రయ్యర్ వెడల్పు 2 మీటర్లు, పొడవు 15 మీటర్లు ఉంటుంది. పెద్ద బబుల్ డ్రయ్యర్ పొడవు 26 మీటర్లు. ఈ రెంటిలోనూ విద్యుత్‌తో నడిచే వాటితో పాటు సౌర విద్యుత్తుతో పనిచేసేవి కూడా ఉన్నాయి. గంటకు ఒక శాతం తేమను తగ్గించగలుగుతాయని గ్రెయిన్ ప్రో సంస్థ దక్షిణాది ప్రతినిధి గోపీనాథ్ వడివేలు 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

బ్యాచ్‌కు 6-8 గంటల సమయం

వరి ధాన్యాన్ని ఆరబెట్టడానికి 6–8 గంటల సమయం పడుతుందని గోపీనాథ్ తెలిపారు. చిన్న బబుల్ డ్రయ్యర్‌తో ఒక బ్యాచ్‌లో 500 కిలోల వరి ధాన్యం, మొక్కజొన్నలను ఆరబెట్టుకోవచ్చు. పెద్ద డ్రయ్యర్‌తో టన్ను ధాన్యాన్ని ఆరబెట్టవచ్చు. చిన్న సోలార్ బబుల్ డ్రయ్యర్ ధర రూ. 1,35,000, విద్యుత్‌తో నడిచే చిన్న బబుల్ డ్రయ్యర్ ధర రూ. 95,000 ఉంటుంది. పెద్ద సోలార్ బబుల్ డ్రయ్యర్ ధర రూ. 2,05,000, విద్యుత్‌తో నడిచే పెద్ద బబుల్ డ్రయ్యర్ ధర రూ. 1,40,000 ఉంటుంది. మార్కెట్ యార్డులు, సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, కస్టమ్ హైరింగ్ సెంటర్లు పెట్టుబడి పెట్టి వీటిని చిన్న, సన్నకారు రైతులకు అందుబాటులోకి తేవచ్చు. చేతికి వచ్చిన ఒక్క గింజ కూడా తడవకూడదు, వరదకు కొట్టుకుపోకూడదు, బూజు పట్టకూడదు.. అని మనం దరం కంకణం కట్టుకోవాల్సిన తరుణం ఇది.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్

తాత్కాలిక గోదాములు.. కకూన్స్!


ధాన్యం బస్తాలను ఆరుబయట ఇలా నెట్టుకట్టి.. కకూన్‌కు జిప్ వేస్తే చాలు..



పంటను పండించటం, సక్రమంగా ఆరబెట్టడంతోపాటు వానకు, వరదకు, ఎండకు పాడవ్వకుండా.. పురుగు, బూజు పట్టకుండా నెట్టు కట్టి నిల్వ చేసుకోవటం అవసరం. సీజన్‌లో గోదాములు చాలవు. ఇళ్ల దగ్గర లేదా మార్కెట్ యార్డుల్లో లేదా మిల్లుల దగ్గరైనా ఆరుబయట తాత్కాలికంగా గుడారాల్లాంటి గోదాములు ఏర్పాటు చేసుకోవచ్చు. గ్రెయిన్ ప్రో సంస్థ 'కకూన్స్' పేరేతో వీటిని అందుబాటులోకి తెచ్చింది. యూవీ రెసిస్టెంట్ పోలీవినిల్ క్లోరైడ్‌తో తయారైన ఈ కకూన్స్‌లో ఇండోర్, అవుట్‌డోర్‌లో వ్యవసాయోత్పత్తుల్ని సురక్షితంగా నిల్వ చేసుకోవచ్చు. రసాయనాలు వాడకుండానే పురుగు, బూజు పట్టకుండా నిల్వ చేసుకోవచ్చు. ఆహార ధాన్యాలనే కాకుండా విత్తన ధాన్యాలను సైతం రసాయన రహితంగా నిల్వ చేసుకోవచ్చు. సేంద్రియ ఆహారోత్పత్తులను సైతం రుచి, రంగు, వాసన మారకుండా ఆరుబయట కూడా నిల్వ చేసుకోవడానికి ఈ కకూన్స్ ఉపయోగపడతాయి. తీవ్రమైన ఎండ, వర్షాల నుంచే కాకుండా రెండు అడుగుల ఎత్తున వరద నీటిని కూడా ఇది తట్టుకొని ఆహారోత్పత్తులను కాపాడుతుందని గ్రెయిన్ ప్రొ సంస్థ (customercare @grainpro.com) చెబుతోంది. మార్కెట్ యార్డు యాజమాన్యాలు, సహకార సంఘాలు, ఎఫ్.పి.ఓ.లు, కస్టం హైరింగ్ సెంటర్లు ఈ తాత్కాలిక గోదాములను పుష్కలంగా అందుబాటులోకి తెస్తే.. రైతుల కష్టనష్టాలు తగ్గుతాయి. కోత అనంతర ఆహార వృథా తగ్గుతుంది.

ఆక్వా చెరువుల కాలుష్యానికి చెక్.. రొయ్యలు, చేపలతో పాటే సీవీడ్స్ సాగు

ఆక్వా చెరువుల్లో రొయ్యలు, చేపలతో పాటు పోషకాల పుట్ట వంటి సీవీడ్స్‌ను కూడా కాలుష్య రహితంగా సాగు చేసే అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి రానుంది. చెరువుల్లో రొయ్యలు, చేపలను పెంచే క్రమంలో వెలువడే మురుగునీటిని సముద్రంలోకి వదలటం, దీనివల్ల సముద్రపు నీరు కలుషితమవుతుంటుంది. అయితే, ఆక్వా చెరువుల నుంచి మురుగునీటితో కంటెయినర్లలో సీ లెట్యూస్ (సముద్రపు పాలకూర) వంటి అధిక మాంసకృత్తులు, అధిక పీచుపదార్థం కలిగిన సీవీడ్స్‌ను పెంచటంతో పాటు నీటిని కాలుష్యరహితంగా మార్చి సముద్రంలోకి వదిలేందుకు వీలయ్యే పర్యావరణ అనుకూల సాంకేతికత ఆవిష్కృతమైంది. చేపలు, రొయ్యలు, సీవీడ్స్‌ను ఏకకాలంలో కాలుష్యరహితంగా సాగు చేసేందుకు మార్గం సుగమం కానుంది.

డెన్మార్క్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కోపెన్‌హగెన్ ఈ సాంకేతికతను రూపొందించింది. లోతైన పరిశోధనల కోసం 'ఇన్నోవేషన్ ఫండ్ డెన్మార్క్' నిధులు సమకూర్చుతోంది. యూనివర్సిటీ ఆఫ్ కోపెన్‌హగెన్ పరిశోధకులు, ఆర్హస్ యూనివర్సిటీ, పలు కంపెనీలతో కలసి లోతైన పరిశోధనలు చేపట్టబోతున్నారు. అత్యంత విలువైన ఈ సముద్రపు పాలకూరను అంతర్జాతీయంగా ఆహార, ఔషధ పరిశ్రమల్లో వినియోగిస్తున్నందున దీన్ని పెద్ద ఎత్తున సాగు చేయటం వల్ల ఎగుమతి అవకాశాలు ఏర్పడతాయి. తద్వారా ఆక్వా రైతులకు మరింత ఆదాయం చేకూరే అవకాశం ఉంది. ఈ సీవీడ్ మధుమేహం నివారణకు ఉపకరిస్తుందంటున్నారు. సముద్రంలో కలిసే ఆక్వా చెరువుల వ్యర్థ జలాల కాలుష్యాన్ని నివారించడంతో పాటు ఆరోగ్యదాకమైన సీవీడ్ ఉత్పత్తి సంతోషదాయకమని యూనివర్సిటీ ఆఫ్ కెపెన్ హగెన్ ఫుడ్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ మరియన్నె థామ్సెన్ అన్నారు. వెయ్యి లీటర్ల ఆక్వా సాగు ట్యాంకులకు అనుసంధానం చేసిన 40 అడుగుల కంటెయినర్లలో సీలెట్యూస్‌ను పెంచుతారు. ఆక్వా చెరువుల నుంచి వెలువడే మురుగు నీరు, ఉప్పునీటిలో కార్బన్‌డయాక్సయిడ్, కొన్ని పోషకాలను కలిపి ఎల్ఇడీ లైట్లను ఉపయోగించి ఒక బ్యాచ్ సీలెట్యూస్‌ను వారం రోజుల్లో ఉత్పత్తి చేస్తున్నట్లు ప్రొ. మరియన్నె తెలిపారు. రొయ్యలు, చేపలతో పాటు ఆరోగ్యదాయకమైన, పీచు, ప్రొటీన్ అధికంగా ఉండే సీవీడ్స్‌కు అంతర్జాతీయంగా మంచి గిరాకీ ఉంటుందంటున్నారు. ఈ సాంకేతికత రైతులకు అందుబాటులోకి రావాలంటే మరో నాలుగేళ్లు ఎదురుచూడాల్సి ఉంది.


కంటెయినర్లలో సీలెట్యూస్ పెంపకం.. వారానికో పంట..


సీలెట్యూస్ (సముద్రపు పాలకూర)

12న గోఆధారిత వ్యవసాయంపై శిక్షణ

మహబుబాబాద్ జిల్లా తాళ్లపూసపల్లిలోని ఈ నెల 12 (సోమవారం)న ఉ. 9.30 గంటల నుంచి జాతీయ ఉత్తమ రైతు పురస్కార గ్రహీత జైపాల్‌రెడ్డి మామిడి తోటలో రైతులకు శిక్షణ ఇస్తారు. ఆదిగురు భారత సంఘం, అరబిందో ఫార్మా, జేడీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో విత్తనాలు, గోకృపామృతం ఉచితంగా ఇచ్చిపుచ్చుకునే ఏర్పాటు ఉంది. పాల్గొనదలచిన రైతులు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలి. అందరూ ఆహ్వానితులే. వివరాలకు.. 70953 14226, 91002 50504.


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 262

మంగళవారం 6-6-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



55 ఏళ్ల తర్వాత..

ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్‌లో బ్రెజిల్ క్రీడాకారిణి బీత్రిజ్ - 10లో



18,600కు చేరువలో నిఫ్టీ

కలిసొచ్చిన ప్రపంచ పరిణామాలు.. రెండో రోజూ లాభాలు - 11లో



గ్యాంగ్‌స్టర్ అన్సారీకి జీవిత ఖైదు

కాంగ్రెస్ నేత సోదరుడి హత్య కేసులో గ్యాంగ్‌స్టర్, రాజకీయ నేత ముఖ్తార్ అన్సారీకి వారణాసి కోర్టు జీవిత ఖైదు విధించింది.

వివరాలు 6లో ▸



దడ పుట్టించిన విమానం ఛేజింగ్

అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ఓ చిన్న విమానాన్ని యుద్ధ విమానం వెంబడించడం కలకలం రేపింది.

వివరాలు 6లో ▸



ఉరికొయ్యలే దిక్కై!

తాలిబాన్ల ఆంక్షలతో అఫ్గాన్ యువతులు నరకం అనుభవిస్తున్నారు. చదువులు, ఉద్యోగాల్లేక ఆత్మహత్యాయత్నాలు చేస్తున్నారు.

వివరాలు 6లో ▸



నిరసనలకు విరామం

రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌పై చర్యలు తీసుకోవాలని పోరాడుతున్న రెజ్లర్లు భజరంగ్, సాక్షి తమ ఉద్యోగాల్లో చేరారు.

వివరాలు 10లో ▸

మెరుగైన పెన్షన్..?

ముఖ్యమంత్రి మదిలో ఆలోచన.. ఇందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం

మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం

- ఓపీఎస్‌తో దాదాపు సమానంగా పెన్షన్ విధానం
- పదవీ విరమణ సమయంలోని మూలవేతనంలో 50% పెన్షన్
- ఓపీఎస్ పెన్షనర్లకు ఇస్తున్నట్లుగానే కరువు భృతి (డీఆర్)..
- పీఆర్సీ ప్రయోజనాలు మినహా మిగతావన్నీ ఓపీఎస్ మాదిరిగానే
- డీఆర్ ఇస్తూ వెళ్తే ద్రవ్యోల్బణం మేరకు పెన్షన్ కూడా పెరుగుతుంది
- ధరల పెరుగుదల భారం నుంచి తప్పించే ప్రయత్నం
- ఉద్యోగులు ఇప్పుడు చెల్లిస్తున్న 10 శాతం చెల్లిస్తే చాలు



ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చిస్తున్న మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేశ్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: పదవీ విరమణ పొందిన ఉద్యోగుల జీవితాలకు ఆర్థిక భద్రత, భరోసా కల్పించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా సీపీఎస్ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ విధానం ప్రతిపాదనలు సిద్ధమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. సీపీఎస్ ఫండ్ గణాంకాల ప్రకారం చూస్తే ఉద్యోగి ఆఖరి నెల మూల వేతనంలో గరిష్టంగా 20 శాతం మాత్రమే పెన్షన్‌గా వస్తుందని శాస్త్రీయ లెక్కలు వెల్లడిస్తున్నాయి. అది కూడా స్థిరంగా ఉండి పెన్షనర్ జీవితకాలంలో పెరగదు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని 33 శాతం పెన్షన్ గ్యారంటీ కల్పిస్తామని గతంలో ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ద్రవ్యోల్బణం పెరుగుదల వల్ల జీవన వ్యయం అధికమై పెన్షనర్లు ఇబ్బందులు పడతారని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వం దృష్టికి తెచ్చాయి. ఈ నేపథ్యంలో పదవీ విరమణ చేసిన తర్వాత ఉద్యోగులకు ఆర్థిక భద్రత, భరోసా కల్పించాలన్న ముఖ్యమంత్రి జగన్ సూచన మేరకు ఓపీఎస్ విధానంలో

మిగతా 2వ పేజీలో ▶

మిగతా రాష్ట్రాలకూ అనుసరణీయం

కొన్ని రాష్ట్రాలు రాజకీయ కారణాలతో ఓపీఎస్‌కు వెళుతున్నట్లు ప్రకటించినా వాస్తవంగా అది ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రాల సొంత రాబడిలో పెన్షన్ల వ్యయం భారీగా పెరిగితే అప్పుడు మళ్లీ సీపీఎస్‌కు తిరిగి రావాల్సిన పరిస్థితులు ఏర్పడటం ఖాయమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల సంక్షేమం, ఆర్థిక భద్రత పట్ల చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి జగన్ ఆలోచనలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న ఈ మెరుగైన పెన్షన్ విధానమే మిగతా రాష్ట్రాలకూ అనుసరణీయం.

'కాంట్రాక్టు' క్రమబద్ధీకరణ!

- 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు వర్తింపు.. త్వరలో 12వ పీఆర్సీ కమిషన్ నియామకం
- ఇకపై వైద్య విధాన పరిషత్ ఉద్యోగులంతా ప్రభుత్వ ఉద్యోగులే.. నాలుగేళ్లలో పీఆర్సీ, డీఏ బకాయిల చెల్లింపు
- ఉద్యోగులకు పలు వరాలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఉద్యోగ సంఘాలతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం

- వివరాలు 2లో

71 డిమాండ్లు నెరవేరాయి

బండి శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు

అన్నీ పాజిటివ్ అంశాలే

వెంకట్రామిరెడ్డి, అధ్యక్షుడు, సచివాలయ ఉద్యోగుల సంఘం

ఉద్యోగులకు అనుకూలంగా నిర్ణయాలు

బొప్పరాజు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు

2లో

న్యూస్‌రీల్

పేదల ఇళ్లపై పిచ్చి రాతలు.. బాబు కొంప కొల్లేరవుతుందనే!



ఫ్యాక్ట్ చెక్

రాష్ట్రంలోని 30 లక్షలకు పైగా పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తూ 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం అమలుచేస్తోంది. దీని వల్ల టీడీపీకి రాజకీయ భవిష్యత్ ఉండదని ఎల్లో మీడియా ఈ పథకంపై తొలి నుంచీ తప్పుడు రాతలు రాస్తోంది. తాజాగా మరోసారి 'పల్లె పేదలకు ఒక్క ఇల్లూ కట్టలేదు' అంటూ 'ఈనాడు' విషం కక్కింది.

వివరాలు 12లో ▸

భారత్-అమెరికా 'డిఫెన్స్' రోడ్ మ్యాప్ ఖరారు



రక్షణ రంగంలో అమెరికా, భారత్ మధ్య పరస్పర సహకారానికి రోడ్ మ్యాప్ ఖరారైంది. రక్షణ పారిశ్రామిక రంగంతో పాటు రక్షణ ఉత్పత్తుల తయారీలో ఇకపై ఇరు దేశాలు సహకరించుకుంటాయి. ఈ మేరకు ఢిల్లీలో భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ సమావేశమై రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు.

వివరాలు 6లో ▸

ఈ నెల 12న విత్తన మహోత్సవం



ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గుంటూరు లాంలో ఈనెల 12న విత్తన మహోత్సవం నిర్వహిస్తున్నట్టు వర్సిటీ వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. వర్సిటీ ఇప్పటి వరకు అభివృద్ధి చేసిన అన్ని రకాల పంటల విత్తనాలను ప్రదర్శించడంతో పాటు తొలిసారి అమ్మకానికి అందుబాటులో ఉంచుతున్నట్టు పేర్కొన్నారు.

వివరాలు 12లో ▸

ఎంఎస్‌ఎంఈలపై త్రిముఖ సూత్రం

డిమాండ్, టెక్నాలజీ, మార్కెటింగ్‌పై ప్రధానంగా దృష్టి

ఎగుమతులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం మార్గదర్శనం

- మెరుగైన మార్కెట్ కోసం ఎంఎన్‌సీలతో అనుసంధానం
- పరిశ్రమల శాఖలో ప్రత్యేక విభాగం, కార్యదర్శి నియామకం
- ఐటీ, ఐటీ ఆధారిత సేవలతో అంతర్జాతీయ హబ్‌గా విశాఖ
- ఫుడ్ ప్రాసెసింగ్ పెట్టుబడులు వేగంగా కార్యరూపం దాల్చాలి
- విశాఖ సదస్సు ఒప్పందాల అమలుపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్ ఆదేశం.. జీఎస్‌డీపీలో పారిశ్రామిక రంగం వాటా 21 నుంచి 23 శాతానికి పెరుగుదల




సాక్షి, అమరావతి: అత్యధిక సంఖ్యలో ఉపాధి కల్పిస్తూ పారిశ్రామిక రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమల ఎగుమతులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వివిధ దేశాలకు ఎగుమతులు చేసే విధంగా డిమాండ్, టెక్నాలజీ, మార్కెటింగ్ లాంటి మూడు అంశాలపై ప్రధానంగా దృష్టిపెట్టి ప్రభుత్వం మార్గదర్శనం చేయాలని సూచించారు. ఎంఎస్‌ఎంఈలు తయారు చేసే ఉత్పత్తులను విక్రయించేందుకు కేవలం స్థానిక మార్కెట్లపైనే ఆధారపడకుండా ఎంఎన్‌సీలతో (బహుళజాతి కంపెనీలు) అనుసంధానిస్తే మెరుగైన మార్కెటింగ్ ఫలితాలు ఉంటాయని

మిగతా 2వ పేజీలో ▶

'నైరుతి' దోబూచులాట!

రాష్ట్రంలో మరో 10 రోజులపాటు ఉష్ణతాపం



- బంగాళాఖాతంలో తేమను లాక్కెళ్లిపోయిన 'మోకా' తుపాను
- తూర్పు గాలులను బలహీనపర్చిన పశ్చిమ ఆటంకాలు.. 'నైరుతి' రాకకు ఈ రెండూ ప్రతిబంధకాలే
- ఈ నెల 15వ తేదీ వరకు అడపాదడపా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు

- వివరాలు 5లో

ఐఐటీ–మద్రాస్ నంబర్‌వన్

- 14వ ర్యాంకులో ఐఐటీ–హైదరాబాద్, 20వ స్థానంలో హెచ్‌సీయూ
- మొదటి వంద ర్యాంకుల్లో ఆంధ్రా, నిట్, ఉస్మానియా యూనివర్సిటీలు
- ర్యాంకింగ్ నివేదిక విడుదల చేసిన కేంద్ర మంత్రి రాజ్‌కుమార్ రంజన్ సింగ్

12లో

జాతీయ ర్యాంకుల్లో మెరిసిన ఏపీ వర్సిటీలు

25 ఉన్నత విద్యాసంస్థలకు ర్యాంకులు



గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు వద్ద ఘటనా స్థలంలో బోల్తా పడి ఉన్న ట్రాక్టర్



ట్రాక్టర్ బోల్తా.. ఏడుగురు దుర్మరణం

- 18 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం.. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులో ఘోర ప్రమాదం.. మృతులంతా కొండేపాడుకు చెందిన మహిళలే
- బంధువుల ఇంట్లో శుభకార్యానికి ట్రాక్టర్‌పై వెళ్తుండగా దుర్ఘటన
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ప్రత్తిపాడు: బంధువుల ఇంట్లో శుభకార్యానికి ట్రాక్టర్‌పై బయలుదేరిన మహిళలు గమ్యస్థానానికి చేరుకోకుండానే మృత్యువాత పడ్డారు. ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఏడుగురు మహిళలు దుర్మరణం పాలవ్వగా, 18 మంది గాయాల పాలయ్యారు. ఈ దుర్ఘటన సోమవారం మధ్యాహ్నం గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం కొండేపాడు దళితవాడకు చెందిన 30 మంది

మిగతా 12వ పేజీలో ▶

ఇదం జగత్




ఈ కుట్రకు కారణం ఇతనే.. చర్యలు తీసుకోండి!!

- ఫలించిన సీఎం జగన్ కృషి

పోలవరం తొలిదశకు రూ.12,911 కోట్లు

మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం

- బిల్లుల చెల్లింపులో విభాగాల వారీగా విధించిన పరిమితులు తొలగింపునకూ అంగీకారం
- 2013–14 ధరలను పక్కనపెట్టి తాజా ధరల మేరకు నిధులిచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్
- ఈ మేరకు రాష్ట్రానికి కేంద్ర ఆర్థిక శాఖ లేఖ
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆమోదించినట్లు అందులో స్పష్టీకరణ
- దీంతో పోలవరానికి నిధుల సమస్య పరిష్కారమైనట్లే అంటున్న అధికార వర్గాలు
- రూ.10 వేల కోట్లు అడ్‌హాక్‌గా ఇచ్చి ప్రాజెక్టు సత్వర పూర్తికి సహకరించాలని ప్రధానిని కోరిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- అందుకు మోదీ సానుకూల స్పందన
- నిధుల విడుదలకు కేంద్ర జలశక్తి శాఖకు ఆదేశం



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ కృషి ఫలించింది. పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదలపై కేంద్రం శుభవార్త చెప్పింది. రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించింది. బిల్లుల చెల్లింపులో విభాగాల వారీగా పెట్టిన పరిమితులను తొలగించడానికి కూడా ఓకే చెప్పింది. అలాగే, ప్రాజెక్టుకు 2013–14 ధరలతో కాకుండా తాజా ధరలతో నిధులిచ్చేందుకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ (వ్యయ విభాగం) డైరెక్టర్ ఎల్‌కే త్రివేది సోమవారం రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్‌కు లేఖ రాశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇందుకు ఆమోదం తెలిపారని ఆ లేఖలో పేర్కొన్నారు. 2013–14 ధరల ప్రకారం పోలవరానికి నిధులిచ్చేందుకు గతంలో కేంద్రమంత్రిమండలి ఆమోదించిన నేపథ్యంలో

మిగతా 11వ పేజీలో ▶

దశాబ్దాల కల దరిదాపుల్లో!

- పోలవరం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం జగన్
- రికార్డు సమయంలో స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్ పూర్తి.. కాఫర్ డ్యామ్ ఎత్తు 44 మీటర్లకు పెంపు
- 31.5 మీటర్ల ఎత్తుతో దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి
- నేడు క్షేత్ర స్థాయిలో పరిశీలించి దిశానిర్దేశం చేయనున్న సీఎం

11లో

హజ్ యాత్రకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి హజ్ యాత్ర ప్రారంభం.. నంబూరు మదరసాలో బస ఏర్పాట్లు
- భోజన, వసతితో పాటు విమానాశ్రయానికి రవాణా సౌకర్యం
- విజయవాడకు ఎంబార్కేషన్ పాయింట్‌తో సర్వత్రా హర్షం

2లో

క్లుప్తంగా...

ఎంనెక్-2023కు భారత యుద్ధ నౌక ఐఎన్ఎస్ సాత్పురా

ఈనెల 8 వరకు ఇండోనేసియాలో విన్యాసాలు



ఎంనెక్ విన్యాసాల్లో ఐఎన్ఎస్ సాత్పురా

సాక్షి, విశాఖపట్నం: ఇండోనేసియాలో జరిగే మల్టీలేటరల్ నేవల్ ఎక్సర్‌సైజ్ కుమడో(ఎంనెక్)-2023లో పాల్గొనేందుకు తూర్పు నౌకాదళం నుంచి ఐఎన్ఎస్ సాత్పురా యుద్ధ నౌకను భారత నేవీ పంపించింది. సాత్పురాలో మకస్సర్ తీరానికి చేరుకున్న భారత నౌకాదళ బృందానికి అక్కడి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 8 వరకు ఆసియా దేశాల ఆధ్వర్యంలో విన్యాసాలు జరగనున్నాయి. సోమవారం జరిగిన సిటీ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో భారత నౌకాదళ బృందం పాల్గొంది. అలాగే ఇండోనేసియాలో త్వరలో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు సంబంధించి ఆ దేశ అధ్యక్షుడు జోకో విడోడో సమీక్ష నిర్వహించారు. ఇందులో సముద్ర భద్రతపై చర్చించారు.

రూ.2 వేల నోట్ల మార్పిడి పేరిట టోకరా

- రూ.60 లక్షలతో ఉడాయించిన గ్యాంగ్
- రాజమహేంద్రవరంలోనూ ఇదే తరహా మోసం

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖ నగరంలో రూ.2 వేల నోట్ల మార్పిడి పేరిట రూ.60 లక్షలతో ఉడాయించిన గ్యాంగ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు రహస్యంగా దర్యాప్తు చేస్తున్నారు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. విశాఖకు చెందిన ధర్మరాజు అనే వ్యక్తి రూ.90 లక్షల విలువైన రూ.500 నోట్లు ఇస్తే.. రూ.కోటి విలువైన రూ.2 వేల నోట్లు ఇస్తామంటూ తనకు తెలిసిన వారిని నమ్మించాడు. విషయం తెలుసుకున్న భీమిలికి చెందిన ఎం.రామారావు అనే వ్యక్తి తన స్నేహితుల ద్వారా విజయవాడ నుంచి రూ.90 లక్షల విలువైన రూ.500 నోట్లు తెప్పించారు. వాటిని భీమిలికి చెందిన కొయ్య అప్పలరెడ్డి సహాయంతో శనివారం సాయంత్రం గొల్లలపాలెం ఎస్‌బీఐ బ్యాంక్ వద్దకు వెళ్లి.. అప్పటికే అక్కడకు చేరుకున్న ధర్మరాజు, అతని స్నేహితులు కాకినాడకు చెందిన ఎండీ అహ్మద్, సునీల్ అలియాస్ చిన్నాను కలిశారు. నగదు మారుస్తామని చెప్పిన ధర్మరాజు, అతని స్నేహితులు అహ్మద్, సునీల్ కలిసి రామారావు నుంచి రూ.60 లక్షలు తీసుకుని మోటార్ సైకిల్‌పై ఉడాయించారు. వారి కోసం వెతికినా కనిపించకపోవడం, ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో మోసపోయానని గ్రహించి రామారావు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు గంట వ్యవధిలోనే ధర్మరాజుతో పాటు అతని గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకుని రూ.60 లక్షలు రికవరీ చేశారు. ఈ గ్యాంగ్ వెనుక ఉన్న సూత్రధారులెవరు, ఎంతమందిని మోసం చేశారనే విషయాలపై పోలీసులు రహస్యంగా దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ఇదే తరహాలో రాజమండ్రిలో కూడా ఒక కేసు నమోదైనట్టు తెలుస్తోంది.

ఘనంగా సుమలత తనయుడి వివాహం



నూతన వధూవరులతో కేజీఎఫ్ హీరో యశ్ దంపతులు, సుమలత

ప్రముఖ నటి, ఎంపీ సుమలత కుమారుడు అభిషేక్ వివాహం సోమవారం వైభవంగా జరిగింది. బెంగుళూరులోని ప్యాలెస్ మైదానంలో అవీవా బిద్దప్ప, అభిషేక్ మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సూపర్‌స్టార్ రజనీకాంత్, మోహన్‌బాబు, కన్నడ నటులు యశ్, సుదీప్, క్రికెటర్ అనిల్ కుంబ్లే దంపతులు, నరేశ్, పవిత్రా లోకేశ్‌తో పాటు పలువురు రాజకీయ నేతలు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. – బనశంకరి

తెలంగాణ

ఆకాంక్షలు నెరవేర్చే నాయకత్వం కావాలి: కేసీఆర్

మణికొండ (హైదరాబాద్): దేశ ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుంటూ పనిచేసే సమర్థవంతమైన నాయకత్వం వర్తమాన దేశానికి అవసరమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. సమాజాభివృద్ధికి దోహదం చేసే దిశగా నాయకత్వాన్ని తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ఇందుకోసం రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, సైద్ధాంతిక రంగాల్లో బోధన, శిక్షణ అవసరమని తెలిపారు. వీటన్నిటినీ ఒకేచోట అందించేందుకు భారత్ భవన్ (సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్) నిర్మాణం చేపడుతున్నామన్నారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్మిస్తున్న భారత్ భవన్ పనులను సీఎం ప్రారంభించి మాట్లాడారు.

హజ్ యాత్రకు సర్వం సిద్ధం

సాక్షి, అమరావతి: హజ్–2023 యాత్రకు సర్వం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్ యాత్ర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ యాత్ర విజయవంతంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో విజయవాడకు ఎంబార్కేషన్ పాయింట్ సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. యాత్రికులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఏపీ హజ్ కమిటీ పూర్తి చేసింది. అవసరమైన మార్గదర్శకాలను సైతం అందజేసింది. విజయవాడ–గుంటూరు జాతీయ రహదారి చెంతనే ఉన్న నంబూరు వద్ద మదరసాలో హాజీలకు బస ఏర్పాట్లు చేశారు. వారికి భోజన, వసతితో పాటు గన్నవరం విమానాశ్రయానికి బస్సుల ద్వారా రవాణా సౌకర్యం కల్పించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పలు శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. హాజీలకు వసతి, భోజనం, రవాణా, వైద్యం తదితర అంశాల్లో అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించేలా హజ్ కమిటీ ప్రత్యేకంగా కమిటీలను కూడా వేసింది.

41 రోజులు పవిత్ర యాత్ర

ప్రత్యేక విమానంలో వెళ్లే ఒక్కో బృందం 41 రోజుల పాటు పవిత్ర హజ్ యాత్ర చేసి స్వరాష్ట్రానికి తిరిగిరానుంది. రాష్ట్రం నుంచి హజ్–2023 యాత్రకు మొత్తం 2,116 మంది ఎంపిక కాగా, వారిలో 1,115 మంది పురుషులు, 1,001 మంది మహిళలు ఉన్నారు. వారిలో విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1,814 మంది వెళ్తున్నారు. వారిపై పడుతున్న అదనపు భారం రూ. 14.51 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విషయం తెల్సిందే. కాగా మరో 254 మంది సమీపంలోని బెంగళూరు విమానాశ్రయం నుంచి, ఇంకో 48 మంది హైదరాబాద్ విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు వెళ్తున్నారు.



హజ్ యాత్రికుల బస కేంద్రంలో ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా

హాజీల బస ఏర్పాట్లు పరిశీలించిన అంజాద్ బాషా

నంబూరు మదరసాలోని హజ్ యాత్రికుల బస కేంద్రాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా సోమవారం రాత్రి పరిశీలించారు. తాత్కాలిక హజ్ హౌస్‌గా పరిగణిస్తున్న ఈ కేంద్రంలో ఏర్పాట్లపై అధికారులు, హజ్ కమిటీతో సమీక్షించారు. ముందుగా నిర్ణయించిన హజ్ యాత్ర షెడ్యూల్‌లో కొద్దిగా మార్పులు జరిగినట్లు తెలిపారు. ఈ నెల 7 నుంచి 19వ తేదీ వరకు విజయవాడ విమానాశ్రయం నుంచి రోజుకు ఒక విమానం బయలుదేరుతుందన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు రోజుకు 170 మంది, 18న 120 మంది, 19న 130 మంది హాజీలు బయలుదేరి వెళ్తారన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ ఎస్పీ కె. ఆరీఫ్ హాఫీజ్, ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్, ఎమ్మెల్సీలు ఇషాక్ బాషా, రూహుల్ల, ఎమ్మెల్యే రోశయ్య ఉన్నారు.

సీఎంను కలిసిన విశాఖ పోర్ట్ చైర్మన్



సాక్షి, అమరావతి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్ ఎం.అంగముత్తు(ఐఏఎస్) మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అంగముత్తు ఇటీవలే విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఎంఎస్ఎంఈలపై త్రిముఖ సూత్రం

▶ మొదటి పేజీ తరువాయి

సూచించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల అమలుపై సీఎం జగన్ సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రంగాల వారీగా సమీక్షించారు. ఎంఎస్ఎంఈలను మరింత ప్రోత్సహించేలా పరిశ్రమల శాఖలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పి కార్యదర్శిని నియమించాలని ఆదేశించారు. డిగ్రీలకు తోడు నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా పరిశ్రమలకు నిపుణులైన మానవ వనరులను అందుబాటులోకి తేవాలన్నారు.

రూ.3,39,959 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పది దఫాలు ఎస్ఐపీబీ సమావేశాలను నిర్వహించి 59 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపినట్లు అధికారులు తెలిపారు. వీటిద్వారా రూ.3,39,959 కోట్ల పెట్టుబడులు రానుండగా 2,34,378 మందికి ఉద్యోగాలు లభించనున్నాయన్నారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో పరిశ్రమలు వాణిజ్య శాఖ తరఫున 100 ఒప్పందాలు చేసుకోగా ఇప్పటికే రూ.2,739 కోట్ల విలువైన 13 ఒప్పందాలు వాస్తవ రూపం దాల్చినట్లు తెలిపారు. వీటిద్వారా 6,858 మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. రానున్న నెలల్లో మరిన్ని కంపెనీలు పనులు మొదలు కానున్నాయి. 2024 జనవరిలోపు 38 కంపెనీలు, మార్చి లోపు మరో 30 కంపెనీలు పనులు పూర్తి చేసుకుని ఉత్పత్తిని ప్రారంభిస్తాయని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో భాగస్వామ్య సదస్సుల్లో 1,739 ఎంఓయూల ద్వారా రూ. 18,87,058 కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు చేసుకోగా 10 శాతం కూడా వాస్తవరూపం దాల్చలేదన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

విశాఖ ఖ్యాతిని పెంచేలా ఐటీ హబ్

ఐటీ, ఐటీ ఆధారిత సేవలకు విశాఖను హబ్‌గా తీర్చిదిద్దేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. ప్రముఖ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలన్నారు. దీనివల్ల విశాఖ నగర ఖ్యాతి పెరిగి ఐటీకి చిరునామాగా మారుతుందన్నారు. గత గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఐటీ, ఐటీ ఆధారిత, ఎలక్ట్రానిక్స్ రంగంలో రూ.44,963 కోట్ల విలువైన 88 ఒప్పందాలు కుదిరినట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఇప్పటికే 85 శాతం కంపెనీలు నిర్మాణ పనులు ప్రారంభించడం /ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. జీఐఎస్‌లో కుదిరిన పెట్టుబడుల్లో ఇప్పటికే రూ.38,573 కోట్లు వాస్తవ రూపం దాల్చినట్లు తెలిపారు.

రూ.8.85 లక్షల కోట్ల విద్యుత్ ప్రాజెక్టులు

విశాఖ సదస్సు ద్వారా 25 విద్యుత్ ప్రాజెక్టుల కోసం ఒప్పందాలు కుదుర్చుకోగా 8 ఎస్ఐపీబీ ఆమోదం కోసం పంపినట్లు అధికారులు తెలిపారు. మరో నాలుగు ప్రాజెక్టుల్లో పనులు ప్రారంభం కానుండగా మరో 8 ప్రాజెక్టుల డీపీఆర్‌లు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. విశాఖ సదస్సు కంటే ముందు 20 విద్యుత్ ప్రాజెక్టుల ఒప్పందాలు కుదరగా 6 ప్రాజెక్టుల్లో పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. మరో 11 ప్రాజెక్టుల డీపీఆర్‌లు సిద్ధమైనట్లు అధికారులు పేర్కొన్నారు. వీటి ద్వారా రూ.8.85 లక్షల కోట్ల పెట్టుబడులతో 1,29,650 మందికి ఉద్యోగాలు లభించనున్నట్లు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడుల ప్రతిపాదనలను వీలైనంత త్వరగా కార్యరూపంలో తెచ్చేలా కృషి చేయాలని సీఎం ఆదేశించారు. డిమాండ్‌లో తరచూ తీవ్ర వ్యత్యాసం ఉండే టమాటా, ఉల్లి లాంటి పంటల విషయంలో ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పే పనులను వేగవంతం చేయాలన్నారు.

నాలుగేళ్లలో వృద్ధి బాగుంది

- స్థిర ధరల సూచీ ప్రకారం 2019లో రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి 5.36 శాతం. ఇది దేశ సగటు 6.5 శాతం కన్నా తక్కువ
- గత నాలుగేళ్లలో మాత్రం రాష్ట్రం మంచి ప్రగతి సాధించింది ట
- 2021–22లో రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 11.43 శాతానికి పెరిగింది
- 2022–23లో జీఎస్‌డీపీలో గ్రోత్ రేట్ 16.22 శాతంగా ఉంది.
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా నంబర్ వన్ స్థానంలో నిలుస్తున్న ఏపీ
- జీడీఎస్‌డీపీలో రాష్ట్ర పారిశ్రామిక రంగం వాటా దాదాపు రూ.13 లక్షల కోట్లు. పారిశ్రామికరంగం వాటా 21 నుంచి 23 శాతానికి పెరుగుదల.
- 2022 జనవరి – డిసెంబరు మధ్య రాష్ట్రానికి రూ.45,217 కోట్ల పెట్టుబడుల రాక.
- 2022–23లో రాష్ట్రం నుంచి రూ.1.6 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తుల ఎగుమతి.
- 2021–22లో ఎగుమతుల విలువ రూ.1.43 లక్షల కోట్లు కాగా గత ఆర్థిక సంవత్సరంలో రూ. రూ.1.6 లక్షల కోట్లకు పెరుగుదల.

మెరుగైన పెన్షన్..?

▶ మొదటి పేజీ తరువాయి

మాదిరిగానే మెరుగైన గ్యారంటీ పెన్షన్ విధానంలో ధరల పెరుగుదల నుంచి పెన్షనర్లకు ఉపశమనం కల్పించేందుకు ఏటా 3 శాతం పెంచేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. అయితే ఈ ప్రతిపాదనలపై చర్చ జరిగినప్పుడు ఏటా 3 శాతం పెంపు కేవలం కంటితుడుపులా ఉందని సీఎం అభిప్రాయపడినట్లు సమాచారం. పదవీ విరమణ తర్వాత ఆర్థిక భద్రత, భరోసా కల్పించాలన్న ఆలోచనకు అనుగుణంగా లేదని పేర్కొంటూ ఉద్యోగులు ఆశిస్తున్నట్లుగా ఓపీఎస్‌కు దాదాపు సమానంగా పెన్షన్ విధానం ఉండాలని సీఎం జగన్ కీలక సూచన చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఏటా పెరుగుదల 3% కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రతి ఆర్నెల్లకు ఒకసారి పెంచే డీఏ పాయింట్ల ఆధారంగా రాష్ట్రంలో ఉద్యోగులకు కరువుభత్యం (డీఏ), పెన్షనర్లకు కరువుభృతి(డీఆర్) పెంచుతున్న మాదిరే ఈ పెన్షన్ విధానంలోనూ పెన్షనర్లకు డీఆర్ పెంచడం శాస్త్రీయంగా ఉంటుందని సీఎం సూచించినట్లు సమాచారం. ఈ విధానాన్ని అమలు చేస్తే ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత ఆర్థిక భద్రత చేకూరి ధరల పెరుగుదల నుంచి వారికి ఉపశమనం కలుగుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడినట్లు తెలిసింది. ఓపీఎస్‌కు దాదాపు సమానమైన పెన్షన్ అందుకొనే విధానం ఉండాలని, మనం తెస్తున్న పెన్షన్ విధానం సీపీఎస్ ఉద్యోగులను సంతృప్తిపరచాలని సీఎం గట్టిగా చెప్పినట్లు సమాచారం. గ్యారంటీ పెన్షన్‌ను 33% నుంచి ఓపీఎస్ మాదిరిగా 50 శాతానికి పెంచాలని కూడా సీఎం భావించారు. అలా చేస్తేనే సీపీఎస్ ఉద్యోగుల ఆకాంక్ష నెరవేరుతుందని, ఓపీఎస్‌కు దాదాపు సమానమైన విధానం రూపకల్పన చేసినట్లవుతుందని సూచించారు.

పీఆర్సీ మినహా అన్ని ప్రయోజనాలు

సీఎం జగన్ ఆదేశాల మేరకు అధికారులు ప్రతిపాదనలు మళ్లీ సవరించి పాత పెన్షన్ విధానం(ఓపీఎస్)లో మాదిరే ఉద్యోగులకు ఆఖరి నెల మూల వేతనంలో 50% పెన్షన్‌గా నిర్ధారించడంతో పాటు ఓపీఎస్ విధానంలో పెన్షనర్లకు పెంచినట్లే డీఆర్ కూడా పెంచేలా మెరుగైన పెన్షన్ విధానాన్ని రూపొందించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మంత్రివర్గం ఆమోదం తెలిపితే సీఎం ఆలోచనలకు అనుగుణంగా సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్‌తో దాదాపు సమానమైన మెరుగైన పెన్షన్ విధానం అమల్లోకి వస్తుంది. పీఆర్సీ ప్రయోజనాలు మినహా ఓపీఎస్‌లోని మిగతా ప్రయోజనాలన్నీ ముఖ్యమంత్రి జగన్ సూచించిన తాజా పెన్షన్ విధానంలో ఉంటాయి. ప్రజల సరాసరి జీవితకాలం పెరిగిన నేపథ్యంలో ఏటా కనీసం 5% డీఆర్ పెరుగుతుందనుకున్నా 20 ఏళ్లలో పెన్షన్ రెట్టింపవుతుంది. సీపీఎస్‌లో చెల్లిస్తున్న మాదిరే 10% ఉద్యోగులు చెల్లిస్తే చాలు. ఉద్యోగులు నష్టపోకుండా ఇది మెరుగైన విధానం అవుతుంది.

ఓపీఎస్ వల్ల ప్రతికూలతలు ఇవీ..

- సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్ తీసుకురావడానికి ఆర్థిక పరిస్థితి సహకరించదు.
- ఓపీఎస్‌ను మళ్లీ అమల్లోకి తెస్తే భవిష్యత్తు తరాలపై దాని ప్రభావం తీవ్రంగా పడుతుంది. ఇవ్వాల్సిన పెన్షన్లు మొత్తం ఉద్యోగుల జీతాలను కూడా దాటేసి మోయలేని స్థాయికి చేరుకుంటుంది.
- 2040 నాటికి బడ్జెట్ నుంచి పెన్షన్ల కోసం చేయాల్సిన వ్యయం రూ.60,706 కోట్లకు చేరుకుంటుంది. ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల కోసం ఏడాదిలో బడ్జెట్ నుంచి చేసే ఖర్చు రూ.1,85,172 కోట్లకు చేరుతుంది. అంటే రాష్ట్ర సొంత రాబడిలో ప్రతినెలా తప్పనిసరిగా చేయాల్సిన వ్యయం 181 శాతానికి చేరుకుంటుంది. మరో పదేళ్ల తర్వాత అంటే 2050 నాటికి ఇది 197 శాతానికి చేరుకుంటుంది.
- ఏదో ఒక దశలో ఈ మోయలేని భారాన్ని తట్టుకోలేక 2003 మాదిరిగానే మళ్లీ ఓపీఎస్‌ను రద్దు చేయాల్సిన పరిస్థితి వస్తుంది. అప్పుడు మళ్లీ చాలీచాలని పెన్షన్ విధానాన్ని తీసుకురావాల్సి వస్తుంది. అలా జరిగితే ఈ రోజుల్లో ఉన్న వడ్డీ రేట్లుకూడా అప్పుడు ఉండవు. తగ్గిన వడ్డీరేట్లకు అనుగుణంగా సీపీఎస్ పెన్షన్ ఫండ్ నుంచి వచ్చే పెన్షన్లు కూడా తగ్గుతాయి. ఇది ఉద్యోగులకు, ప్రజలకు ఏమాత్రం మంచిది కాదు.

ఇప్పుడున్న సీపీఎస్‌తోనూ భరోసా లేదు

■ ఓపీఎస్ బదులుగా ఇప్పుడున్న సీపీఎస్‌తోనూ భరోసా లేదన్నది వాస్తవం. ■ తగ్గిపోతున్న బ్యాంకుల వడ్డీరేట్లు నేపథ్యంలో ఇప్పుడు అందుతున్న సీపీఎస్‌కూడా భవిష్యత్తులో మరింత తగ్గే పరిస్థితులున్నాయన్నది వాస్తవం. ■ 1980ల్లో 12–13 శాతం ఉన్న వడ్డీ రేట్లు ఇవాళ 5 – 6 శాతం కూడా దాటని పరిస్థితి. ■ ఇది ఇలాగే కొనసాగితే ఇప్పుడు వస్తున్న పింఛన్‌లో 20 శాతం కూడా రాని పరిస్థితి. ■ ఈడబ్బు ఫండ్స్‌లో, స్టాక్‌మార్కెట్లలో పెట్టుబడులుగా ఉండడంవల్ల అవి ఒడిదుడుకులకు గురైనప్పుడల్లా సీపీఎస్‌పైనా ప్రభావం పడుతుంది.

బదిలీలకు 15,526 మంది 'సచివాలయాల'

ఉద్యోగులు దరఖాస్తు

- నేడు బదిలీ మెరిట్ ర్యాంకులు
- 8, 9, 10 తేదీల్లో కౌన్సెలింగ్.. బదిలీ వివరాలతో ప్రొసీడింగ్స్ జారీ

సాక్షి, అమరావతి: బదిలీల కోసం గ్రామ, వార్డు సచివాయాల ఉద్యోగులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేశారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జరుగుతున్న ఈ బదిలీలకు సొంత జిల్లాల్లోనే మరో స్థానానికి బదిలీ కోరుతూ 13,105 మంది, ఒక జిల్లా నుంచి వేరొక జిల్లాకు బదిలీ కోసం మరో 2,421 మంది దరఖాస్తు చేసుకున్నట్టు గ్రామ వార్డు సచివాలయాల శాఖ అధికారులు వెల్లడించారు. 2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నాలుగు నెలల్లోనే రికార్డు స్థాయిలో ఒకే విడతలో 1.34 లక్షల గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగాలను భర్తీ చేసిన విషయం తెలిసిందే. వీరికి ప్రభుత్వం ఈ ఏడాది బదిలీలకు అవకాశం కల్పించింది. బదిలీలకు ఈ నెల 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా పరిధిలో, అంతర్ జిల్లాల బదిలీలకు కలిపి మొత్తం 15,526 మంది దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. మంగళవారం రాత్రికల్లా జిల్లాల వారీగా, వివిధ కేటగిరీ పోస్టుల ప్రకారం బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారికి మెరిట్ ర్యాంకులు ఇస్తామని గ్రామ, వార్డు సచివాలయాల అధికారులు వెల్లడించారు. బదిలీలకు అర్హత ఉన్న వారికి 8, 9, 10 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి వారు కోరుకున్న మేరకు కేటాయించే సచివాలయాల వివరాలతో ప్రొసీడింగ్స్ జారీ చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు.



అత్యధికంగా డిజిటల్ అసిస్టెంట్ పోస్టుల్లోనే

అత్యధికంగా కర్నూలు జిల్లా నుంచి 1,581 మంది బదిలీ కోరుతూ దరఖాస్తు చేశారు. ప్రత్యేకించి ఒక జిల్లా నుంచి వేరొక జిల్లాకు అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 233 మంది దరఖాస్తు చేసుకోగా, ఆ తర్వాత గుంటూరు జిల్లా నుంచి 232 మంది దరఖాస్తు చేసినట్టు అధికారులు వివరించారు. అత్యధికంగా డిజిటల్ అసిస్టెంట్లు 1,976 మంది బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. ఒక జిల్లా నుంచి వేరొక జిల్లాకు బదిలీ కోరుతూ అత్యధికంగా మహిళా పోలీసులు 389 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత ఇంజనీరింగ్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ఎక్కువ మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.

'కాంట్రాక్టు' క్రమబద్ధీకరణ!

సాక్షి, అమరావతి: కాంట్రాక్టు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నట్లు ప్రకటించింది. 2014 జూన్ 2వ తేదీ నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని వెల్లడించింది. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం కలిగిన ఉద్యోగ సంఘాల నాయకులతో సోమవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉద్యోగులకు అనుకూలంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ ఆ వివరాలను మీడియాకు వివరించారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై త్వరలో ఉత్తర్వులు వెలువడతాయని తెలిపారు. పీఆర్సీ, డీఏ బకాయిలు రెండింటినీ కలిపి ఒకటిగా చేసి చెల్లించాలని ఉద్యోగ సంఘాలు కోరాయని, ప్రభుత్వం అందుకు అంగీకరించినట్లు చెప్పారు. మూడు నెలలకు ఒక విడత చొప్పున, సంవత్సరానికి నాలుగు విడతలు, నాలుగేళ్లలో 16 విడతల్లో ఈ బకాయిలను ఉద్యోగులకు ఇస్తామని వివరించారు. మొదటి సంవత్సరం పది శాతం, రెండో సంవత్సరం 20 శాతం, మూడో సంవత్సరం 30 శాతం, నాలుగో సంవత్సరం 40 శాతం చొప్పున ఇస్తామన్నారు. ఏటా పది శాతం చొప్పున పెంచుకుంటూ నాలుగు సంవత్సరాల్లో మొత్తం బకాయిలను ఇస్తామన్నారు. దీనికి ఉద్యోగ సంఘాలు అంగీకరించాయన్నారు.

సీపీఎస్ కంటే మెరుగ్గా

ఉద్యోగులకు సీపీఎస్ కంటే మెరుగైన విధానాన్ని అమలు చేస్తామని మంత్రి బొత్స తెలిపారు. వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు ఇకపై 010 పద్దు ప్రకారం జీతాలు చెల్లిస్తామన్నారు. త్వరలో కొత్త పీఆర్సీ కమిటీని నియమిస్తామని వెల్లడించారు. ఉద్యోగుల స్పెషల్ పే ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ అంశాలన్నింటికీ మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపిన అనంతరం శాఖల వారీగా ఉత్తర్వులిస్తామన్నారు.

ఆలస్యమైనా.. అనుకూలంగానే

ఇది ఉద్యోగులకు అనుకూలమైన ప్రభుత్వమని, ఉద్యోగులంతా తమ సోదరులేనని మంత్రి బొత్స పేర్కొన్నారు. తమ కుటుంబాల్లోనూ ఉద్యోగులున్నారని తెలిపారు. ఆర్థిక పరిస్థితుల వల్ల వారికి ఇవ్వాల్సిన వాటి విషయంలో కొంత ఆలస్యం జరిగిందే కానీ, ఉద్యోగుల పట్ల సీఎం జగన్ చిత్తశుద్ధితో ఉన్నారని చెప్పారు. ఉద్యోగులకు సంబంధించి మొదటిరోజు చెప్పిన మాటకే సీఎం కట్టుబడి ఉన్నారని, దాని ప్రకారమే వారికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఓపిగ్గా సంప్రదింపులు జరిపిన ఉద్యోగ సంఘాలకు బొత్స అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్ఆర్‌యం) చిరంజీవి చౌదరి, ఆర్థిక శాఖ కార్యదర్శి డాక్టర్ కేవీవీ సత్యనారాయణ (సర్వీసెస్, హెచ్ఆర్), కార్యదర్శి పి.భాస్కర్, ఎస్టీయూ అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, పీఆర్‌టీయు అధ్యక్షుడు కృష్ణయ్య, యూటీఎఫ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు హృదయరాజు, ఏపీజీఈఏ కార్యదర్శి ఆస్కార్‌రావు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

71 డిమాండ్లు నెరవేరాయి: బండి శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వం ఎదుట ఉంచిన 71 డిమాండ్లలో దాదాపు అన్నీ పరిష్కారమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తున్నట్లు చెప్పారు. అందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం. ఐదేళ్లకోసారి పీఆర్సీ డిమాండ్‌ను పోరాడి సాధించుకున్నాం. ఆ డిమాండ్ ప్రకారం 7వ తేదీన జరిగే కేబినెట్ భేటీలో పీఆర్సీ కమిషన్‌ను నియమిస్తామన్నారు. స్పెషల్ పే ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కొత్తగా ఏర్పడిన 8 జిల్లాలకు హెచ్ఆర్ఏను 16 శాతం పెంచడం మంచి విషయం. ఇన్నాళ్లూ వైద్య శాఖలో ఏబీవీపీని ఓ ప్రైవేట్ కంపెనీలా చూసేవారు. వారికి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు దక్కినందుకు అభినందిస్తున్నాం. సీపీఎస్ ఉద్యోగుల విషయాన్ని కేబినెట్‌లో ప్రస్తావిస్తామని చెప్పారు.

అన్నీ పాజిటివ్ అంశాలే : వెంకట్రామిరెడ్డి, అధ్యక్షుడు, సచివాలయ ఉద్యోగుల సంఘం

మంత్రివర్గ ఉపసంఘంతో జరిగిన సమావేశంలో అన్ని అంశాలు ఉద్యోగులకు పాజిటివ్‌గా ఉన్నాయి. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. సీఎం గతంలో చెప్పినట్లుగా పీఆర్సీ కమిషన్‌ను నియమిస్తామన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు మేలు చేసేలా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. వారికి పెన్షన్ భద్రత కల్పించేలా చూస్తామన్నారు. స్పెషల్ పే ఇవ్వడానికి అంగీకరించారు. డీఏ, పీఆర్సీ బకాయిలను నాలుగేళ్లలో విడతలవారీగా ఇస్తామన్నారు.

పలు సానుకూల నిర్ణయాలు: బొప్పరాజు వెంకటేశ్వర్లు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు

రాష్ట్ర ప్రభుత్వం మా డిమాండ్లను చాలా వరకు నెరవేర్చింది. ఉద్యోగులకు అనుకూలంగా చాలా సానుకూల నిర్ణయాలు తీసుకుంది. ఇందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. పీఆర్సీ, డీఏ బకాయిలు మొత్తం రూ.7 వేల కోట్లు ఉంటాయి. వాటిని నాలుగేళ్లలో విడతలవారీగా చెల్లించేందుకు అంగీకరించారు. విభజన నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సుమారు 7, 8 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు అంగీకరించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపుపైనా సానుకూలంగా స్పందించారు. వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ వచ్చే కేబినెట్‌లో తీర్మానం చేస్తామన్నారు.

ఇది కాంట్రాక్టు ఉద్యోగులకు శుభవార్త

సాక్షి, అమరావతి: కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వోద్యోగులుగా క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంపై వైఎస్సార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళీరెడ్డి హర్షం వ్యక్తంచేశారు. 2014కు ముందు ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామంటూ నిర్ణయం తీసుకోవడం వారికి శుభవార్త అంటూ ఈ నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతీ ఉద్యోగి సీఎంకు అండగా నిలుస్తారన్నారు.

22 ఏళ్ల సుదీర్ఘ కల నెరవేరుతోంది..

సీఎంకు ఏపీ స్టేట్ కాంట్రాక్టు ఫార్మసిస్ట్స్ అండ్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి : ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగానే కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని ఏపీ స్టేట్ కాంట్రాక్టు ఫార్మాసిస్ట్స్ అండ్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ స్వాగతించింది. 22 ఏళ్ల తమ సుదీర్ఘ కలను నెరవేరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో 2001 నుంచి శాశ్వత ఉద్యోగ నియామకాలకు స్వస్తి పలికి కాంట్రాక్టు ఉద్యోగులను తీసుకుంటూ వచ్చారని.. ఇప్పుడు 2-06-2014కు ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారిని ముఖ్యమంత్రి జగన్ రెగ్యులరైజ్ చేస్తూ తీసుకున్న నిర్ణయంపై అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.రత్నాకర్‌బాబు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా...

అమిత్‌షా విశాఖ పర్యటన 11కు వాయిదా

సాక్షి, అమరావతి: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విశాఖపట్నం పర్యటన ఈ నెల 11వ తేదీకి వాయిదా పడినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ దేశవ్యాప్తంగా మే 30 నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఈ నెల 8వ తేదీన విశాఖపట్నంలో.. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదో తేదీన తిరుపతిలో పర్యటిస్తారని మొదట బీజేపీ ప్రకటించింది. అయితే, అమిత్‌షా పర్యటన 11వ తేదీకి వాయిదా పడింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ వెంకట మురళి



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వెంకట మురళి

సాక్షి, అమరావతి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సంకల్పించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ వెంకట మురళి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట మురళి మాట్లాడుతూ ప్రకృతితో బాధ్యతగా నడుచుకోకుంటే మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందన్నారు. 50 ఏళ్ల కిందటి వాతావరణం ఇప్పుడు లేదని.. ఇలాగే ఉంటే భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించలేమన్నారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిర్మూలించాలని, ప్రజలు తప్పనిసరిగా క్లాత్ బ్యాగులను వినియోగించాలని కోరారు. 'జగనన్న స్వచ్ఛ సంకల్ప' కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం పెరుగుతోందన్నారు. గత నెల 17 నుంచి సోమవారం వరకు రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో నిర్వహించిన ట్రిపుల్ ఆర్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామంటూ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీవోవో ఎస్.కిరణ్ కుమార్, కార్పొరేషన్ అడ్వైజర్ డాక్టర్ జయప్రకాష్ సాయి పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో పచ్చదనానికి ప్రాధాన్యం

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దొరబాబు, ఎండీ లక్ష్మీశా



మొక్కను నాటి నీరు పోస్తున్న దొరబాబు, లక్ష్మీశా

సాక్షి, అమరావతి: వైఎస్సార్, జగనన్న కాలనీల్లో పచ్చదనానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎండీ లక్ష్మీశా తెలిపారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఏర్పాటైన కాలనీల్లో లబ్ధిదారులు తమ ఇళ్ల ముందు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం దొరబాబు, లక్ష్మీశా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'వృక్షో రక్షతి రక్షితః' సూక్తి ప్రాధాన్యతను రేపటి తరాలకు తెలియజేసి మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రత్యేకాధికారి రామచంద్రారెడ్డి, సీఈ ప్రసాద్, ఎస్‌ఈలు జయరామాచారి, నాగభూషణం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఒక్కరు తప్ప అందరూ సేఫ్

- ఒడిశా రైలు ప్రమాదంలో రాష్ట్రం నుంచి ఒక్కరే మృతి
- ఆ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లింపు
- మిగిలిన మన ప్రయాణికులంతా సురక్షితం
- మంత్రి అమర్‌నాథ్ వెల్లడి



ప్రభుత్వం ఇచ్చిన చెక్కును చూపిస్తున్న విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శంకరరావు

సాక్షి, అమరావతి: ఒడిశాలో ఘోర ప్రమాదానికి గురైన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలోని రాష్ట్ర ప్రయాణికులు ఐదుగురిలో ఒక్కరే మృతిచెందారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళికి చెందిన గురుమూర్తి మరణించినట్లు గుర్తించామని.. ఒడిశాలో నివసిస్తున్న ఆయన, పెన్షన్ కోసం వచ్చి, తిరిగి వెళ్తూ కోరమాండల్ ఎక్కినట్లు తేలిందన్నారు. అతని తోపాటు అదే బోగీలో విశాఖకు చెందిన ఇద్దరు, శ్రీకాకుళానికి చెందిన మరో ఇద్దరు ఉన్నారని, వీరు సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తరఫున ప్రగాఢ సానుభూతి తెలపడంతో పాటు, రూ.10 లక్షల పరిహారం ఇస్తున్నామని.. గాయపడిన వారి చికిత్స ఖర్చును ప్రభుత్వమే భరిస్తోందన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

342 మంది రిజర్వ్‌డ్ ప్రయాణికులు సేఫ్

కటక్, బాలాసోర్‌లోని సోరూ, గోపాలపురం ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రయాణికులతో పాటు, ఘటనా స్థలానికి చుట్టుపక్కల ఊళ్లలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని కలుసుకుని మాట్లాడాం. అత్యవసర చికిత్స అవసరమైన వారిని హుటాహుటిన విశాఖకు తరలించడంతో పాటు, భువనేశ్వర్‌లోని అపోలో ఆస్పత్రిలో కూడా చేర్చాం. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో రాష్ట్రం నుంచి బయల్దేరిన లేదా ఏపీలో దిగాల్సిన వారి వివరాలు సేకరించాం. ఆ రైలు రిజర్వేషన్ చార్ట్ ప్రకారం 309 మంది తెలుగువారు ఉన్నారు. యశ్వంత్‌పూర్–హౌరా ఎక్స్‌ప్రెస్‌లో 33 మంది ఉన్నారు. రెండు రైళ్లలో 342 మంది తెలుగువారు ప్రయాణిస్తున్నట్లు తేలింది. వారిలో 12 మందికి స్వల్ప గాయాలు కాగా, 329 మంది సురక్షితంగా ఉన్నట్లు గుర్తించాం. ఒక్క ప్రయాణికుడు మాత్రం బంధువులతో ఉన్నట్లు తెలిసింది. చికిత్స పొందుతున్న వారిలో తొమ్మిది మందిని విశాఖకు తరలించి కేజీహెచ్‌లో ముగ్గురికి, సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో ఇద్దరికి, క్యూవన్ ఆస్పత్రిలో ఇద్దరికి, అపోలోలో ఒకరికి చికిత్స చేయిస్తుండగా, మరొకరు డిశ్చార్జ్ అయ్యారు.

ఆర్థిక సాయం అందజేత

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను మంత్రి అమర్‌నాథ్ సోమవారం అందించారు. బాధితులకు అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

సీఎం జగన్ తక్షణ స్పందన

ఇక ఈ ప్రమాదం గురించి తెలియగానే సీఎం వైఎస్ జగన్ తక్షణమే స్పందించారు. అదే రాత్రి ఉన్నతాధికారులతో సమావేశమైన ఆయన పలు నిర్ణయాలు తీసుకున్నారు. అందులో భాగంగానే.. మర్నాటి ఉదయమే నాతో పాటు ముగ్గురు ఐఏఎస్‌లు, మరో ముగ్గురు ఐపీఎస్‌లు కలిసి రోడ్డుమార్గం ద్వారా అక్కడకు వెళ్లి వెంటనే సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నాం. మాతోపాటు, 27 మంది సపోర్టింగ్ సిబ్బంది పాల్గొన్నారు. 108 సర్వీసులు 20, మరో 19 ప్రైవేటు అంబులెన్స్‌లు, 15 మహాప్రస్థానం వాహనాలను తీసుకెళ్లాం. రైలు ప్రమాదం జరిగిన బాలాసోర్ వద్ద ఐదు అంబులెన్స్‌లతో సేవలందించాం. ఇంకా సీఎం ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం సరిహద్దులో కొన్ని అంబులెన్సులతో పాటు సిబ్బందిని సిద్ధంగా ఉంచాం. ఇప్పటికీ మన రెస్క్యూ బృందాలు భువనేశ్వర్, కటక్, బాలాసోర్‌లో ఉన్నాయి.

కేంద్ర మంత్రుల ప్రశంస..

ప్రమాదం గురించి తెలియగానే మనం శరవేగంగా స్పందించి రాష్ట్రంలో పలుచోట్ల కంట్రోల్ రూంలు ఏర్పాటుచేశాం. తిరుపతి, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, విశాఖపట్నం తదితర స్టేషన్లలో కంట్రోల్ రూంలకు అందిన సమాచారం ద్వారా ఎక్కడికక్కడ రిజర్వేషన్ల చార్టుల్లో ఉన్న ప్రయాణికుల కాంటాక్టు నంబర్ల ప్రకారం వారితో మాట్లాడి ఆచూకీ తెలుసుకున్నాం. సురక్షితంగా స్వస్థలాలకు చేరేవరకు అందరినీ అప్రమత్తం చేశాం. అక్కడ పరిస్థితుల్ని సమన్వయం చేస్తున్న కేంద్ర మంత్రులు అశ్విన్ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్‌లను కలిసి మన చర్యలను వివరించాం. మన ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా గురించి చెప్పగా కేంద్ర మంత్రులు అభినందించారు.

నేడు ఎన్టీఆర్ జిల్లాలో కేంద్ర కార్యదర్శి పర్యటన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ మంచినీటి కుళాయిల ఏర్పాటు కార్యక్రమం అమలు తీరును పరిశీలించేందుకు కేంద్ర జలశక్తి శాఖ పరిధిలోని తాగునీటి సరఫరా, పరిశుభ్రత విభాగం కార్యదర్శి వినీ మహాజన్ మంగళవారం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, మైలవరం మండలాల్లో పర్యటించనున్నారు. అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇంటింటికీ కుళాయి కార్యక్రమంపై సమీక్షిస్తారు. అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 95,54,759 ఇళ్లు ఉండగా, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2019 వరకు దాదాపు 70 ఏళ్లలో 30.74 లక్షల ఇళ్లకు మంచినీటి కుళాయిలు ఏర్పాటయ్యాయి. 2019 నుంచి గత నాలుగేళ్లలో 35.97 లక్షల ఇళ్లకు ప్రభుత్వం మంచినీటి కుళాయిలను కొత్తగా ఏర్పాటు చేసింది. మరో 28.83 లక్షల ఇళ్లకు మంచినీటి కుళాయిలు ఏర్పాటు కావాల్సి ఉంది. ఈ పనులను వేగవంతంగా చేపట్టేందుకు కేంద్ర కార్యదర్శి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారని అధికారులు వెల్లడించారు.

బాబు గ్రాఫిక్స్ భ్రమలు తొలగలేదు..

981వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: బాబు చూపించిన గ్రాఫిక్స్ బొమ్మల భ్రమలు తొలగిపోనందునే కులవాదులు, ఎల్లో మీడియా జోన్‌ల పేరుతో వింత పోకడలు పోతున్నట్లు బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 981వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ అమరావతిని సింగపూర్, జపాన్, మలేషియా చేస్తానంటూ 6 హబ్‌లుగా విడదీసి గ్రాఫిక్స్ డిజైన్‌లను చూపించిన బాబు ఈ ప్రాంతంలో రైతుల కోసం వీసమంత అభివృద్ధి చేయలేదని చెప్పారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన బాబు తన కుమారుడు లోకేశ్‌కు మంత్రి పదవి ఇచ్చి శునకానందం పొందాడే తప్ప ప్రజా ప్రయోజనాల కోసం ఏమీ చేయలేదన్నారు. సామాన్యుడికి జానెడు జాగా ఇస్తే భోరున విలపిస్తున్న బాబు అండ్ కో అతి తక్కువ ధరలకు రాజధాని ప్రాంతంలో కార్పొరేట్‌లకు భూములు కట్టబెట్టారని చెప్పారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య పాల్గొన్నారు.

సీపీఐ నాయకులపై కేసు కొట్టివేత

విశాఖ లీగల్: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ విశాఖలో ఆందోళన చేసిన సీపీఐ నాయకులపై పోలీసులు పెట్టిన కేసును కోర్టు కొట్టేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017 జనవరి 30న ప్రత్యేక హోదా కోసం ఆందోళన నిర్వహించిన సీపీఐ నాయకులపై విశాఖ 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన విశాఖ 2వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి కె.వి.ఎల్. హిమబిందు కొట్టివేశారు. దీంతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జీవీఎంసీ సీపీఐ ఫ్లోర్‌లీడర్ ఎ.జె.స్టాలిన్‌కు కేసు నంబర్ 483/2018 నుంచి విముక్తి లభించింది.

అంకెల గారడీతో అసత్యాలు

- పురపాలక సంస్థల్లో 2,760 పనులకు రూ.510.46 కోట్లు చెల్లింపు
- బిల్లులేవీ పెండింగులో లేవు.. రూ.వేల కోట్లతో పురపాలక సంస్థల్లో అభివృద్ధి
- అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఎల్లో మీడియా విషం చిమ్మే కథనాలు
- పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి సురేష్. పక్కన శ్రీలక్ష్మి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ సీఎస్) శ్రీలక్ష్మితో కలిసి మంత్రి సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో వేల కోట్లతో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని ఎల్లో మీడియా అంకెలను వక్రీకరిస్తూ, అసత్య కథనాలతో ప్రభుత్వంపై విషం చిమ్ముతోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సీఎఫ్‌ఎంఎస్‌కు వచ్చిన బిల్లును విడుదల చేస్తున్నామని చెప్పారు. పురపాలక సంస్థల్లో చేపట్టిన 2,760 పనులకు రూ.510.46 కోట్లు చెల్లించామన్నారు. పలాస – కాశీబుగ్గ, తాడిగడప, సాలూరు, గుంటూరు, జంగారెడ్డిగూడెం, పిడుగురాళ్ల, ఎర్రగుంట్లలో మొత్తం 269 పనులకు రూ.32.55 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. తాడేపల్లి–మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఫేజ్ 1, ఫేజ్–2 జనరల్ ఫండ్స్ బిల్లులు, 14, 15 ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు రూ. 37.06 కోట్లు విడుదల చేసినట్టు వివరించారు. ఒక్క బిల్లు కూడా పెండింగ్‌లో లేదన్నారు. బిల్లుల జాప్యంతో అభివృద్ధి నిలిచిపోతోందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. 123 పట్టణాలకుగాను ఏడింటిలో పనులు, బిల్లులనే ప్రస్తావించారని, అంటే మిగిలిన వాటిలో అభివృద్ధి జరుగుతోందనే అర్థమని చెప్పారు. పనులు చేసేందుకు చిన్న కాంట్రాక్టర్లు ముందుకు రానందునే చిన్న పనులను ఒక ప్యాకేజీగా మార్చి పెద్ద కాంట్రాక్టరుకు ఇచ్చేలా ప్రతిపాదన సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సాలూరులో 12 పనులకు రూ.15 లక్షల బిల్లులు ఉన్నాయని, అంటే ఒక పనికి రూ.లక్ష వరకు ఉంటుందని, దీనిని కూడా భూతద్దంలో చూపించడం దుర్మార్గమని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమృత్ 1.0లో ఇప్పటికే రూ.3,500 కోట్ల పనులకు పరిపాలన అనుమతులు ఇవ్వగా, అమృత్ 2.0లో రూ. 5 వేల కోట్లతో పనులు చేపడుతున్నట్టు వివరించారు. పన్నులు సకాలంలో చెల్లించని వారిపై వడ్డీల భారం పెరుగుతోందని, దానిని కూడా ప్రభుత్వం మినహాయించిందని, ఇందుకోసం రూ.3 వేల కోట్లు వడ్డీ భారాన్ని మోస్తోందని తెలిపారు.

కాంట్రాక్టర్లు సంతృప్తితో ఉన్నారు

బిల్లుల చెల్లింపుపై కాంట్రాక్టర్లు సంతృప్తితో ఉన్నారని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి చెప్పారు. పట్టణాల్లో సాధారణ పనులకే కాకుండా.. 528 అర్బన్ హెల్త్ సెంటర్ల పనులకు కూడా రూ.187 కోట్లు చెల్లించామన్నారు. యూజర్ చార్జీలు ఇవ్వడానికి ప్రజలు ముందుకొస్తుంటే మీడియాకు ఇబ్బంది ఎందుకని ప్రశ్నించారు.

మానవాళి మనుగడ పర్యావరణంపైనే ఆధారపడి ఉంది

పర్యావరణ దినోత్సవ సభలో మంత్రి పెద్దిరెడ్డి



ఎనీ టైం బ్యాగ్ వెండింగ్ మిషన్ ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి/గుణదల (విజయవాడ తూర్పు): పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని రాష్ట్ర ఇంధన, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక, అటవీ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. మానవాళితో పాటు అన్ని జంతు, జీవజాలాల మనుగడ పర్యావరణంపైనే ఆధారపడి ఉందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలోని ఒక ఫంక్షన్ హాలులో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న మిషన్ లైఫ్ ప్రోగ్రాంలో దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో ఉందని తెలిపారు.

పలువురికి అవార్డుల ప్రదానం

పర్యావరణ హిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్డీస్ ల్యాబొరేటరీస్, లావురుస్ ల్యాబొరేటరీస్, జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్, కియా మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, భారతీ సిమెంట్స్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో హాస్పిటల్స్ (విశాఖపట్నం), డివిజనల్ రైల్వే హాస్పిటల్ (విజయవాడ), ఆయుష్ హాస్పిటల్ (విజయవాడ), సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ మెడికల్ సైన్సెస్, శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ (తిరుపతి) ప్రతినిధులకు మంత్రి అవార్డులు అందించారు. విశాఖ, విజయవాడ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు అవార్డులను ప్రదానం చేశారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లకు ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యాగ్‌ను అందించే ఎనీ టైం బ్యాగ్ (ఏటీబీ) వెండింగ్ మిషన్‌ను మంత్రి ఆవిష్కరించారు. ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ బి.శ్రీధర్, జేఎన్‌టీయూ డైరెక్టర్ ఎస్‌జే మురళీకృష్ణ, ప్రొఫెసర్ రామకృష్ణ, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

అవసరం తీరే వరకే బాబుకు పొత్తులు

- అధికారంలోకి రాగానే మిత్రపక్షాలనే దూషిస్తారు
- ఇటువంటి వ్యవహారాల్లో చంద్రబాబు సిద్ధహస్తుడు
- గతంలో పొత్తులు పెట్టుకొని అధికారంలోకి వచ్చారు
- ఆ తర్వాత కూటమిపైనే బాబు విమర్శలు చేశారు
- చంద్రబాబు చేస్తున్నది మోసం
- సీఎం జగన్‌కు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం
- పొత్తులపై వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన విధానం ఉంది
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి,అమరావతి: అసెంబ్లీ ఎన్నికలు వస్తుంటే రాజకీయ పార్టీలతో పొత్తుల కోసం వెంపర్లాడటం చంద్రబాబు దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. అవసరం అయితే పొత్తులు పెట్టుకోవడం, అవసరం తీరాక దూషణలు చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని ఎద్దేవా చేశారు. ఆయన సోమవారం సచివాలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో జనసేన, బీజేపీ కలిసి చంద్రబాబును అధికార పీఠంపై కూర్చోబెట్టాయన్నారు. ఆ తర్వాత మిత్రపక్షంపైనే ఆరోపణలు చేసి బయటకు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు చేస్తున్నది మోసమని అన్నారు. పొత్తులపై వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన విధానం ఉందన్నారు. ఆయన చెప్పిన విషయాలు ఆయన మాటల్లోనే..

పొత్తుల వెనుక రహస్యం..

చంద్రబాబు పొత్తుల కోసం వెళ్లారా? కేసుల విషయంలో ఎక్కడ ఇరుక్కుంటాననే భయంతో వెళ్లారా? ఇంకా వేరే విషయాలు ఏమైనా ఉన్నాయో తెలీదు. పొత్తులపై వైఎస్సార్‌సీపీకి మొదటి నుంచి క్లారిటీ ఉంది. స్పష్టమైన విధానం ఉంది. ప్రజలకు పార్టీ అజెండా స్పష్టంగా తెలియజేయాలి. అప్పుడే ప్రజలు ఏ పార్టీ బాగుంటుంది, ఏ కూటమి బాగుంటుంది అనేది నిర్ణయించుకుంటారు. పొత్తులనేవి ఎన్నికల్లో ఎలా గట్టెక్కాలి, అధికారం ఎలా చేతుల్లోకి తీసుకోవాలి అనేది ఉన్నంత వరకే ఉంటాయి. ప్రజలు మోస పోతారు. ఇందులో అత్యంత సిద్ధహస్తుడు, రికార్డులు బ్రేక్ చేసిన వ్యక్తి చంద్రబాబు. ఆయన ముఖ్యమంత్రి కావటానికి ఎంతమందినైనా లోబరుచుకొని, వారి దగ్గర రకరకాల విన్యాసాలు ప్రదర్శిస్తారు. దివంగత ఎన్టీఆర్‌ను టీడీపీ నుంచి తప్పించి పార్టీని చేతుల్లోకి తీసుకొన్నప్పటి నుంచి బాబు ప్రతి ఎన్నికల్లో ఇలాగే చేస్తున్నారు. ఒక్కోసారి ఒక్కొక్కటి చేస్తారు. దీనికి ఆయన నిర్వచనం ఎత్తులు, వ్యూహం అంటారు. ఇవి ప్రజాస్వామ్యానికి అవసరమని చెబుతాడు. నిజంగా ఈ విధానం రోగ లక్షణం. జనసేన అనేది బాబు కంట్రోల్‌లో నడుస్తుంది. 2019 ఎన్నికల్లో వ్యతిరేక ఓటు చీలాలనుకున్నారు కాబట్టి పక్కకు తప్పించారు. బీజేపీతో ఉండి వద్దనుకున్నాక నాలుగు విమర్శలు చేసి బాబు బయటకు వచ్చారు. మళ్లీ ఇప్పుడు బాబు పొత్తుల కోసం ప్రయత్నిస్తున్నారు.

ఎందుకు భయం?

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ లేదని బాబు భావిస్తున్నప్పుడు పొత్తుల కోసం ఎందుకు వెంపర్లాడుతున్నారు? ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని అనుకోవటం దేనికి? ఇద్దరు కలిస్తే 50 శాతం ఓట్లు ఉన్నట్లే కదా? ఇది సరిపోతుంది కాదా? వారు అనుకొన్న ప్రభుత్వ వ్యతిరేక ఓటు బదిలీ కాదు. కానీ, వైఎస్సార్‌సీపీకి 80 శాతం ప్రజా మద్దతు ఉంది. వీరంతా కట్టకట్టుకొని వచ్చినా సీఎం జగన్‌కి సీట్లు పెరుగుతాయి. ఓటింగ్ పర్సంటేజీ పెరుగుతుంది. సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం.

రాష్ట్రం, కేంద్రం మధ్య ఉన్నవి సుహృద్భావ సంబంధాలే

ఏపీ ప్రభుత్వానికి, కేంద్రానికి మధ్య ఉండాల్సిన సుహృద్భావ సంబంధాలు మాత్రమే ఉన్నాయి. బీజేపీకి, వైఎస్సార్‌సీపీకి సంబంధం లేదు. సీఎం జగన్‌కు రాష్ట్ర ప్రయోజనాలు తప్ప మరేవీ లేవు. ప్రజలను తాకట్టుపెట్టి మరేదో సంపాదించాలని అనుకోరు. వైఎస్సార్‌సీపీ గురించి కేంద్రానికి క్లారిటీ ఉంది. అందుకే కేంద్రంలో ఎవరు ఉన్నా సీఎం జగన్‌ను గౌరవిస్తారు. బాబు చివరికి వచ్చారు. బాబు అనుకున్న రీతిలో లోకేశ్ ఎదగలేదు. లోకేశ్‌ను ముందుకు తీసుకు వచ్చేందుకు ఇది ఆఖరి అవకాశం కాబట్టే బాబు ఇన్ని కుయుక్తులు పన్నుతున్నారు.

రొయ్య్.. రయ్

- ఆక్వా రంగాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- యూనిట్‌కు రూ.1.5 చొప్పున విద్యుత్ రాయితీ
- ఏటా రూ.620 కోట్ల మేర రైతులకు లబ్ధి
- టీడీపీ హయాంలో రూ.310 కోట్లకే పరిమితం



రొయ్యల చెరువులో ఆక్సిజన్ కోసం వినియోగిస్తున్న ఏరియేటర్

కాట్రేనికోన: ఆక్వా సాగు చేస్తున్న రైతులకు రాయితీపై విద్యుత్ అందిస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మేత, మందులు, డీజిల్ ధరల పెరుగుదలతో రొయ్యల సాగు రైతులకు భారంగా మారిన తరుణంలో ప్రభుత్వం రాయితీపై విద్యుత్ సరఫరా చేస్తూ చేయూతనిస్తోంది. ఆక్వా రైతుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చైర్మన్‌గాను, మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు, వడ్డి రఘురామ్ వైస్ చైర్మన్‌లుగా ప్రభుత్వం అప్సడా – 2020 ఏర్పాటు చేసింది. ఆక్వా పరిశ్రమలో తలెత్తుతున్న సమస్యలు మధ్యవర్తులు లేకుండా సీఎం దృష్టికి తీసుకొని వెళ్లేందుకు, తక్షణ పరిష్కారానికి అప్సడా – 2020 దోహదపడుతుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 16 మండలాల్లో సుమారు 14,061 హెక్టార్లలో చేపలు, రొయ్యల సాగు జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఆక్వా సాగుకు సంబంధించి విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఆక్వా జోన్ పరిధిలో ఉన్న 10 ఎకరాల లోపు చెరువులకు 5,600 కనెక్షన్లకు ప్రభుత్వం రాయితీపై విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. అయితే 2,300 కనెక్షన్లకు సంబంధించి కమిటీ అప్రూవల్ చేసి కమిషనర్‌కు పంపించింది. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహిస్తూ సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేయడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యూనిట్‌కు రూ.1.5 రాయితీ

విద్యుత్ యూనిట్ ధర రూ.3.85కుగాను ప్రభుత్వం రాయితీపై రూ.1.5 అందిస్తోంది. వైట్ స్పాట్ వైరస్, వైట్‌గట్, ఈహెచ్‌పీ వంటి వ్యాధుల విజృంభణతో పాటు మేతలు, ఆయిల్ ధరల పెరుగుదల, నిలకడలేని రొయ్యల ధరలతో ఆక్వా రైతులు నష్టాల ఊబిలో చిక్కుకున్నారు. మేతల ధరలు, రొయ్యల ధరలు నిలకడగా ఉండేందుకు చర్యలు చేపట్టి రాయితీపై విద్యుత్ అందించడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హర్షం వక్తం చేస్తున్న ఆక్వా రైతులు

రొయ్యలు ధరలకు సంబంధించి ఎక్స్‌పోర్టు కంపెనీలతో సంప్రదించి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, రాయితీపై విద్యుత్ అందించడంపై ఆక్వా అసోసియేషన్ హర్షం వ్యక్తం చేస్తోంది.

ప్రభుత్వం అండగా ఉంది



మేత, డీజిల్ ధరలు పెరిగిపోవడంతో ఆక్వా సాగు భారంగా మారింది. ప్రభుత్వం ఆక్వా సాగుకు రాయితీపై విద్యుత్ సరఫరా చేస్తూ రైతులను ప్రోత్సహించడం సంతోషంగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆక్వా పరిశ్రమకు ప్రభుత్వం అండగా ఉంది. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.310 కోట్లు విద్యుత్ రాయితీ ఆక్వా రైతులకు వచ్చేది. ప్రస్తుతం రూ.620 కోట్ల రాయితీగా ఏడాదికి వస్తోంది.

– త్సవటపల్లి నాగభూషణం, రామలింగేశ్వర ఆక్వా అసోసియేషన్ అధ్యక్షుడు

అప్సడాతో సమస్యల పరిష్కారం



ఆక్వా పరిశ్రమలో సమస్యల పరిష్కారానికి అప్సడా దోహద పడుతుంది. మధ్యవర్తులు లేకుండా ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు ఇది కృషి చేస్తుంది. ప్రభుత్వం యూనిట్ రూ.1.5 రాయితీతో ఆక్వా పరిశ్రమకు విద్యుత్ అందించి ప్రోత్సహించడం సంతోషం.

– భూపతిరాజు సుబ్రహ్మణ్యంరాజు, ఆక్వా రైతు, ఎదుర్లంక

ఉగ్రవాదులు టార్గెట్ చేసిన రాష్ట్రాలు ఏవి?

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు హైదరాబాద్–భోపాల్‌లలో అరెస్టు చేసిన ఉగ్రవాదులకు సంబంధించిన కేసు విచారణను ఎన్‌ఐఏ ముమ్మరం చేసింది. ఈ కేసును ఢిల్లీ యూనిట్ గత నెల 24న రీ–రిజిస్టర్ చేసిన విషయం తెలిసిందే. దీని దర్యాప్తు కోసం ఏర్పాటైన ప్రత్యేక ఎన్‌ఐఏ బృందం సోమవారం ఢిల్లీ నుంచి భోపాల్ చేరుకుంది. ఏటీఎస్ అధికారులతో సమావేశమైన ఈ టీమ్.. కేసు పూర్వాపరాలు తెలుసుకుంది. గత నెల 9న ఏకకాలంలో దాడులు చేసిన ఏటీఎస్ అధికారులు హైదరాబాద్‌లో ఐదుగురు, భోపాల్‌లో 11 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. హిజ్బ్ ఉత్ తెహ్రీర్ (హెచ్‌యూటీ) ఉగ్రవాద సంస్థకు చెందిన ఈ మాడ్యుల్ షరియత్ స్థాపనే లక్ష్యంగా విధ్వంసాలకు పథక రచన చేసింది. వీరి టార్గెట్‌లో అనేక ప్రాంతాలతో పాటు మత నాయకులు కూడా ఉన్నట్లు ఏటీఎస్ ఆరోపిస్తోంది. కాగా, ఈ ఉగ్రవాదులు తెలంగాణ, మధ్యప్రదేశ్‌తో పాటు ఏయే రాష్ట్రాలను టార్గెట్‌గా చేసుకున్నారనే కోణంలో ఎన్‌ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఆయుధాలు, మందుగుండు సామగ్రితో పాటు పేలుడు పదార్థాలనూ సమీకరిస్తున్న వీరి అసలు కుట్ర ఏమిటి అన్నదానిపై ఎన్‌ఐఏ దృష్టి సారించింది. ఈ మాడ్యుల్ 2022 లోనే ఏర్పాటైనట్లు భావిస్తున్నారు. ఈ 16 మంది ఉగ్రవాదులను ఏటీఎస్ అధికారులు ఇప్పటికే రెండుసార్లు తమ కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించారు. ఎన్‌ఐఏ అధికారులు సైతం న్యాయస్థానం అనుమతితో సూత్రధారులైన హైదరాబాద్, భోపాల్‌లకు చెందిన మహ్మద్ సలీం, యాసిర్ ఖాన్‌లతో పాటు మిగిలిన వారినీ మరోసారి కస్టడీలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా త్వరలో వీరిని హైదరాబాద్ తీసుకురావాలని ఎన్‌ఐఏ నిర్ణయించింది. ఉగ్రవాదుల నుంచి ఏటీఎస్ స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్స్, హార్డ్‌డిస్క్‌లు, పెన్‌డ్రైవ్స్‌తో పాటు ఆయుధాలు తదితరాలను ఏటీఎస్ నుంచి ఎన్‌ఐఏ తమ ఆధీనంలోకి తీసుకుంది.

బీజేపీకి అన్ని రాష్ట్రాలు సమానమే

కేంద్ర ఆరోగ్య శాఖ సహాయమంత్రి భారతీ ప్రవీణ్ పవార్



గుంటూరు మెడికల్: భారతీయ జనతాపార్టీ అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూస్తున్నదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ తెలిపారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ మాట్లాడుతూ 70 ఏళ్లలో దేశంలో లేని అభివృద్ధి తొమ్మిది సంవత్సరాలలోనే బీజేపీ చేసి చూపించిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఇప్పటికే రూ.10 వేల కోట్లు అందజేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులు పరిశీలించడానికి ఇకపై తరచుగా రాష్ట్రానికి రానున్నట్లు చెప్పారు. బీజేపీ బూత్ స్వశక్తి కరణ్ అభియాన్‌లో భాగంగా మంత్రి బూత్ స్థాయి కమిటీలకు సంబంధించి ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ, నాయకులు పాకా సత్యనారాయణ, పాతూరి నాగభూషణం, తులసి రామచంద్ర ప్రభు తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ బాటిల్ ధర నాకంటే మీకే బాగా తెలుసు: నారా లోకేశ్



చెన్నూరు: జగన్ ప్రభుత్వం వచ్చాక అన్ని ధరలు పెరిగాయని అందులో క్వార్టర్ బాటిల్ ధర గురించి నాకంటే మీకే బాగా తెలుసని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రజలనుద్దేశించి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 5 గంటల తరువాత వాతావరణం చల్లబడ్డాక లోకేశ్ క్యాంపు నుంచి పాదయాత్ర ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గం చెన్నూరు పాత బస్టాండు వద్ద సభలో మాట్లాడారు. 'చీకట్లో కోడిగుడ్లు వేయించడమేంది జగన్.. దమ్మూ, ధైర్యం ఉంటే నేరుగా రా తేల్చుకుందాం' అంటూ రెచ్చగొట్టేలా ప్రసంగించారు. పులివెందులలో టీడీపీ అధికారంలో ఉన్న 5 సంవత్సరాల్లో, ఈ నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి గురించి చర్చించడానికి సిద్ధమని సవాల్ విసిరారు. టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించే క్రమంలో 'మీ కన్నీరు తుడవడానికే జగనన్న మహాశక్తి'ని ప్రకటించాడని లోకేశ్ అనడం గమనార్హం. చంద్రన్న బదులు జగన్ మహాశక్తిని ప్రకటించాడని అనడంతో సభకు వచ్చిన వారు పెద్దగా నవ్వారు.

> జీవితం భగవంతుడు దీక్షగా రాస్తుండే నవల. అందులో ఆయన ఉద్దేశించిన మీ పాత్రకు మార్పులు, చేర్పులు చేయాలని మీరు నిరంతరం ప్రార్థిస్తూ ఆయనకు అంతరాయం కలిగించకండి.
>
> – జుడాయిజం

సాక్షి

మంగళవారం, 6 జూన్ 2023

‘బాలాసోర్’ కళ్లు తెరిపిస్తుందా?

ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో రైళ్లు ఢీకొన్న ఘోర ఉదంతం చోటు చేసుకుని మూడు రోజులు గడుస్తోంది. ఇప్పటికీ అనేక కుటుంబాలు తమ ఆప్తుల ఆచూకీ తెలియక తల్లడిల్లుతున్నాయి. 187 మృత దేహాలను ఇంకా గుర్తించాల్సివుందంటున్నారు. శుక్రవారం సంజె చీకట్లు అలుముకుంటున్న వేళ హౌరా నుంచి చెన్నైకి వేగంగా వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ లూప్ లైన్‌లోకి ప్రవేశించి అక్కడున్న గూడ్స్ రైలును ఢీకొట్టడం, ఆ ప్రమాదంలో చెల్లాచెదురుగా పడిన బోగీల్లో ఒకటి రెండు పక్క ట్రాక్‌పై పడడం, ఆ ట్రాక్‌పై వెళ్లే బెంగళూరు– హౌరా యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ సైతం ప్రమాదంలో చిక్కుకోవడం ఊహకందని ఉత్పాతం. మృతుల సంఖ్య 275 వరకూ ఉండగా, 1100 మంది గాయపడ్డారు. వీరిలో కనీసం వందమంది వరకూ తీవ్ర గాయాలపాలైనవారున్నారు. విద్రోహ చర్యనో, సాంకేతిక తప్పిదమో ఇంకా నిర్ధారించాల్సే ఉన్నా ఆ దుర్ఘటన వందలాది కుటుంబాల భవితవ్యాన్ని తలకిందులు చేసింది. అనేకులు శాశ్వత అంగవైకల్యం బారినపడ్డారు. సహాయ బృందాలు వచ్చేలోగా స్థానికులు చూపిన చొరవ ఎన్నో ప్రాణాలను కాపాడింది. ఇది విద్రోహ చర్య కావొచ్చని ప్రాథమికంగా నిర్ధారణకొచ్చామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెబుతున్నారు. కారకులెవరో కూడా తెలిసిందంటున్నారు. ఈ వ్యవహారంలో సీబీఐ దర్యాప్తు కూడా ఉంటుంది. ఉద్దేశపూర్వకంగా ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ వ్యవస్థలో మార్పులు చేయడాన్ని కొట్టిపారేయలేమన్నది రైల్వే అధికారుల మాట. చెప్పడానికి ఇది బాగానేవున్నా... ఆ వ్యవస్థలో లోపాన్ని గుర్తించి మొన్న ఫిబ్రవరిలో నైరుతి రైల్వే జోన్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ రాసిన లేఖ విషయంలో దేశవ్యాప్తంగా తీసుకున్న చర్యలేమిటో ఉన్నతాధికారులు వెల్లడించాలి. ఆ లేఖలోని అంశాలు భీతి గొలుపుతాయి. ఆ నెల 8న బెంగళూరు నుంచి న్యూఢిల్లీ వెళ్లే సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఇప్పుడు బాలాసోర్‌లో కోరమండల్‌కు ఎదురైన లాంటి సమస్యే వచ్చింది. మెయిన్ లైన్‌లో పోవచ్చని వచ్చిన సిగ్నల్‌కు భిన్నంగా ట్రాక్ మారటాన్ని గమనించి లోకో పైలట్ వెంటనే రైలును నిలిపివేశాడు. లేకుంటే అది కూడా పెను ప్రమాదంలో చిక్కుకునేది.

మన దేశంలో అత్యాధునిక వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వరసగా పట్టాలెక్కుతున్నాయి. అహ్మదాబాద్ – ముంబై మధ్య బుల్లెట్ ట్రైన్ పనులు నడుస్తున్నాయి. కానీ మన రైల్వేల పనితీరు అంతంత మాత్రమే. రోజూ మన రైళ్లు 2 కోట్ల 20 లక్షల మంది ప్రయాణికుల్ని గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. 1950లో ఉన్న మన రైల్వే ట్రాక్‌ల నిడివి 53,596 కిలోమీటర్లయితే, ఇప్పుడది 68,100 కి.మీ.కి చేరుకుంది. అప్పట్లో మన రైల్వే ట్రాక్‌ల నిడివిలో సగం కన్నా తక్కువగా...అంటే 21,800 కి.మీ. మాత్రమే ఉన్న చైనాలో 1997 నాటికి 66,000 కిలోమీటర్లకు చేరుకోగా, ప్రస్తుతం అది 1,55,000 కి.మీ ఉందని అంచనా. అంటే మనకు రెట్టింపు అన్నమాట. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చేనాటికి ఉన్న కేటాయింపులతో పోలిస్తే ఇప్పుడు రైల్వే కేటాయింపులు అయిదు రెట్ల వరకూ పెరిగిన మాట వాస్తవమే అయినా... దానికి తగినట్టు సదుపాయాలు పెరుగుతున్న దాఖలా గానీ, మెరుగైన బోగీలు తెస్తున్న తీరు గానీ కనబడటం లేదు. భద్రతా అంశాలు సరేసరి. తరచుగా రైళ్లలో ప్రయాణించేవారికి ఇవన్నీ నిత్యానుభవం. ప్రభుత్వ రంగ ఉద్యోగాలు రోజురోజుకూ కుంచించుకుపోతున్నాయి. రైల్వే శాఖ కూడా దీనికి మినహాయింపు కాదు. మొన్న జనవరి గణాంకాల ప్రకారం ఆ శాఖలో 3.12 లక్షల నాన్ గెజిటెడ్ పోస్టులు ఖాళీగా పడి వున్నాయి. వీటిల్లో చాలా పోస్టులు భద్రత, నిర్వహణ, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించినవే. సెంట్రల్ రైల్వేలో భద్రతకు సంబంధించిన విభాగంలో 28,650 పోస్టులుంటే అందులో సగం ఖాళీలే. కొత్త రైళ్లు వస్తున్నాయి. వాటి వేగం కూడా పెరుగుతోంది. కానీ అందుకు తగినట్టుగా ట్రాక్‌లు ఉంటున్నాయా? సిబ్బంది పెరుగుతున్నారా? పాలకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. వేగవంతమైన రైళ్లు వచ్చాయని సంబరపడుతున్నాం గానీ...ఇప్పటికీ మన రైళ్ల సగటు వేగం గంటకు 50 కిలోమీటర్లు మించడం లేదు. దీన్ని అయిదేళ్లలో 75 కిలోమీటర్లకు పెంచుతామని 2017లో రైల్వే బోర్డు ప్రకటించింది. కానీ అది కలగా మిగిలిందని ఇటీవలే కాగ్ అక్షింతలు వేసింది. జపాన్, చైనా, టర్కీ, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్‌లలో రైళ్ల సగటు వేగం 150 – 250 కిలోమీటర్ల మధ్య ఉంటుంది. మన రైళ్ల సగటు వేగం నాసిరకంగా ఉన్నా భద్రతాపరంగా మెరుగైన స్థితిలో ఉండలేకపోతున్నాం. రైళ్లు పెరిగినా, వాటి వేగం పుంజుకున్నా అందుకు అనుగుణంగా ట్రాక్‌లు పెరగకపోవటం వల్ల ఉన్న ట్రాక్‌లపైనే ఒత్తిడి పెరుగుతోంది. ట్రాక్‌ల నిర్వహణ, విద్యుత్, సిగ్నలింగ్ వ్యవస్థల పర్యవేక్షణ వంటివి సక్రమంగా సాగటం లేదు. మరమ్మత్తుల కోసం రైళ్లను ఆపాల్సి రావటంతో ‘సూపర్ ఫాస్ట్’ భుజకీర్తులు తగిలించుకున్న రైళ్లు కూడా సకాలంలో గమ్యం చేరటం లేదు.

రైళ్లను ఎక్కువగా వినియోగించేది సామాన్యులు, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి పౌరులు. ఇప్పుడు ప్రమాదంలో చిక్కుకున్న కోరమండల్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ల మృతుల్లో ఎక్కువ మంది వలస వెళ్లక తప్పని బడుగుజీవులే కావటం యాదృచ్ఛికం కాదు. బాలాసోర్ ఉదంతం మన పాలకుల కళ్లు తెరిపించాలి. ఇతర సర్కారీ కొలువుల మాటెలావున్నా భద్రతకు అగ్ర ప్రాధాన్యమిచ్చి రైల్వేల్లో కొన్నేళ్ళుగా అలా ఉంచేసిన లక్షలాది ఖాళీలన్నిటినీ భర్తీ చేయాలి. ఆదాయం తప్ప మరేమీ పట్టని ధోరణి ఇకనైనా మారాలి. మౌలిక సదుపాయాల మెరుగుదల, భద్రతకు ప్రాధాన్యం లాంటి అంశాల్లో రాజీ పనికిరాదు.

వాదోపవాదాల విషాదం



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

రైల్వే సిగ్నల్స్ నిర్వహణ వ్యవస్థపై నిరంతరం కన్నువేసి, ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ ఉండకపోతే రైలు ప్రమాదాలు తరచూ సంభవించే అవకాశం ఉందని ఈ ఏడాది ఫిబ్రవరిలోనే నైరుతి రైల్వే ప్రధాన అధికారి హెచ్చరించారు! అలాగే, రైలు ప్రయాణికుల భద్రత గురించి ‘కాగ్’, పార్లమెంటరీ స్థాయీ సంఘం అప్రమత్తం చేస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత కేంద్ర కమిటీలు, ఉన్నతస్థాయి విచారణ సంఘాల నివేదికలను అధికారులు ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు? రైళ్లు ఢీకొనకుండా ‘కవచ్’ రక్షణ వ్యవస్థను రూపొందించినా, బ్రాడ్‌గేజ్ రైల్వే మార్గాల్లో కాపలా లేని లెవెల్ క్రాసింగ్స్‌ను కూడా తొలగించినా రైలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ లోపాల్ని పరిష్కరించడానికి ప్రయత్నించే బదులు.. మంత్రులు రాజీనామాలు చేయాలని, కాదు కాదు... కింది తరగతి రైల్వే ఉద్యోగుల్ని, కార్మికుల్ని శిక్షించాలని వాదోపవాదాలకు దిగడం కూడా విషాదమే!

‘‘వందలాదిమంది ప్రయాణికుల దుర్మరణానికి దారి తీసిన ఒడిశా రైలు ప్రమాదానికి కారకులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. ఈ శతాబ్దంలోనే ఇది అతి పెద్ద ప్రమాదం.’’
– ప్రధాని నరేంద్ర మోదీ (4.6.2023)

‘‘చాలాకాలంగా భారత రైల్వేలోని సిగ్నలింగ్ వ్యవస్థ నిర్వహణలో ఉన్న తీవ్రమైన లోపాల గురించీ, వైఫల్యాల గురించీ, రైళ్ల రాకపోకలను తెలియజేసే గుర్తులను సూచించే సరైన పద్ధతుల గురించీ; రైలు బయలుదేరిన తరువాత, రైలు వెళ్లే దిశను మార్చవలసి వస్తే ఆ మార్పును సూచించే గుర్తును తెలిపే విధానం గురించీ స్పష్టంగా ఉంది. కానీ నిర్దిష్టమైన సిగ్నల్స్‌ను అనుసరిస్తూ లోపాల్ని తక్షణం సవరించకపోతే – రైలు దుర్ఘటనలు అనివార్యమవుతాయి...’’ అని కూడా నైరుతి రైల్వే ప్రధాన అధికారి ఈ ఏడాది ఫిబ్రవరి 9 న హెచ్చరించారు. అంతేగాదు, రైల్వే సిగ్నల్స్ నిర్వహణ వ్యవస్థపై నిరంతరం కన్నువేసి, సరిదిద్దుకుంటూ ఉండకపోతే రైలు ప్రమాదాలు తరచూ సంభవించే అవకాశం ఉందని ఆ ఉన్నతాధికారి హెచ్చరించారు. అలాగే, రైలు ప్రయాణికుల భద్రత గురించి ‘కాగ్’, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికల హెచ్చరికలను పాలకులు పెడచెవిన పెట్టడానికి కారకులెవరన్న ప్రశ్నలకూ సమాధానం లేదు!

ఈ పై కారణాలను పరిశీలించినప్పుడు ఎవరిని నిందించాలి? పాలకుల ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్ర కమిటీలు, దఫదఫాలుగా నియమించిన సాధికార ఉన్నతస్థాయి విచారణ సంఘాల నివేదికలను, వాటి సారాంశాన్ని అధికారులు ఎందుకు పాటించడం లేదన్నది అసలు ప్రశ్న. రైలు ప్రమాద ఘటన సందర్భంగా, మహబూబ్‌నగర్ వద్ద రైలు ప్రమాదంలో 112 మంది ప్రయాణికులు చనిపోయినందుకు విలవిలలాడిన నాటి కేంద్ర రైల్వే మంత్రి, గాంధేయవాది అయిన లాల్ బహదూర్ శాస్త్రి తన పదవికి క్షణాలలో రాజీనామా చేసి ఆదర్శంగా నిలబడ్డారు. ప్రధాని పండిట్ నెహ్రూ ‘వద్దని’ వారించినా లాల్‌బహదూర్ రాజీనామాకే పట్టుబట్టారు! మహబూబ్‌నగర్ దుర్ఘటన తరువాత కొలది రోజులకే తమిళనాడులోని అరియలూర్ దుర్ఘటనలో 144 మంది చనిపోయారు. ఈ రెండు ఘటనలూ లాల్‌బహదూర్‌ను కుదిపేశాయి.

రెండో మాట



68,100 కిలోమీటర్ల నిడివిగల రైల్వే లైన్లతో కూడిన భారత వ్యవస్థలో గత 15 ఏళ్లలో జరిగిన ప్రధాన దుర్ఘటనలు: జ్ఞానేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (మృతులు 148), ఉత్తర బంగా–వనాంచల్ ఎక్స్‌ప్రెస్ (63 మంది), ఛాప్రా–మథుర ఎక్స్‌ప్రెస్ (63 మంది), హుబ్లీ–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (25 మంది), తమిళనాడు–ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ (30), యూపీ సంత్‌కబీర్–గోరఖ్‌ధామ్ ఎక్స్‌ప్రెస్ (25), డెహ్రాడూన్–వారణాసి జనతా ఎక్స్‌ప్రెస్ (30), పాట్నా–ఇండోర్ ఎక్స్‌ప్రెస్ (150), బికనీర్–గౌహతి ఎక్స్‌ప్రెస్ (9 మంది), హౌరా–న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ (140).

రైళ్లు ఢీకొనకుండా ‘కవచ్’ రక్షణ వ్యవస్థను రూపొందించినా, బ్రాడ్‌గేజ్ రైల్వే మార్గాల్లో కాపలా లేని లెవెల్ క్రాసింగ్స్‌ను కూడా తొలగించినా రైలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అదుపాజ్ఞల వ్యవస్థ పకడ్బందీగా లేనందున జరుగుతున్న ఈ వరస రైలు దుర్ఘటనల నివారణకు అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కూడా అక్కరకు రావడం లేదు. అంటే సిబ్బందికి ఇచ్చే శిక్షణలో కూడా లోపం ఉందని పలువురు రైల్వే అధికారుల నోట కూడా వినవస్తోంది. కానీ ఈ తీవ్ర లోపాల్ని పరిష్కరించడానికి ప్రయత్నించే బదులు కింది తరగతి రైల్వే ఉద్యోగుల్నీ, కార్మికుల్నీ శిక్షించే మార్గాలను పాలకులు వెతకడానికి ప్రయత్నించడం సమంజసం కాదు.

ఒకవైపున రైల్వేబోర్డే సిగ్నలింగ్‌లో లోపం వల్ల ఒడిశా రైలు ప్రమాదం జరిగిందని చెబుతున్నప్పుడు, ప్రమాద కారణాల్ని కార్మిక సిబ్బందిపైకి నెట్టడానికి ప్రయత్నించడం సరి కాదు. ఆధునిక పరిజ్ఞానం ఆకళింపులో ఉన్నా మానవుల స్వయం పరిమితుల్ని కూడా గమనించుకోవాలి.

అక్కడికీ ఒక సీనియర్ రైల్వే అధికారి ఒక విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పారు: ‘‘ఇంటర్ లాకింగ్‌లోని సాఫ్ట్ వేర్ లేదా హార్డ్ వేర్ పనిచేయడంలో సంభవించే లోపం వల్ల కూడా రైళ్లకు సూచించవలసిన లూప్‌లైన్, మెయిన్ లైన్ ఎంపికలో గందరగోళానికి అవకాశం ఉంది. అంటే సిగ్నల్ ఒకటై, స్విచ్ ఆపరేషన్ వేరైతే ఈ ప్రమాదానికి ఆస్కారం ఉంది (5.6.23). ఈ ఘోరానికి రైల్వేమంత్రి రాజీనామా పరిష్కారం కాకపోవచ్చుగాని, ఆ స్థానంలో మరొకర్ని విచారణ పేరిట తేలిగ్గా ఇరికించే అవకాశం ఉంది. ఇంతకూ మనిషి (మంత్రి కూడా మనిషే అయితే) స్వార్థం ఎలా పనిచేస్తుందో కవి ‘సినారె’కు బాగా తెలిసినట్టుంది:

‘‘తోడుగ సాగే నీడను కూడా
వాడుకుంటుంది స్వార్థం
ఆపై వాణ్ణే పాచిక చేసే
ఆడుకుంటుంది స్వార్థం
మనిషిలోని ఆ చీకటి కోణం
మార్చే వేషాలెన్నో –
చిటికెడు పేరుకు నీతిని
నిలువున చీల్చేస్తుంది స్వార్థం
మూరెడు గద్దె కోసం
జాతి పరువునే ఆరవేస్తుంది స్వార్థం!’’


abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వృథా వద్దు



‘యూజ్ అండ్ త్రో’ మనస్తత్వానికి ముగింపు పలకడం అంటే కాలుష్యాన్ని తగ్గించడం మాత్రమే కాదు, సృష్టిని గౌరవించడం కూడా! మన ప్రతి వాడకం బాధ్యతా యుతంగా ఉండాలి.
– జగ్గీ వాసుదేవ్, ఆధ్యాత్మికవేత్త

అంతులేని విచారణ!



సంతోషించడానికేమీ లేదు. ముఖ్తార్ అన్సారీ అనే గ్యాంగ్‌స్టర్ కమ్ పొలిటీషియన్ 31 ఏళ్ల 10 నెలల తర్వాత గానీ హంతకుడని తేలలేదు. న్యాయ వ్యవస్థ పరిమితులకు ఈ తీర్పు నిదర్శనం.
– ప్రవీణ్ పాయ్, సుగంధాల నిపుణుడు

దేశవాళీ నాణ్యత



ఫైజర్, మాడెర్నా కంపెనీల కోవిడ్ వ్యాక్సిన్‌లలో క్యాన్సర్‌ను కలిగించే డీఎన్ఏ బయటపడింది! ఈ రెండు సంస్థలు భారతీయ వ్యాక్సిన్‌లతో తమ వ్యాక్సిన్‌లను భర్తీ చేయించాలని నేటికీ తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నాయి. భారతీయ తయారీ వ్యాక్సిన్‌లకు అండగా నిలిచిన మోదీ ప్రభుత్వానికి ఇప్పటికైనా పూర్తి మార్కులు వేద్దామా?
– సిన్హా, పొలిటికల్ ఎనలిస్ట్

ఆ మాటెందుకు!



అశోక్‌జీ! మీ ‘72 హూరైన్’ మూవీ టీజర్ చూశాను. కశ్మీరీ హిందువులపై కూడా మంచి డాక్యుమెంటరీనే వచ్చింది. అయితే చివర్న వాళ్లు, ‘ఉగ్రవాదానికి మతం లేదు’ అనే కార్డ్ వేశారు. మీపై అలాంటి ఒత్తిడి ఉండదనే ఆశిస్తున్నాను. (కో–డైరెక్టర్ అశోక్ పండిత్‌ను ట్యాగ్ చేస్తూ).
– నీరజ్ అత్రి, రచయిత

శకుని మామ



80లలో, 80లకు ముందు పుట్టిన పిల్లలు ఈ లెజెండ్‌ని ఎప్పటికీ గుర్తుంచుకుంటారు. ఎందుకంటే మనం ఆయన అద్భుత నటనా నైపుణ్యాన్ని కళ్లార్పకుండా చూశాం. టీవీలో ప్రతి ఆదివారం అంతా ఎదురుచూస్తుండే ‘మహాభారతం’ సీరియల్ పాత్రలలో ఒకరైన ‘శకుని మామ’ను గుఫీ పైంటాల్‌లా వేరెవరూ పోషించలేరు. ఆయనకు శ్రద్ధాంజలి.
– ప్రాప్తి, ఎనభైల చిన్నారి

లోపం ఎక్కడుంది?!



బిహార్‌లో గంగానదిపై మరమ్మతులు జరుగుతున్న భాగల్‌పూర్ వంతెన రెండోసారి కుప్పకూలింది! బీజేపీ, జేడీయూలు అధికారంలో ఉండగా 2015లో ఈ వంతెన నిర్మాణం మొదలైంది. 2020లో నిర్మాణం దాదాపుగా పూర్తయింది. మొదటిసారి 2021లో గాలి, వానకు కూలిపోయింది. 1700 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ వంతెన ఇలా మాటిమాటికీ పడిపోవడం ఏమిటి!!
– ఫిజా, యూట్యూబర్

కష్టకాల అసహనం



ఒడిశా రైలు విషాదంలో ఆయన గొప్ప అంకిత భావంతో, చిత్తశుద్ధితో పని చేస్తున్నారు. గత 3 రోజులుగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిరంతరం ఘటనా స్థలంలోనే ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కష్టకాలంలో మనం అడగవలసింది మంత్రుల రాజీనామా కాదు, జరగవలసిన సంస్కరణల గురించి!
– డాక్టర్ సయ్యద్ రిజ్వాన్ అహ్మద్, డిబేటర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.విదియ ఉ.5.43 వరకు, తదుపరి తదియ రా.3.38 వరకు, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.2.12 వరకు తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.12.34 నుండి 2.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.59 వరకు, తిరిగి రా.10.54 నుండి 11.38 వరకు, **అమృతఘడియలు:** రా.9.32 నుండి 11.02 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

కరోనా విధ్వంసానికి గురుతుగా...

వర్తమాన కవిత్వ ప్రవాహాన్ని ఒరుసుకుంటూ సాగుతున్న భిన్న భిన్న శోక క్రోధ రస గీతాల లయలు ‘నిజం’ వచన పద్యాలు. ‘నిజం’ కలం నుండి వచ్చిన కొత్త పుస్తకం ‘బూడిద చెట్ల పూలు’ కొన్ని కవితా ఖండికల కూర్పు కాదు, ఒక ఊపు. కవి ఒక మూడ్ లో బందీ అయి కట్లు తెంపుకొని బయట పడే ప్రయత్నంలో పెట్టిన వరుస కేకలు.

ప్రాథమికంగా ఇది కరోనా విలయతాండవాన్ని ఉద్దేశించిన కవితల సంపుటి. పుస్తకం పేరు కరోనా సృష్టించిన శవరాశుల దహన శేషాన్ని ఉద్దేశించినదే. కవితల్లో నిరసన జ్వాలలు ఎక్కువ. ‘రాజును మోసి జనాన్ని ద్వేషించే/ వ్యాపారిని ప్రేమించి వ్యాక్సిన్ను చెట్టెక్కించే/ విష వానల ఆకాశం



కింద /అనాథ విత్తుల పైరులై విరగపండుతారు’ అంటూ ప్రభు వ్యాపార పక్షపాతాన్ని నిలదీస్తారు కవి. ‘కట్టుబట్టలతో కదిలిపోతున్న జాతి, సాటి దేశాలకు తన చిరునామా/ వల్లకాడని చెబుతోంది/ సాహసించి పరామర్శకు రావొద్దని హితవు పలుకుతోంది’ అని వల్లకాటి వాఙ్మూలం రాస్తున్నారు. ఇలా కరోనా విలయానికి భస్మమైన జీవుల బూడిద చెట్ల పూలను ఎన్నింటినో తాకవచ్చు.

మిగతా కవితల విషయానికొస్తే కొన్నిట్లో నిరసన కాగడాల్లా ధిక్కార జ్వాల అక్షరాల వరుస కడుతుంది. సామాజిక హింసలో సామాన్యుల గోస కవి గుండెల్ని కెలికినట్లు వేదన, ఆర్ద్రత కంటిని తడిపేస్తుంది. ‘ప్రజలందరూ దేవతావస్త్రాల్లో వెలిగిపోతున్నారు/ అన్నాకలుండని రామ భజనామృత సేవనంలో తరిస్తున్నారు’ అని తెలుగు కవిత్వానికి తెగువనద్దుతున్నారు. బాల్యాన్నీ, ప్రకృతినీ, అడవినీ, పక్షులనూ ‘నిజం’ తన కవితల్లో సందేశాత్మకంగా వాడుకున్నారు.


ఈ కవిలో ఉన్న మరో ప్రత్యేకత భాషా ప్రయోగం. పత్రికా రచనతో వచ్చిన పట్టు వల్ల పదాలతో సర్కస్ చేయించగలరు. కొత్త అర్థాలను చెప్పే పదజతులను సృష్టించగలరు. సుమారుగా ప్రతి కవితలోనూ ఈ మెరుపు కనిపిస్తుంది. ‘చమత్కారంతో కూడిన నూతన పదసృష్టి ఈ కవి హాల్ మార్క్. వాటిలో అద్భుతమైన, ఆహ్లాదకరమైన చమత్కారం, హాస్యం దాగి ఉన్నాయి’ అంటూ ఎలనాగ ఈ కవిత్వంలోని శిల్ప సమన్వయాన్ని తన మాటల్లో పేర్కొన్నారు.

ఈ పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థను శాస్త్రీయంగా అర్థం చేసుకోలేక, భ్రమలకు లోనవుతున్న కాలంలో మనసా వాచా రాజ్యంపై తిరగబడే కవిగా గార శ్రీరామమూర్తి (నిజం) పూర్తిగా ‘నిజం’ వైపు నిలబడుతున్నారు. తన కవిత్వం ద్వారా అంతా నిజమే చెబుతానని మనిషిపై ప్రమాణం చేస్తున్నారు. ఈ విలక్షణత తెలుగు కవిత్వానికి ఎంతో అవసరం.

– బి. నర్సన్, విశ్లేషకుడు, 94401 28169

ఫ్యూడల్ ఔదార్యాల పరిమితులు!

అభిప్రాయం



దివికుమార్

ఇటీవల ఫేస్‌బుక్‌లో ఎవరో రాసిన ఒక అభిప్రాయాన్ని మా మిత్రుడు ఒకరు ప్రశ్న రూపంలో నాపై సంధించాడు. జవాబు నన్ను చెప్పమంటాడు. దాని సారాంశమేమిటంటే... తెలంగాణలో ఆధునిక విద్యా సౌకర్యాల్లాంటివి కల్పించిన మహా ఘనత వహించిన నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడటం, తెలంగాణకు కమ్యూనిస్టులు చేసిన ద్రోహం కాదా అని! కురుక్షేత్ర మహాసంగ్రామంలో శ్రీకృష్ణుడు యుద్ధాన్ని నడిపించాడే కానీ యుద్ధం చేయలేదు. అలాగే మన సందర్భంలో పోరాడితే తప్ప తమ బతుకులు బాగు చేసుకోలేని తెలంగాణ రైతాంగం యుద్ధం చేసింది. అందుకు అన్ని రకాల నిర్మాణాత్మక మార్గదర్శకత్వాన్ని అందించింది కమ్యూనిస్టు పార్టీ.

నిజాం కాలేజీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం లాంటి మహావిద్యాలయాలు ఆధునిక ఆసుపత్రులు, వరంగల్లులో ఆజం జాహి మిల్లులు తరహా ఆధునిక పరిశ్రమలు అందించిన నైజాం ప్రభువు గురించి ఈ తరహా వాదన చేయడం ఇది మొదటిసారి కాదు. మన పల్లెల్లో ప్రాచుర్యం పొందిన సామెత ఒకటి ఉంది. ‘మంచివాని బుద్ధి... మాంసం కాడ తెలుస్తుంది’ అని! అందుకు నిదర్శనంగా కొన్ని ఉదాహరణలు చూద్దాం.

1950లకు పూర్వం సూర్యాపేట – కోదాడ నడుమ మునగాల పరగణా ఉండేది. ఆ పరగణా జమీందారు నాయని వెంకటరంగారావు. తన వద్ద దివానుగా ఉన్న కొమర్రాజు లక్ష్మణరావు చేసిన సాహిత్య, సాంస్కృతిక కృషికి మునగాల జమీందారు చాలా సహాయపడ్డారు. కానీ ఆ రాజావారి జమీలో కౌల్దారీ రైతుల హక్కుల పోరాటం మొదలయేసరికి వారి ఉద్యమాన్ని క్రూరంగా అణచివేయడానికీ, చిత్రహింసల పాల్జేయడానికీ, ఆఖరికి దాదాపు 14 మంది రైతాంగ కార్యకర్తలను బలితీసుకోవడానికి రాజా వెనుదీయలేదు.



అలాగే 1946లో గుర్రం జాషువాకు బెజవాడలో గజారోహణతో నగరవీధులలో ఊరేగింపు జరపడానికి చల్లపల్లి కోట నుండి జమీందార్ రాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్ బహద్దరు తన ఏనుగును పంపి ఔదార్యాన్ని చాటారు. కానీ అదే సంవత్సరం – 1946లోనే కృష్ణానదిలోని గాజుల్లంకలో రైతులు, తమకు గల భూమిపై హక్కుల కోసం పోరాడితే ముగ్గురిని కాల్చి చంపారు. వారిలో బావిరెడ్డి వియ్యమ్మ అనే మహిళా రైతు కూడా ఒకరున్నారు. కొన్ని సందర్భాలలో ఎంతో ఔదార్యాన్ని ప్రదర్శించినవారే తమ వర్గ ప్రయోజనాల దగ్గర కొచ్చేసరికి ఎంత కఠినాత్ములైపోతారో ఈ విషయం స్పష్టం చేయడం లేదా!

మైసూర్ పాలకులు హైదరాలీ, ఆయన కొడుకు టిప్పు సుల్తాన్‌లపై బ్రిటిష్‌వాళ్లు దురాక్రమణ యుద్ధాలు చేసినపుడు నిజాం నవాబులు బ్రిటిష్ వారికే సహాయపడ్డారు. 1857 నాటి ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కూడా బ్రిటిష్ వారికి రక్షకులుగా నిజాం నవాబులు ఉన్నారు. ఆ రకంగా అనాటి చరిత్రలో రాజకీయంగా వారిది పూర్తిగా అభివృద్ధి నిరోధక పాత్ర. చిట్టచివరి నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ కూడా అంతే! తన ఫ్యూడల్ రాచరికానికి మూలస్తంభాలైన (హిందూ) దేశ్‌ముఖ్‌లు, జమీందార్లు, పటేళ్ళు, పట్వారీలపై తెలంగాణ రైతాంగం ఉద్యమం ప్రారంభం నుండీ ప్రజల్ని తీవ్రంగా అణచివేశాడు నిజాం.

పాలకులు ధనంతో సులువుగా లభించే కీర్తి ప్రతిష్ఠలను తమ తమ ఉదార పద్ధతులతో సాధించుకుంటారు. ప్రజా సౌకర్యాల కల్పన ద్వారా మరికొన్ని ప్రశంసలు అందుకుంటారు. వారి ఉదార గుణశీలతను వ్యాప్తి చేసే యంత్రాంగం నెలకొల్పుకుంటారు. విశ్లేషకులు కొందరు తమ తమ అభీష్టాలను బట్టి ఒకటో, కొన్నో సుగుణాల్ని చూపి, నూరు దోషాలను విడిచిపెడతారు.

వ్యాసకర్త అధ్యక్షుడు, జనసాహితి
మొబైల్: 94401 67891

క్షణభంగురం

ఒక అందమైన, ఆహ్లాదకరమైన ప్రకృతి చిత్రాన్ని ఆసరాగా చేసుకొని మానవ జీవితానికి సంబంధించిన ఒక గంభీరమైన వేదాంత సత్యాన్ని చెబితే, చదివిన పాఠకుని మనసును అది ఎంతో సౌమ్యంగా ఆకట్టుకుంటుంది. ఈ భూమి మీద నివసించే ప్రాణికోటిలో ఏ ఒక్క ప్రాణి జీవితమూ శాశ్వతమైనది కాదన్న సత్యం అందరూ ఎరిగినదే. బతుకు చంచలత్వానికి సంబంధించిన ఈ నిజాన్ని జక్కరాజు వెంకటకవి తాను రచించిన ‘ఆంధ్ర కామందకము’ కావ్యంలో ‘తొలకెడి జలముల లోపలి/కలువల చెలికాని నీడగతి సకలప్రా/ణుల బ్రతుకు చంచలంబని/తలచి విభుడు మంచిపనులె తా



జేయదగున్’ (ద్వితీయాశ్వాసం, 38 కంద పద్యం) అనే పద్యంలో వర్ణించిన ఒక అందమైన ప్రకృతి చిత్రంలో పొందుపరిచి చెప్పాడు. ఆ ప్రకృతి చిత్రం ఇది:

అది ఒక పౌర్ణమి నాటి రాత్రి. నిండు చంద్రుడు పండు వెన్నెలను కురిపిస్తున్నాడు. ఆ వెన్నెల చల్లదనంలో ప్రకృతి పులకించిపోతూవుంది. విరబూసిన కలువలతో నిండి ఉన్న ఒక కొలను అందులో భాగమై ఉంది. నిశ్చలంగా ఉన్న ఆ కొలనులోని నీరు, ఎక్కడి నుంచో మృదువుగా వీస్తూ వచ్చిన గాలి తెరలకు అంతే మెత్తగా అలలుగా కదలసాగింది. అలా కదులుతున్న కొలను నీటి అలలలో, అప్పటి దాకా నిశ్చలంగా ఉన్న చందమామ ప్రతిబింబం కూడా ఎవరో కదిలించినట్లుగా కదలసాగింది. అలా సన్నగా వీచిన ఒక గాలి తెరకే కదిలిపోయిన కొలను నీటిలోని చందమామ నీడతో, ప్రపంచంలోని సకల ప్రాణుల మనుగడలోని క్షణికత్వాన్నీ పోల్చి చెప్పి, ఏ మనిషి బతుకైనా సరే ఇక్కడ శాశ్వతం కాదు. కనుక బతికున్న రోజులలో సాధ్యమైనన్ని మంచి పనులను చెయ్యాలని చెప్పడం ఇందులో ముఖ్యోద్దేశం. అందరూ గుర్తించి ఆచరించవలసిన అంశం.

– వెంకట్ భట్టు

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో గోవా గవర్నర్



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న గోవా గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్లై

తిరుమల: తిరుమల శ్రీవారిని గోవా రాష్ట్ర గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్లై సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఎల్ఐసీ క్లెయిమ్‌ల పరిష్కారంలో ప్రత్యేక సడలింపులు

- రైళ్ల ప్రమాద మృతుల కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం

మచిలీపట్నం టౌన్: ఒడిశాలో జరిగిన రైళ్ల ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు క్లెయిమ్‌ల పరిష్కారంలో ప్రత్యేక సడలింపులు చేసినట్లు ఎల్ఐసీ కృష్ణాజిల్లా మచిలీపట్నం సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి గానూ ఎల్ఐసీ చైర్‌పర్సన్ సిద్ధార్థ మోహతి నిర్ణయం తీసుకున్నారన్నారు. మృతుల మరణ ధ్రువీకరణ పత్రాలకు బదులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు ప్రకటించిన జాబితాను అంగీకరిస్తారన్నారు. సాధారణ బీమా పాలసీలు, ప్రధాన మంత్రి జీవనజ్యోతి, బీమా యోజన పాలసీలకు సంబంధించి సత్వర సహాయం అందుతుందని తెలిపారు. డివిజనల్ కార్యాలయంతో పాటు బ్రాంచ్ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్కలను ఏర్పాటు చేశామన్నారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన వారు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఎల్ఐసీ కాల్ సెంటర్ నంబర్ 022-68276827లో సమాచారం తెలుసుకోవచ్చునన్నారు.

జమ్మూలో శాస్త్రోక్తంగా పంచగవ్యాదివాసం



స్వామి, అమ్మవారి విగ్రహాలకు పంచగవ్యాధివాసం చేపడుతున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: జమ్మూలోని మజీన్ గ్రామంలో తావి నది ఒడ్డున టీటీడీ నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ మహా సంప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం శాస్త్రోక్తంగా పంచగవ్యాదివాసం నిర్వహించారు. వైదిక కార్యక్రమాల్లో భాగంగా బింబశుద్ధి కోసం పంచగవ్యాదివాసం చేపట్టారు. ముడిశిలను శిల్పులు చాకచక్యంగా స్వామి, అమ్మవార్ల విగ్రహాలుగా మలుస్తారు. ఈ క్రమంలో సుత్తి, ఉలి దెబ్బలకు వేదనకు గురయ్యే విగ్రహాలకు ఉపశమనం కల్పించడం కోసం పంచగవ్యాలైన పాలు, పెరుగు, నెయ్యి, గోమయం, గోమూత్రంతో అభిషేకం చేశారు. ముందుగా అక్షిణ్యోచనం, నవకలశ స్నపనం నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకుల్లో ఒకరైన వేణుగోపాలదీక్షితులు, డిప్యూటీ ఈవోలు గుణభూషణ్‌రెడ్డి, శివప్రసాద్, ఈఈ సుధాకర్ పాల్గొన్నారు.

‘నైరుతి’ దోబూచులాట!

రాష్ట్రంలో మరో 10 రోజులు ఉష్ణతాపం



సాక్షి, విశాఖపట్నం/అమరావతి: నైరుతి రుతుపవనాలు ఊరిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాలను తలకిందులు చేస్తున్నాయి. ఏటా సాధారణంగా జూన్ 1వ తేదీకల్లా నైరుతి రుతుపవనాలు కేరళలో ప్రవేశిస్తాయి. అయితే.. ఈ ఏడాది ఒకింత ఆలస్యంగా జూన్ 4 నాటికి కేరళను తాకుతాయని ఐఎండీ తొలుత అంచనా వేసింది. కానీ 'నైరుతి' కేరళను తాకకుండా దోబూచులాడుతూనే ఉంది. వాస్తవానికి రుతుపవనాలు అండమాన్ సముద్రం, దక్షిణ బంగాళాఖాతంలోకి మే 20–22 మధ్య ప్రవేశిస్తాయి. అనంతరం నాలుగైదు రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతంలతో పాటు పరిసర ప్రాంతాలకు విస్తరిస్తాయి. అక్కడ నుంచి జూన్ 1వ తేదీకి కేరళను తాకుతాయి. కానీ.. ఈ ఏడాది అండమాన్ సముద్రంలోకి సకాలంలో అంటే మే 20 నాటికే ప్రవేశించాయి. కానీ.. అప్పటినుంచి వాటి విస్తరణలో మాత్రం మందగమనం చోటుచేసుకుంటోంది. ఫలితంగా రుతుపవనాలు కేరళలో ప్రవేశించడానికి జాప్యం జరుగుతోంది. దీంతో ఐఎండీ ముందుగా ఊహించినట్టుగా జూన్ 4వ తేదీ కంటే మరో నాలుగైదు రోజులు ఆలస్యంగా కేరళను తాకనున్నాయి. అంటే సాధారణం కంటే వారం రోజుల ఆలస్యంగా ఇవి కేరళలోకి ప్రవేశించనున్నాయి.

ఆలస్యం ఎందుకంటే..!

నైరుతి రుతుపవనాల ఆగమనంలో జాప్యానికి గత నెలలో సంభవించిన 'మోచా' తుపాను, ఉత్తరాదిన ఏర్పడిన పశ్చిమ ఆటంకాలు (వెస్టర్న్ డిస్టర్బెన్స్) ప్రధాన కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గత నెల 9న బంగాళాఖాతంలో ఏర్పడిన మోచా తుపాను ఆ తర్వాత అత్యంత తీవ్ర తుపానుగా మారి 15న బంగ్లాదేశ్, మయన్మార్‌ల మధ్య తీరాన్ని దాటింది. దీంతో ఈ తుపాను బంగాళాఖాతంలోని తేమను మయన్మార్ వైపు లాక్కెళ్లిపోయింది. మరోవైపు కొద్దిరోజుల నుంచి ఉత్తరాదిన వెస్టర్న్ డిస్టర్బెన్స్‌లు చురుగ్గా ప్రభావం చూపిస్తున్నాయి. ఇవి దిగువన బంగాళాఖాతంపై ఉన్న తూర్పు గాలులను బలహీనపరిచాయి. ఫలితంగా అండమాన్ సముద్రంలో కొనసాగుతున్న నైరుతి రుతుపవనాలు వేగంగా ముందుకు విస్తరించడకుండా వెస్టర్న్ డిస్టర్బెన్స్ అడ్డుపడుతున్నాయి. ఈ కారణాల వల్ల నైరుతి రుతుపవనాలు సకాలంలో కేరళలోకి ప్రవేశించకుండా జాప్యానికి కారణమయ్యాయని వాతావరణ శాఖ మాజీ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ 'సాక్షి'తో చెప్పారు.

కొన్నాళ్లు ఎండలు.. వానలు!

రుతుపవనాల రాక ఆలస్యం కానుండటంతో రాష్ట్రంలో ఉష్ణతాపం మరికొన్నాళ్లు కొనసాగనుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల ప్రవేశానికి మరో 10 రోజులు పట్టవచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. అప్పటివరకు పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 2–4 డిగ్రీలు అధికంగా నమోదవుతాయి. అప్పుడప్పుడూ వడగాడ్పులకు ఆస్కారం ఉంది. అదే సమయంలో మధ్యమధ్యలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయి. రుతుపవనాల ఆగమనానికి ముందు ఇలాంటి పరిస్థితి ఉంటుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. 10 రోజులు ఎండల తీవ్రతతో పాటు వర్షాలు కూడా కురవనున్నాయని చెబుతున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ఇదే పరిస్థితి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

మండిన ఎండలు.. నేడు వడగాడ్పులు

సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత కొనసాగింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా 43.3 డిగ్రీలు, ఏలూరు జిల్లా శ్రీరామవరంలో 43.1, తిరుపతి జిల్లా గొల్లగుంటలో 42.9, కృష్ణా జిల్లా కాజలో 42.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 21 మండలాల్లో వడగాడ్పులు వీచినట్టు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. మంగళవారం అల్లూరి జిల్లా నెల్లిపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, ఏలూరు జిల్లా కుకునూరు, వేలేరుపాడు మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 212 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. అలాగే మంగళవారం అల్లూరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. విశాఖపట్నం, అనకాపల్లి, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 39 నుంచి 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం వెల్లడించారు.

ఈతకు వెళ్లి నలుగురి మృతి

- కృష్ణానదిలో మునిగి ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు
- మృతులు కర్నూలుకు చెందిన అన్నదమ్ముల పిల్లలు
- తెలంగాణలోని పల్లెపాడు వద్ద ఘటన



రేహాన్



నాషిన్



సమీర్



అఫ్రీన్

కర్నూలు: కర్నూలు శివారులోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన అన్నదమ్ముల పిల్లలు నలుగురు కృష్ణానదిలో ఈతకు దిగి ప్రాణాలు కోల్పోయారు. వేసవి సెలవుల నేపథ్యంలో తెలంగాణలోని బోరెల్లి గ్రామంలో మేనత్త ఇంటికి వెళ్లినవారు కృష్ణానదిలో మునిగి మృత్యువాతపడ్డారు. కర్నూలుకు చెందిన ఇస్మాయిల్, ఇబ్రహీం అన్నదమ్ములు. ఇద్దరూ ఆటో తోలుతూ జీవనం సాగిస్తున్నారు. ఇస్మాయిల్, ఫరీదా దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు, ఇబ్రహీం, మెహరూన్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు సంతానం. స్కూల్‌కు సెలవులు కావడంతో నాలుగు రోజుల కిందట తెలంగాణలోని గద్వాల జిల్లా మానవపాడు మండలం బోరెల్లి గ్రామంలో ఉన్న మేనత్త జమీలాబీ ఇంటికి వెళ్లారు. సోమవారం వీరు పదిమంది స్నేహితులతో కలిసి ఆటోలో పల్లెపాడు శివారులో ఉన్న కృష్ణానదికి ఈతకు వెళ్లారు. అక్కడ ఈతకు దిగిన సమీర్ (17), రేహాన్ (15), అఫ్రీన్ (16), నాషిన్ (13) నీటిలో మునిగిపోయారు. స్నేహితుల కేకలతో వచ్చిన మత్స్యకారులు వారిని బయటకు తీసే ప్రయత్నం చేశారు. స్థానికులు కోదండాపురం పోలీసులకు సమాచారం అందించడంతో వారు వెంటనే అక్కడికి చేరుకుని చేపల వలల సహాయంతో నీటిలో ఉన్న మృతదేహాలను బయటకు తీశారు. గద్వాల ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేసి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. కోదండాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు నుంచి కుటుంబసభ్యులు గద్వాల ప్రభుత్వాస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతుల్లో సమీర్, రేహాన్.. ఇస్మాయిల్ కొడుకులు. అఫ్రీన్, నాషిన్.. ఇబ్రహీం కుమార్తెలు. అన్నదమ్ముల పిల్లలు నలుగురు మృతిచెందడంతో వీకర్ సెక్షన్ కాలనీలో విషాదం అలముకుంది.

అంతర్జాతీయ గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

- శ్రీలంకకు తరలిస్తుండగా పట్టుకున్న సూళ్లూరుపేట పోలీసులు
- సూళ్లూరుపేటలో 8 మంది, కావలిలో ఇద్దరు అరెస్ట్



పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైమ్ /కావలి రూరల్: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల నుంచి కావలి, బెంగళూరు, శ్రీలంకకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న జాతీయ, అంతర్జాతీయ గంజాయి స్మగ్లింగ్ ముఠాలను సూళ్లూరుపేట, కావలి పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపతి,ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ సోమవారం తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట హోలీ క్రాస్ సర్కిల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నెల్లూరు వైపు నుంచి చెన్నై వైపు వెళ్తున్న ఓ వాహనంలో 120 ప్యాకెట్లలో ఉన్న 250 కేజీల గంజాయిని గుర్తించి ముఠాను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారంతా తమిళనాడుకు చెందిన ఆనంద్ వేలు, బాలకిషన్, తిరుమల, రఘునందన్, వరదరాజన్, అనకాపల్లికి చెందిన దువనబోయిన లవ్‌రాజ్, కాకర్ల వెంకటరమణ, బియ్యాల రవిగా గుర్తించారు. ఇందులో ప్రధాన ముద్దాయిలైన అనకాపల్లికి చెందిన అప్పలనాయుడు, శ్రీలంక దేశానికి చెందిన ఖాదర్‌భాయ్ ఇద్దరూ పరారీలో ఉన్నారు.అప్పలనాయుడు మీద అనకాపల్లిలో పీడీయాక్ట్ నమోదయ్యింది. ప్రధాన నిందితుడు శ్రీలంక దేశానికి చెందిన ఖాదర్‌భాయ్‌ను పట్టుకునేందుకు సీఐడీ డిపార్ట్‌మెంట్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు, లుక్ అవుట్ నోటీసులను ఇచ్చారు.

గంజాయికి బదులు బంగారం..

అనకాపల్లిలోని అప్పలనాయుడు వద్ద నుంచి గంజాయిని ఆనంద్ వేలు కొనుగోలు చేసేవాడు. అక్కడి నుంచి తమిళనాడు మీదుగా శ్రీలంక దేశానికి చెందిన ఖాదర్‌భాయ్‌కి చిన్న చిన్న పడవల ద్వారా ఎగుమతి చేసేవారు. వీరు లావాదేవీలను గంజాయికి బదులుగా బంగారాన్ని ఇస్తూ చెల్లింపు చేసుకునే వారు.

కావలి సమీపంలో..

ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల నుంచి కావలి, బెంగళూరుకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న బెంగళూరుకు చెందిన సంజయ్ రమేష్, అల్లూరు సీతారామరాజు జిల్లా దుంబ్రీగూడ మండలం దొరగూడ గ్రామానికి చెందిన గడ్డంగి రామ్‌లాల్‌ను ముసునూరు వద్ద జాతీయ రహదారిపై అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల విలువ కలిగిన 11 కేజీల గంజాయిని ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా కావలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కావలికి చెందిన ప్రళయకావేరి జ్ఞానయ్య పరారీలో ఉన్నాడు.

రూ.7.19 కోట్ల విలువైన ఏనుగు దంతాలు పట్టివేత

- చెన్నైలో 4.03 కేజీల బరువైన దంతాలు స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ
- ఏడుగురు నిందితుల అరెస్టు
- కొత్త వన్యప్రాణుల రక్షణ చట్టం కింద తొలి కేసు నమోదు



అధికారులు సీజ్ చేసిన ఏనుగు దంతాలు

సాక్షి, చెన్నై: చెన్నైలో ఏనుగు దంతాలను అక్రమంగా విక్రయించే ప్రయత్నం చేసిన వారిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ)– చెన్నై అధికారులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.7.19 కోట్ల విలువైన 4.03 కేజీల బరువు కలిగిన రెండు దంతాలను సీజ్ చేశారు. వన్య ప్రాణుల రక్షణ చట్టం వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ చట్టం 2023 కింద తొలి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... డీఆర్ఐ–చెన్నై అధికారులకు అందిన రహస్య సమాచారం మేరకు సెంట్రల్, టీ నగర్ పరిసరాల్లో ప్రత్యేక నిఘా బృందాలు కాపు కాశాయి. ఏనుగు దంతాలను టీ నగర్‌లో ఓ చోట విక్రయించే ప్రయత్నం చేసిన ఏడుగురిని డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకున్నారు. ఓ వాహనం కూడా సీజ్ చేశారు. 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిన వన్యప్రాణుల రక్షణ చట్టం తాజా సవరణ మేరకు.. నిషేధ వస్తువులను సీజ్ చేసే అధికారం కస్టమ్స్ అధికారులకు సైతం కల్పించారు. దీంతో ఈ చట్టం కింద చెన్నై డీఆర్ఐ అధికారులు తొలి కేసును నమోదు చేశారు. పట్టుబడ్డ ఏడుగురిని, ఏనుగు దంతాలు, వాహనాన్ని తమిళనాడు చీఫ్ వైల్డ్ లైఫ్ అధికారులకు అప్పగించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన కూలీకి పరిహారం చెల్లించాల్సిందే

- అతనికి బీమా ప్రీమియం చెల్లించలేదంటే కుదరదు
- ముందు పరిహారం చెల్లించి.. ట్రాక్టర్ యజమాని నుంచి రాబట్టుకోండి
- బీమా కంపెనీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ట్రాక్టర్ ట్రాలీలో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ మరణించిన ఒక కూలీకి నష్టపరిహారం చెల్లించేందుకు బీమా సంస్థ నిరాకరించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఆ కూలీకి బీమా ప్రీమియం చెల్లించలేదని, అతడు ఆ ట్రాక్టర్‌లో అనధికారికంగా ప్రయాణిస్తున్నందున అతనికి బీమా పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదన్న బీమా సంస్థ వాదనను తోసిపుచ్చింది. ప్రమాదం జరిగిన రోజుకు ట్రాక్టర్, ట్రాలీకి బీమా ఉందన్న హైకోర్టు.. మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించాల్సిందేనని బీమా సంస్థను ఆదేశించింది. రూ.4.68 లక్షల పరిహారాన్ని 6 శాతం వడ్డీతో రెండునెలల్లో చెల్లించాలని నిర్దేశించింది. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని రుజువైన నేపథ్యంలో ముందు మృతుడి కుటుంబానికి బీమా చెల్లించాలని, ఆ తరువాత ఆ మొత్తాన్ని ట్రాక్టర్ యజమాని నుంచి రికవరీ చేసుకోవాలని బీమా కంపెనీకి హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో మోటారు వాహన ప్రమాదాల ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు సమర్థించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెణుతురుమిల్లి గోపాలకృష్ణ ఇటీవల తీర్పు చెప్పారు. 2011 ఫిబ్రవరి 3న ఎండుగడ్డి తీసుకుని వైఎస్సార్ కడప జిల్లా పూతచిన్నాయపల్లె గ్రామంలో దించేందుకు కూలీలతో వెళుతున్న ట్రాక్టర్ కొప్పోలు క్రాస్‌రోడ్ వద్ద ప్రమాదానికి గురైంది. డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ట్రాక్టర్ ట్రాలీతో సహా బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కూలీ డి.చిన్నసుబ్బారాయుడు మరణించారు. తమకు రూ.10 లక్షల పరిహారం ఇప్పించాలని కోరుతూ మృతుడి భార్య, పిల్లలు కడప మోటారు వాహన ప్రమాదాల ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేశారు. ఆ ట్రాక్టర్‌లో సుబ్బారాయుడు అనధికారికంగా ప్రయాణించాడని, అందువల్ల బీమా సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదని న్యూ ఇండియా అస్యూరెన్స్ బీమా కంపెనీ కౌంటర్ దాఖలు చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ట్రిబ్యునల్ మృతుడి కుటుంబానికి రూ.4.68 లక్షల పరిహారం ఇవ్వాలంటూ 2012లో తీర్పునిచ్చింది. ట్రిబ్యునల్ తీర్పును సవాలు చేస్తూ బీమా కంపెనీ 2013లో హైకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణ ఇటీవల తుది విచారణ జరిపారు. బీమా కంపెనీ వాదనలను తోసిపుచ్చారు. రూ.4.68 లక్షల పరిహారాన్ని 6 శాతం వడ్డీతో మృతుడి కుటుంబానికి చెల్లించాలని ఆ కంపెనీని ఆదేశించారు.

పేద మహిళకు ఇంటి పట్టా



పీతల పార్వతికి ఇంటి స్థలం పట్టా అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): విజయవాడలోని రైవస్ కాలువ గట్టుపై ముగ్గురు మనుమరాళ్లతో కలిసి నివాసం ఉంటున్న పేద మహిళ పీతల పార్వతికి కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సోమవారం ఇంటి పట్టా అందజేశారు. పార్వతి భర్త మరణించగా.. ఆ తర్వాత కొంతకాలానికి కుమార్తె, అల్లుడు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. దీంతో పార్వతి తన ముగ్గురు మనుమరాళ్ల సంరక్షణ చూసుకుంటూ రోడ్డు పక్కనే నివాసం ఉంటోంది. పార్వతి కష్టాలను గమనించిన మానవ హక్కుల కమిషన్ ఆమెను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఇలాంటి నిరుపేదలకు సహాయం చేసే విషయంలో వేగంగా స్పందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. దీంతో కలెక్టర్ ఢిల్లీరావు పార్వతి మనువరాళ్లు కట్టా లావణ్య, రాధ, భవానిలకు ఆధార్ కార్డులు జారీ చేసి ఆ ముగ్గురినీ పెనుమాక సమీపంలోని చిగురు పాఠశాలలో చేర్పించారు. ముగ్గురు పిల్లలకు అమ్మ ఒడి పథకం ద్వారా ఆర్థిక సాయం అందించారు. వెంటనే దళిత (రెల్లి) కులానికి చెందిన పార్వతికి కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసి.. రేషన్ కార్డు కూడా మంజూరు చేశారు. చేయూత పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న రూ.18,500లను ఆమె బ్యాంకు ఖాతాలో జమ చేశారు. చివరకు ఆమెకు రాజధాని అమరావతి ప్రాంతంలోని నిడమర్రులో ఇంటి స్థలం కేటాయించి ఇంటిపట్టా కూడా అందజేశారు. ఈ సందర్భంగా పార్వతి స్పందిస్తూ మానవ హక్కుల కమిషన్, కలెక్టర్ ఢిల్లీ రావు, జిల్లా యంత్రాంగం చొరవతోనే తమకు ప్రభుత్వ సేవలు ఇంతవేగంగా అందాయని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, చైల్డ్‌లైన్ జిల్లా కో–ఆర్డినేటర్ అరవ రమేష్, నార్త్ తహసీల్దార్ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మార్గదర్శి కేసులు ఏపీ హైకోర్టుకు బదిలీ చేయండి

- సుప్రీం కోర్టును కోరిన ఏపీ ప్రభుత్వం
- ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ : మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధుల దారి మళ్లింపు కేసులకు సంబంధించి తెలంగాణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ రాజేష్ బిందాల్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, అభిషేక్ మను సింఘ్వి, సిద్ధార్థ లూథ్రాలు వాదనలు వినిపిస్తూ.. సీఆర్‌పీసీ సెక్షన్ 406 కింద దాఖలు చేసిన ఈ పిటిషన్ చెల్లదని తెలిపారు. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ స్పందిస్తూ.. తాము సీఆర్‌పీసీ సెక్షన్ 406 రెడ్ విత్ 139 ఏ కింద పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. ఆర్టికల్ 139 ఏ కింద ఒక హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను మరో హైకోర్టుకు బదిలీ చేసే అధికారం సుప్రీం కోర్టుకు ఉందని వివరించారు. ఈ అంశంపై ఎగ్జామిన్ చేస్తామన్న ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణ జులై 18కి వాయిదా వేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై స్టే ఇతరత్రా అంశాలను తదుపరి విచారణలో పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది.

ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

- సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణం



కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు మృతదేహం



వెంకటేశ్వర్లు (ఫైల్ ఫొటో)

ఒంగోలు టౌన్: స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) కానిస్టేబుల్ సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఒంగోలులో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన మర్రిపూడి వెంకటేశ్వర్లు (35) ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఒంగోలు రాజా పానగల్ రోడ్‌లోని యూబీఐ కరెన్సీ చెస్ట్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు సోమవారం విధులకు హాజరయ్యాడు. సుమారు 2.30 సమయంలో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లుకు ఏడేళ్ల క్రితం పెళ్లయింది. ఆమె ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్ద మనుషుల ద్వారా రాజీ చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. మనస్తాపానికి గురైన వెంకటేశ్వర్లు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ఆయన తండ్రి పోలేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్థిక కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్టుగా కూడా ప్రచారం జరుగుతోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి వన్‌టౌన్ ఎస్ఐ కృష్ణయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు గతంలోనూ రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది.

మహిళా చిరుద్యోగి 20 ఏళ్ల న్యాయ పోరాటం

ట్రిబ్యునల్‌కు వెళ్లి సర్వీసు క్రమబద్ధీకరణ సాధించుకున్న పుల్లమ్మ

- ఇప్పుడు ఆర్థిక ప్రయోజనాల విషయంలో హైకోర్టులో విజయం
- అధికారుల తీరును తప్పుపట్టిన న్యాయస్థానం

సాక్షి, అమరావతి: తన సర్వీసు క్రమబద్ధీకరణ, జీతభత్యాల విషయంలో 20 ఏళ్ల క్రితం మొదలుపెట్టిన న్యాయ పోరాటంలో ఓ మహిళా చిరుద్యోగి చివరకు విజయం సాధించారు. అధికారుల తీరును తప్పుపడుతూ హైకోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. ఆర్థిక శాఖ అనుమతినిచ్చిన నాటి నుంచే (2009) ఆ మహిళా ఉద్యోగి నోషనల్ పే పొందేందుకు అర్హురాలన్న అధికారుల వాదనను తోసిపుచ్చింది. ఆమె తన సర్వీసు క్రమబద్ధీకరణ నాటి నుంచే (1993) నోషనల్ పేకు అర్హురాలని స్పష్టం చేసింది. అలాగే నోషనల్ పే బకాయిలకు సైతం ఆమె అర్హురాలేనని తేల్చిచెప్పింది. ఆమెకు అనుకూలంగా ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీ చేసిందని.. అయితే అధికారుల లోపం, నిర్లక్ష్యం వల్లే ఆర్థిక శాఖ నుంచి అనుమతి రావడంలో తీవ్ర జాప్యం జరిగిందని హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. అధికారులు చేసిన తప్పులకు ఆ మహిళా ఉద్యోగికి చట్టప్రకారం దక్కాల్సిన ప్రయోజనాలను అడ్డుకోలేమని కుండబద్దలు కొట్టింది. ఆ మహిళకు అనుకూలంగా ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులు చట్టప్రకారమే ఉన్నాయని, అందులో ఏ రకంగానూ జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. ట్రిబ్యునల్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. అంతేకాక రూ.10 వేలను ఆమెకు ఖర్చుల కింద చెల్లించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ వెణుతురుమిల్లి గోపాలకృష్ణారావు ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.

జీతం చెల్లించకపోవడంతో న్యాయ పోరాటం..

వైఎస్సార్ జిల్లా రాజంపేటకు చెందిన జి.పుల్లమ్మ 1986లో తాత్కాలిక ప్రాతిపదికన కడప చిల్డ్రన్ హోం సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయాగా చేరారు. 1994లో ప్రభుత్వం జీవో 212 జారీ చేసింది. దీని ప్రకారం.. 1993కు ముందు తాత్కాలిక పద్ధతిలో నియమితులైన వారందరి పోస్టులను క్రమబద్ధీకరించాలని ఆదేశాలిచ్చింది. దీంతో పుల్లమ్మ సర్వీసును కూడా 1993 నుంచి క్రమబద్ధీకరిస్తున్నట్లు పేర్కొంటూ 1994లో ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆమెను రైల్వేకోడూరు చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కార్యాలయంలో అటెండర్‌గా నియమించారు. అయితే 2001 జూన్ నుంచి ఆమెకు జీతం చెల్లించడం నిలిపేశారు. దీంతో పుల్లమ్మ జీతం కోసం ఏపీ పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్ పుల్లమ్మకు జీతం చెల్లించాలంటూ 2003లో అధికారులను ఆదేశించింది. అయితే అధికారులు జీతం చెల్లించలేదు. అంతేకాకుండా ఆర్థిక శాఖ అనుమతి తీసుకోకుండా ఆమె ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించారని పేర్కొంటూ ఆ ఉత్తర్వులను రద్దు చేశారు. దీన్ని పుల్లమ్మ 2004లో మరోసారి ట్రిబ్యునల్‌లో సవాల్ చేశారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్.. సర్వీసు క్రమబద్ధీకరణ విషయంలో ఆమె పెట్టుకున్న దరఖాస్తుపై తగిన నిర్ణయం వెలువరించాలని 2006లో అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు ఆమె సర్వీసు క్రమబద్ధీకరణ విషయాన్ని పక్కన పెట్టి, జీతాన్ని రూ.3,850గా సవరించి.. 2005 నుంచి బకాయిలు చెల్లిస్తున్నట్టు పేర్కొంటూ ఉత్తర్వులిచ్చారు. అయితే అధికారులు తన ఉద్యోగం క్రమబద్ధీకరణ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పులమ్మ 2006లోనే ట్రిబ్యునల్‌లో మరో పిటిషన్ వేశారు. దీంతో అధికారులు ఆమె జీతాన్ని 2003 నుంచి చెల్లిస్తామని పేర్కొన్నారు. అయితే తాను 1993లో నియమితులయ్యానని, అప్పటి నుంచి సవరించిన జీతాన్ని చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పుల్లమ్మ 2007లో మరోసారి ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్ ఆమె సర్వీసును క్రమబద్ధీకరించాలంటూ ఆదేశాలిచ్చింది. అయినా కూడా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆమె కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ట్రిబ్యునల్ నోటీసులు జారీ చేయడంతో దిగొచ్చిన అధికారులు ఆమె సర్వీసును క్రమబద్ధీకరిస్తూ 2009లో జీవో జారీ చేశారు. దీంతో ఆమె 2010లో సేవిక పోస్టులో నియమితులయ్యారు. అయితే ఆమెకు చెల్లించాల్సిన ఇతర ప్రయోజనాల విషయంలో అధికారులు స్పందించలేదు. దీంతో ఆమె 1994 నుంచి తనకు రావాల్సిన ప్రయోజనాలన్నింటినీ చెల్లించేలా అధికారులను ఆదేశించాలంటూ 2010లో ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్ 1993 నుంచే పుల్లమ్మ సర్వీసును క్రమబద్ధీకరిస్తున్నట్లు పేర్కొంది. తమ ఆదేశాలకు అనుగుణంగా చెల్లింపులను సవరించాలని అధికారులను ఆదేశించింది. ట్రిబ్యునల్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ అధికారులు హైకోర్టులో 2013లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల వాదనలు విన్న ధర్మాసనం అధికారులు పుల్లమ్మ సర్వీసు క్రమబద్ధీకరణ, జీతం చెల్లింపు విషయంలో ఆమెను ఇబ్బంది పెట్టారని వ్యాఖ్యానించింది. ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వుల్లో ఎలాంటి తప్పులేదంటూ అధికారుల పిటిషన్‌ను కొట్టేసింది.



క్లుప్తంగా...

గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీకి జీవిత ఖైదు

1991 నాటి హత్యకేసులో శిక్ష ప్రకటించిన వారణాసి కోర్టు



లక్నో: ముప్పై ఏళ్ల క్రితం నాటి కాంగ్రెస్ నేత సోదరుడి హత్య కేసులో గ్యాంగ్‌స్టర్-రాజకీయ నేత ముఖ్తార్ అన్సారీకి వారణాసి కోర్టు జీవిత ఖైదు విధించింది. 1991 ఆగస్టు 3వ తేదీన కాంగ్రెస్ నేత అజయ్ రాయ్ సోదరుడు అవధేశ్ రాయ్ వారణాసిలోని ఆయన ఇంటిగేటు వద్దే హత్యకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి అన్సారీతోపాటు పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అవధేశ్ రాయ్ హత్య కేసును విచారించిన ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు ప్రత్యేక జడ్జి అవనీశ్ గౌతమ్ అన్సారీకి జీవిత ఖైదుతోపాటు రూ.1.20 లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు లాయర్ ఒకరు చెప్పారు. బందా జైలులో ఉన్న అన్సారీ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణకు హాజరయ్యారు. వేర్వేరు రాష్ట్రాల్లో 61కి పైగా క్రిమినల్ కేసులను అన్సారీ ఎదుర్కొంటున్నాడు. ఇప్పటివరకు ఆరు కేసుల్లో దోషిగా తేలింది. ఒక కేసుకు సంబంధించి ఏప్రిల్‌లో ఘాజీపూర్ కోర్టు అన్సారీకి 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. యూపీలోని మౌసదర్ స్థానం నుంచి అయిదు పర్యాయాలు అన్సారీ ఎమ్మెల్యే అయ్యాడు. 2022 ఎన్నికల్లో ఆయన కొడుకు అబ్బాస్ అన్సారీ సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు.

మేజిక్ షోలు చేసైనా సంపాదిస్తా

రాజస్తాన్ సీఎం గెహ్లోత్



జోథ్‌పూర్: రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ తనను తాను ప్రజల ప్రథమ సేవకుడిగా అభివర్ణించుకున్నారు. డబ్బు అవసరమైతే మేజిక్ షోలు చేసైనా సంపాదిస్తాను కానీ, జోథ్‌పూర్ ప్రజలను మాత్రం నిర్లక్ష్యం చేయనని చెప్పారు. నగరంలోని మెహ్రాన్‌గఢ్ సందర్శనకు వచ్చే పర్యాటకుల కోసం కొత్తగా నిర్మించిన 'రావ్ జోధా మార్గ్' రోడ్డును ఆయన సోమవారం ప్రారంభించారు. 42 ఏళ్ల క్రితం తాను తొలిసారి జోథ్‌పూర్ ఎంపీగా గెలిచినప్పుడు ఇక్కడ ఏ సౌకర్యాలు లేవని, ఇప్పుడు మాత్రం అన్నీ సమకూరాయని చెప్పారు. గెహ్లోత్‌ది జోథ్‌పూర్‌కు చెందిన మెజీషియన్ల కుటుంబం. ఆయన వ్యాఖ్యలను బీజేపీ ఎద్దేవా చేసింది. కేంద్రం పథకాలను తనవిగా చెప్పుకుంటూ ట్రిక్కులు ప్రదర్శిస్తున్నారని ఆరోపించింది.

చదువుల్లేక, ఉద్యోగాల్లేక.. ఉరికొయ్యాలే దిక్కై!

"నాకు జీవితంపై ఇక ఎలాంటి ఆశలు లేవు. మమ్మల్ని చదువుకోనివ్వడం లేదు. స్వేచ్ఛగా బతికే అవకాశం లేదు. కుంగుబాటు, ఆందోళన నన్ను వేధిస్తున్నాయి. ఈ జీవితాన్ని ముగించాలన్న ఆలోచనలు తరచుగా వస్తున్నాయి. ఈ బాధలు భరించలేను. నా ఆవేదన ఎవరైనా వింటే బాగుండు. ఇది కేవలం నా ఒక్కరి దుస్థితి కాదు. నాతోపాటు యూనివర్సిటీలో చదువుకున్న యువతులంతా ఇలాగే మదన పడుతున్నారు. ఆత్మహత్య ఆలోచనలతో నిత్యం సతమతం అవుతున్నారు. బతకలేక చావలేక కుమిలిపోతున్నారు"

- అఫ్గానిస్తాన్‌లో 20 ఏళ్లకుపైగా వయసున్న ఓ యువతి కన్నీటి గాథ ఇది.

"మహిళా కళాశాలలను తాలిబన్లు మూసేశారు. దాంతో నా ఉద్యోగం పోయింది. ఎక్కడా ఉపాధి దొరకలేదు. ఇంట్లో అందరినీ పోషించాల్సింది నేనే. పని దొరక్క చేతిలో చిల్లిగవ్వ లేకుండాపోయింది. నిర్భయంగా బయట తిరగలేం. ఇంట్లోనే ఉండిపోవాలి. ఎలా బతకాలో తెలియడం లేదు. అందుకే మరోదారి లేక రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశా.

-మెహర్ అనే అధ్యాపకురాలి ఆవేదన ఇది



ఈ ఏడాది మార్చి నెలలో స్కూల్ పునఃప్రారంభం కాగా, తరగతులకు హాజరయ్యేందుకు తన కుమార్తె ఉత్సాహంగా సిద్ధమైందని, తీరా అక్కడికి వెళ్లాక రావొద్దని చెప్పడంతో తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని నాదిర్ అనే వ్యక్తి చెప్పాడు. పెద్ద చదువులు చదువుకొని, దేశానికి సేవ చేయాలని తన బిడ్డ కలలు కనేదని తెలిపాడు. తాలిబన్ పాలకులు బాలికల పాఠశాలలను మూసివేశారని వెల్లడించాడు.

అఫ్గానిస్తాన్ యువతుల్లో ఆత్మహత్య ఆలోచనలు

నానాటికీ పెరుగుతున్న మానసిక అనారోగ్య సమస్యలు

- ఇప్పటికే వందలాది మంది బలవన్మరణం
- భరించలేనంత వివక్ష, ఆంక్షలు: బాధితులు

అఫ్గానిస్తాన్‌లో 2021 ఆగస్టు నుంచి తాలిబన్ల పరిపాలన మళ్లీ మొదలైంది. అమెరికా సేనలు వెనక్కి వెళ్లిపోవడంతో తాలిబన్ ముష్కరులు అధికారంలోకి వచ్చారు. తాము పూర్తిగా మారిపోయామని, ప్రజలను కన్నబిడ్డల్లా కాపాడుకుంటామని తొలుత ప్రపంచాన్ని నమ్మించే ప్రయత్నం చేశారు. ఆచరణలో మాత్రం రాక్షస పాలనకు తెరతీశారు. మహిళలపై కఠినమైన ఆంక్షలు విధించారు. వారిపై దారుణమైన వివక్ష కొనసాగుతోంది. చదువులు లేవు, ఉద్యోగాలు లేవు. ఆర్థిక స్వేచ్ఛ అసలే లేదు. అఫ్గాన్ బాలికలకు కొన్నిచోట్ల ప్రాథమిక విద్య మాత్రమే అందుబాటులో ఉంది. అంటే ఆరో తరగతి వరకూ పాఠశాలలకు వెళ్లి చదువుకోవచ్చు. ఆ తర్వాత ఇంటికి పరిమితం కావాల్సిందే. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు నిరాకరిస్తున్నారు. కాలేజీ, యూనివర్సిటీ చదువులు యువకులకు మాత్రమే అన్నట్లుగా అనధికార శాసనం అమల్లోకి వచ్చింది. ఈ పరిణామాలన్నీ యువతుల్లో మానసిక సమస్యలను, అనారోగ్యాలను సృష్టిస్తున్నాయి. ఇప్పటికే వందలాది మంది అర్ధంతరంగా జీవితాలను చాలించినట్లు తెలుస్తోంది. సైకాలజిస్టులను సంప్రదించే బాధితుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఉత్తర అఫ్గానిస్తాన్‌లోని సంగ్‌చారక్ జిల్లాలో రెండు పాఠశాలల్లో ఇటీవలే దాదాపు 80 మంది విద్యార్థినులపై విష ప్రయోగం జరిగింది. స్కూళ్లకు రాకుండా బాలికలను భయపెట్టడానికే విద్రోహులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

రాక్షస పాలనలో నిత్య నరకం

శరీరంలోకి విషం ఎక్కించినట్లుగా..



అఫ్గాన్ యువతుల్లో ఆత్మహత్య ఆలోచనలు ఒక మహమ్మారిలా వ్యాప్తి చెందుతున్నాయని సైకాలజిస్టు డాక్టర్ అమల్ చెప్పారు. పరిస్థితి దిగజారుతోందని, ఇక్కడి వాస్తవాలు ప్రపంచానికి తెలియడం లేదని అన్నారు. ఆకలి చావులు, ఆహార సంక్షోభం గురించి మాత్రమే వార్తా పత్రికల్లో రాస్తున్నారని, మానసిక అనారోగ్య సమస్యల గురించి ఎవరూ రాయడం లేదని, మాట్లాడడం లేదని వెల్లడించారు. శరీరంలోకి నెమ్మదిగా విషం ఎక్కించినట్లుగా యువత ప్రవర్తిస్తున్నారని, జీవితంపై ఆశలు కోల్పోతున్నారని డాక్టర్ అమల్ ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీల్లో యువతులకు ప్రవేశం లేదంటూ తాలిబన్లు ప్రకటించినప్పుడు మొదటి రెండు రోజుల్లో తనకు 170 ఫోన్‌కాల్స్ వచ్చాయన్నారు. ఇప్పుడు నిత్యం దాదాపు 10 కాల్స్ వస్తున్నాయని తెలిపారు. బాధితుల్లో ఎక్కువ మంది బాలికలు, యువతులే ఉంటున్నారని వివరించారు. వారిలో ఆత్మహత్య ఆలోచనలు పోగొట్టి, స్ఫూర్తిని నింపే ప్రయత్నం చేస్తున్నానని చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించాలి

అఫ్గానిస్తాన్‌లో పితృస్వామ్య వ్యవస్థ బలంగా పాతుకుపోయింది. మహిళలపై ఆంక్షలు, వివక్ష, వేధింపులు అనేవి సహజంగా మారిపోయాయి. దేశంలో ప్రతి ఇద్దరిలో ఒకరు మానసికపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నట్లు ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. బాధితుల్లో మహిళలే గణనీయంగా ఉంటారని తెలియజేసింది. తాలిబన్ల పెత్తనం మొదలయ్యాక పరిస్థితి మరింత దిగజారిందని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. ఆంక్షలు, వివక్షకు ఆర్థిక సంక్షోభం కూడా తోడయ్యిందని, ఇవన్నీ మహిళలను ఆత్మహత్యల వైపు ప్రేరేపిస్తున్నాయని అంటున్నారు. హెరాత్ ప్రావిన్స్‌లో ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో.. కౌమార వయసులో ఉన్నవారిలో మూడింట రెండొంతుల మందిలో ఆందోళన, కుంగుబాటు లక్షణాలు ఉన్నట్లు వెల్లడయ్యింది. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సకాలంలో చికిత్స అందించకపోతే వారు ఆత్మహత్యలకు పాల్పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. దేశంలో ఆత్మహత్యల సంఖ్యను తాము రికార్డు చేయడం లేదని తాలిబన్లు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, తాలిబన్ ప్రభుత్వాన్ని ప్రపంచ దేశాలు అధికారికంగా గుర్తించాలని అఫ్గాన్ ప్రజలు కోరుతున్నారు. అలాగైతే తాలిబన్ల వైఖరిలో మార్పు వచ్చే అవకాశం ఉందని, విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, దేశం అభివృద్ధి చెందుతుందని, మహిళలపై ఆంక్షలు రద్దవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

'వాతావరణ న్యాయం' కోరుతున్నాం

సంపన్న దేశాల ఎదుట గొంతెత్తుతున్నాం: మోదీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: అభివృద్ధి చెందిన కొన్ని దేశాలు అనుసరిస్తున్న తప్పుడు విధానాలకు అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలు మూల్యం చెల్లించాల్సి వస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. 'వాతావరణ న్యాయం' కోసం అభివృద్ధి చెందిన దేశాలను డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ సోమవారం ఒక సందేశం విడుదల చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలన్నీ నడుం బిగించాలని, కలిసికట్టుగా పనిచేయాలి, ఈ విషయంలో సొంత ప్రయోజనాలు పక్కనపెట్టాలని సూచించారు. వాతావరణాన్ని చక్కగా కాపాడుకోవాలని, ప్రపంచదేశాలు దీనిపై తక్షణమే దృష్టి పెట్టాలని హితవు పలికారు. మొదట దేశాన్ని అభివృద్ధి చేసుకుందాం, ఆ తర్వాత పర్యావరణం గురించి ఆలోచిద్దామన్న ధోరణి ప్రపంచమంతటా పెరిగిపోతోందని, ఇది చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. ఇలాంటి అభివృద్ధి మోడల్‌తో విధ్వంసమే తప్ప ఆశించిన ప్రయోజనం ఉండదన్నారు. ఒకవేళ అభివృద్ధి లక్ష్యాలు సాధించినప్పటికీ దాని మూల్యం ఇతర దేశాలు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలు అమలు చేస్తున్న తప్పుడు విధానాలను ఇప్పటిదాకా ఎవరూ పెద్దగా ప్రశ్నించలేదని గుర్తుచేశారు. 'వాతావరణ న్యాయం' కోసం అభివృద్ధి చెందిన దేశాల ఎదుట భారత్ బిగ్గరగా గొంతెత్తున్నందుకు తనకు సంతోషంగా ఉందని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. బడా దేశాల స్వార్థానికి చిన్న దేశాలు ఎందుకు నష్టపోవాలని ప్రశ్నించారు. పర్యావరణ పరిరక్షణ అనేది భారతీయ సంస్కృతిలో వేలాది సంవత్సరాలుగా ఒక భాగంగా కొనసాగుతూ వస్తోందన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతున్నామని, అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. 4జీ, 5జీ కనెక్టివిటీ మాత్రమే కాదు, మరోవైపు అడవుల పెంపకం చేపడుతున్నామని తెలియజేశారు. సింగిల్-యూజ్ ప్లాస్టిక్ నిషేధం కోసం ప్రజలంతా సహకరించాలని కోరారు. గత ఐదేళ్లుగా ఈ దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. వాతావరణ మార్పుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ కోసం స్పష్టమైన రోడ్డుమ్యాప్‌తో ముందుకెళ్తున్నామని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

అమెరికాతో రక్షణ రోడ్డు మ్యాప్ ఖరారు

- రక్షణ రంగంలో పరస్పర సహకారం
- రాజ్‌నాథ్ సింగ్‌తో అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ భేటీ



ద్వైపాక్షిక భేటీ సందర్భంగా ఆస్టిన్, రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: రక్షణ రంగంలో అమెరికా, భారత్ మధ్య పరస్పర సహకారానికి రోడ్డు మ్యాప్ ఖరారైంది. ఢిల్లీలో సోమవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ సుదీర్ఘంగా చర్చించి, ఈ మేరకు రోడ్డు మ్యాప్ సిద్ధం చేశారు. రక్షణ పారిశ్రామిక రంగంతోపాటు రక్షణ ఉత్పత్తుల తయారీలో ఇకపై ఇరు దేశాలు సహకరించుకుంటాయి. ఫాస్ట్-ట్రాక్ టెక్నాలజీ ఒప్పందాలు కుదుర్చుకుంటాయి. గగనతల, భూ ఉపరితల యుద్ధానికి అవసరమైన ఆయుధాలను కలిసికట్టుగా తయారు చేసుకుంటాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో డ్రాగన్ దేశం చైనా దూకుడు పెరుగుతున్న సమయంలో భారత్, అమెరికా మధ్య ఈ రోడ్డు మ్యాప్ ఖరారు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో రెండు వారాల తర్వాత అమెరికాలో పర్యటించబోతున్నారు. రెండు దేశాల నడుమ సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఈ పర్యటన దోహదపడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా దుందుడుకు చర్యలు, ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర నేపథ్యంలో అంతర్జాతీయంగా వివిధ దేశాల సార్వభౌమత్వానికి ముప్పు పొంచి ఉందని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ చెప్పారు. రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్‌కు భారత్-అమెరికా బంధం ఒక మూలస్తంభమని అభివర్ణించారు. భారత సైన్యం ఆధునీకరణకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని పునరుద్ఘాటించారు. భారత్, అమెరికా నడుమ రక్షణ రంగంలో సహకారం విషయంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టడానికే రోడ్డు మ్యాప్ ఖరారు చేసుకున్నట్లు అమెరికా రక్షణ శాఖ కార్యాలయం 'పెంటగాన్' వెల్లడించింది. ఫైటర్ జెట్ ఇంజన్లకు అవసరమైన ఆధునిక టెక్నాలజీని భారత్‌కు అందజేయానికి జనరల్ ఎలక్ట్రిక్స్ సంస్థ ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేసింది. అలాగే 30 ఎంక్యూ-9బీ ఆర్మ్‌డ్ డ్రోన్లను అమెరికా రక్షణ రంగ సంస్థ నుంచి కొనుగోలు చేయాలని భారత్ భావిస్తోంది. ఈ రెండు అంశాల గురించి లాయిన్ ఆస్టిన్ వద్ద రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు తెలిసింది. ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని పెంపొందించుకోవడానికి 2020 అక్టోబర్‌లో బేసిక్ ఎక్స్ఛేంజ్, కో-ఆపరేషన్ అగ్రిమెంట్(బీఈసీఏ) కుదిరింది.

మోదీ వెనకచూపు!

అందుకే తరచూ ప్రమాదాలు: రాహుల్ వ్యంగ్యాస్త్రాలు



న్యూయార్క్: "ప్రధాని మోదీ భారతీయ కారును రియర్‌వ్యూ అద్దంలో చూస్తూ నడిపేందుకు ప్రయత్నిస్తున్నారు. అందుకే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి" అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీజేపీకి గానీ, ఆర్ఎస్ఎస్‌కి గానీ భవిష్యత్తులోకి చూడగలిగే సామర్థ్యం లేదని విమర్శించారు. ఆయన ఆదివారం ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్-అమెరికా విభాగం ఆధ్వర్యంలో న్యూయార్క్‌లోని జవిట్స్ సెంటర్‌లో భారతీయ అమెరికన్లనుద్దేశించి మాట్లాడారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాళ్లు అసమర్థులు. ఏదడిగినా గతం తవ్వుతారు. ఒడిశా రైలు ప్రమాదం లాంటివి ఎందుకు జరుగుతున్నాయని అడిగితే '50 ఏళ్లనాడు కాంగ్రెస్ అలా చేసినందుకే...' అంటారు. పీరియాడిక్ టేబుల్‌ను పాఠ్య పుస్తకాల్లోంచి ఎందుకు తీసేశారంటే 60 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ఇలా చేసిందని చెబుతారు" అని చెణుకులు విసిరారు. "రియర్ మిర్రర్‌లో చూస్తూ కారు నడిపితే వరుస ప్రమాదాలు ఖాయం. మోదీ అలవాటు అదే. భారతీయ కారును సైడ్ మిర్రర్‌లో మాత్రమే చూసుకుంటూ నడుపుతున్నారు. అది ముందుకు పోకుండా ప్రమాదాలెందుకు జరుగుతున్నాయో అర్థం చేసుకోవడం లేదు" అన్నారు.

మెగా విద్వేష షాపింగ్ మాల్: నడ్డా

న్యూఢిల్లీ: ప్రేమ దుకాణం పేరిట రాహుల్ మెగా విద్వేష షాపింగ్ మాల్ తెరిచారంటూ బీజేపీ చీఫ్ జేపీ నడ్డా మండిపడ్డారు. "మోదీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో దేశం అభివృద్ధిని ప్రపంచమే గుర్తించింది. దాన్ని యువరాజు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకవైపు సర్జికల్ స్ట్రైక్స్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తారు. హిందువులు, ముస్లింలను విడదీయడంపై మాట్లాడుతారు. సమాజాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తుంటారు. మరోవైపు ప్రేమ దుకాణం నడుపుతున్నానంటూ చెప్పుకుంటుంటారు. నిజానికది మెగా విద్వేష షాపింగ్ మాల్" అన్నారు.

కొడుకును కాపాడబోయి...

భారతీయ అమెరికన్ దుర్మరణం

న్యూయార్క్: భారతీయ అమెరికన్ ఒకరు తన కొడుకును కాపాడే క్రమంలో ప్రాణాలు కోల్పోయారు. కాలిఫోర్నియాలోని శాంటాక్రజ్ కౌంటీలో వారం క్రితం ఈ విషాదం చోటుచేసుకుంది. జొన్నలగడ్డ శ్రీనివాసమూర్తి కుటుంబంతో పాంథెర్ బీచ్‌కు వెళ్లారు. అలల్లో కొట్టుకుపోతున్న 12 ఏళ్ల కొడుకును కాపాడేందుకు నీళ్లలోకి దిగారు. మరొకరి సాయంతో కొడుకును ఒడ్డుకు తీసుకొచ్చారు. అంతలో బలమైన అల మూర్తిని లోపలికి లాక్కెళ్లింది. ఈత రాని ఆయన లోతైన నీళ్లలో మునిగిపోయారు. తీవ్రంగా గాయపడిన మూర్తిని సహాయక సిబ్బంది బయటికి తీసి హెలికాప్టర్‌లో హాస్పిటల్‌కు తరలించినా ప్రాణాలు దక్కలేదు.



ఉత్తరాఖండ్‌లో మంచుమయమైన హేమకుండ్ సాహిబ్ గురుద్వారాను దర్శించుకుని తిరిగొస్తూ హిమపాతంలో చిక్కుకుని గల్లంతైన భక్తుల కోసం అన్వేషిస్తున్న రాష్ట్ర విపత్తు స్పందన దళ సభ్యులు. ఈ దుర్ఘటనలో ఒక మహిళ మృతదేహాన్ని ఎస్‌డీఆర్‌ఎఫ్ వెలికితీసింది.

ఆ ట్రాక్‌లు సిద్ధం



ప్రమాద మార్గంలో ట్రాక్ పునరుద్ధరణ తర్వాత వెళ్తున్న రైళ్లు . శిథిలాలు కన్పించకుండా కట్టిన తెరలు

ఒడిశాలో పెను ప్రమాదం జరిగిన లైన్లపై రైళ్ల రాకపోకల పునరుద్ధరణ

- రైల్వే విచారణ వేగవంతం
- డ్రైవర్ల స్టేట్‌మెంట్ నమోదు
- రంగంలోకి సీబీఐ విచారణ బృందం
- మోదీకి ప్రచార యావ: ఖర్గే

భువనేశ్వర్: ఒడిశాలో మూడు రైళ్ల ఘోర రైలు ప్రమాదంతో ఛిన్నాభిన్నమైన రైల్వే ట్రాక్‌లను శరవేగంగా పునరుద్ధరిస్తున్నారు. రెండు ప్రధాన ట్రాక్‌లను ఇప్పటికే సిద్ధం చేశారు. వాటిపై తొలుత ఆదివారం రాత్రి వైజాగ్-రూర్కెలా గూడ్స్, అనంతరం సోమవారం ఉదయం వందేభారత్ ప్రయాణించాయి. మూడు రోజులుగా ఘటనా స్థలి వద్దే ఉండి పనులను పర్యవేక్షిస్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చేతులూపి రైళ్లను స్వాగతించారు. కోరమండల్, హౌరా ఎక్స్‌ప్రెస్‌లు, మరో గూడ్స్ రైలు శుక్రవారం రాత్రి ఒడిశాలోని బహనగా బజార్ స్టేషన్ సమీపంలో ఘోర ప్రమాదానికి గురైన మహా విషాదం 275 మందిని బలి తీసుకోవడం తెలిసిందే. దేశాన్ని కలచివేసిన ఈ ప్రమాదంపై రైల్వే శాఖ ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ విచారణ ముమ్మరంగా సాగుతోంది. భువనేశ్వర్ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న కోరమండల్ రైలు డ్రైవర్, అసిస్టెంట్ల స్టేట్‌మెంట్‌ను రైల్వే సేఫ్టీ కమిషనర్ (సీఆర్‌ఎస్) సోమవారం నమోదు చేశారు. డ్రైవర్ కోలుకుని ఐసీయూ నుంచి వార్డుకు మారగా అసిస్టెంట్ తలకు సర్జరీ జరగాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో రైలు డ్రైవర్ల తప్పిదమేమీ లేదని రైల్వే శాఖ ఇప్పటికే ప్రకటించడం, మొత్తం ఉదంతంపై సీబీఐ విచారణకు సిఫార్సు చేయడం తెలిసిందే. 10మంది సభ్యులతో కూడిన బృందం సోమవారం ఘటనా స్థలిని సందర్శించింది. ఇప్పటిదాకా 170 మృతదేహాలను గుర్తించారు. ఒడిశా ప్రభుత్వం వాటిని ఉచితంగా స్వస్థలాలకు తరలిస్తోంది. ప్రమాదంలో మరణించిన, కాళ్లూ చేతులూ పోగొట్టుకున్న పశ్చిమబెంగాల్ వాసుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వోద్యోగం ఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. మృతుల సంఖ్య తాజాగా 278కి పెరిగింది.

ఒడిశాలో పట్టాలు తప్పిన గూడ్సు

ఒడిశాలో సోమవారం మరో రైలు పట్టాలు తప్పింది. బారాఘర్ వద్ద ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన నారో గేజ్ లైన్లో లైమ్‌లైన్ లోడుతో వెళ్తున్న గూడ్స్ తాలూకు ఐదు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం లేదని అధికారులు తెలిపారు. డుంగ్రీ లైమ్‌స్టోర్ గనులకు, బారాఘర్ ఏసీసీ సిమెంట్ ప్లాంట్‌కు మధ్య ఉన్న ఈ లైనుతో రైల్వేకు సంబంధం లేదు.

చార్లెస్ సంతాపం

ప్రమాదంపై బ్రిటన్ రాజు చార్లెస్-3 సంతాపం తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఈ మేరకు ఆయన సందేశం పంపారు. ఈ దారుణం తనను, రాణిని తీవ్ర షాక్‌కు గురి చేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 1980ల్లో తన ఒడిశా పర్యటన తనకెన్నో తీపి గుర్తులు అందించిందని గుర్తు చేసుకున్నారు. భారత్‌కు తన హృదయంలో ప్రత్యేక స్థానముందని చార్లెస్ తెలిపారు.

మోదీకి ఖర్గే లేఖాస్త్రం

రైల్వేలను ప్రాథమిక స్థాయి నుంచి బలోపేతం చేయకుండా కేవలం పైపై మెరుగులు దిద్దుతూ వార్తల్లో నిలవడంపైనే ప్రధాని మోదీ దృష్టి పెట్టారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. ప్రమాదానికి అసలు కారణాలను బయట పెట్టాలంటూ మోదీకి లేఖ రాశారు. "నేరాలను దర్యాప్తు చేసే సీబీఐ రైలు ప్రమాదం విషయంలో ఏం చేస్తుంది? సాంకేతిక, వ్యవస్థాగత, రాజకీయ వైఫల్యాలను సీబీఐ నిగ్గదేల్చగలదా?" అని ప్రశ్నించారు.

దడ పుట్టించిన చేజింగ్

బుల్లి విమానాన్ని వెంటాడిన ఫైటర్ జెట్

అమెరికా రాజధానిలో కలకలం

వాషింగ్టన్: అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ఓ చిన్న విమానాన్ని జెట్ విమానం వెంబడించడం కలకలం రేపింది. అసాధారణ వేగంతో ప్రయాణిస్తూ యుద్ధ విమానం నుంచి వెలువడిన సోనిక్ శబ్దం వాషింగ్టన్ వాసుల గుండెల్లో దడ పుట్టించింది. ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. ఏవియేషన్ విభాగం సమాచారం ప్రకారం.. ఆ సెస్నా సైటేషన్ విమానం టెన్నెస్సీలోని ఎలిజెబెత్‌టన్ నుంచి బయలుదేరింది. లాంగ్ ఐల్యాండ్‌లోని మెక్ ఆర్థర్ ఎయిర్‌పోర్టుకు చేరుకోవాల్సి ఉంది. అయితే అనూహ్యంగా, న్యూయార్క్‌లోని లాంగ్ ఐలాండ్ మీదుగా, సరాసరి వాషింగ్టన్ డీసీ వైపుగా వచ్చింది. దేశ రాజధానిలోని అత్యంత భద్రత కలిగిన నిషిద్ధ ప్రాంతాల మీదుగా అది వెళ్లడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రేడియో సిగ్నళ్లకు పైలట్ స్పందించకపోవడంతో వెంటనే ఎఫ్-16 జెట్ విమానాన్ని పంపారు. అది సోనిక్ శబ్దంతో ప్రయాణిస్తూ దూసుకెళ్లింది. ఆ శబ్దం వాషింగ్టన్‌తోపాటు, మేరీల్యాండ్, వర్జీనియాలోని కొన్ని ప్రాంతాల వారికి సైతం వినిపించింది. సదరు విమానం పైలట్ దృష్టిలో పడేందుకు ఫైటర్ జెట్ ఎఫ్-16 విమానం మంటలను సైతం వదులుతూ వెళ్లింది. భూమిపైని వారి భద్రతను, సదరు విమానం భద్రతను దృష్టిలో ఉంచుకునే ఈ మేరకు చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో వర్జీనియాలోని మౌంట్ మొంటెబెల్లోకు సమీపంలోని పర్వత ప్రాంతంలో చివరికి చిన్న విమానం కుప్పకూలింది. విమానం మండిపోయిందని, అందులో వారెవరూ ప్రాణాలతో బయటపడలేదని అధికారులు తెలిపారు. చివరి క్షణంలో అది నిమిషానికి 30 వేల అడుగుల చొప్పున వేగంగా నేలవైపుగా దూసుకొచ్చిందని ఫ్లైట్ ట్రాకింగ్ రికార్డులు చెబుతున్నాయి. పర్వత ప్రాంతంలో విమానం కూలిన చోటుకు కాలినడకన చేరుకునేందుకు పోలీసులకు దాదాపు నాలుగు గంటలు పట్టింది. ఫ్లోరిడాకు చెందిన ఎన్‌కోర్ మోటార్స్ పేరిట ఆ విమానం రిజిస్టరై ఉంది. ఈ కంపెనీ నిర్వాహకుడు జాన్ రంపెల్ మాట్లాడుతూ..ఆ విమానంలో పైలట్‌తోపాటు తన కూతురు, రెండేళ్ల మనవరాలు, ఆయా ఉన్నారన్నారు. వీరు నార్త్ కరోలినా నుంచి ఈస్ట్ హాంప్టన్‌కు వస్తున్నారన్నారు. విమానంలో సాంకేతిక లోపం ఉన్నట్లు తనకు తెలియదన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది. ఇది 1999 నాటి ఘటనను గుర్తుకు తెచ్చింది. అప్పట్లో లీయర్‌జెట్ విమానం సాంకేతిక లోపం తలెత్తి అడ్డదిడ్డంగా తిరుగుతూ సౌత్ డకోటా ప్రాంతంలో కూలిపోయింది. అందులోని ఆరుగురూ చనిపోయారు.

కూలింది ఈ రకం విమానమే



మనీశ్ సిసోడియాకు హైకోర్టులో దక్కని ఊరట



న్యూఢిల్లీ: ఆప్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న సిసోడియాకు బెయిలిస్తే సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. తన భార్య సీమా సిసోడియా అనారోగ్యంతో బాధపడుతున్నందున ఆరు వారాల మధ్యంతర బెయిలివ్వాలంటూ పెట్టుకున్న అర్జీపై జస్టిస్ దినేశ్ కుమార్ శర్మ సోమవారం విచారణ జరిపారు. అయితే, సీమా సిసోడియాను ఆమె చికిత్స పొందుతున్న ఆస్పత్రిలో లేదా ఇంటి వద్ద ఒక రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండేందుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఆ సమయంలో ఇంటర్నెట్ వాడరాదు, మీడియాతో మాట్లాడరాదని, కుటుంబ సభ్యులు మినహా ఇతరులను కలవరాదని షరతులు విధించారు. ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీమా సిసోడియాకు అత్యుత్తమ వైద్య చికిత్సలు అందించాలని అధికారులను ఆదేశించింది.మద్యం విధానం కేసులో ఫిబ్రవరి 26న సీబీఐ అరెస్ట్ చేయగా, మార్చి 9న ఈడీ అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం ఆయన తిహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

శివసేన, బీజేపీ కలిసే పోటీ: షిండే

ముంబై: స్థానిక సంస్థలు సహా భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ శివసేన(షిండే వర్గం), బీజేపీ కలిసే పోటీ చేస్తాయని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చెప్పారు. మహారాష్ట్రలో ఈ రెండు పార్టీలు అధికారాన్ని పంచుకుంటున్న విషయం తెలిసిందే. డిప్యూటీ సీఎం ఫడ్నవీస్‌తో కలిసి తాను ఆదివారం రాత్రి ఢిల్లీలో హోం మంత్రి అమిత్ షాతో సమావేశమైనట్లు షిండే సోమవారం ట్వీట్ చేశారు. లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీకి దిగాలని ఆ సమావేశం నిర్ణయం తీసుకున్నాం. కలిసి పోటీ చేస్తాం. మెజారిటీతో విజయం సాధిస్తాం'అని షిండే పేర్కొన్నారు.

చేయని నేరానికి 20 ఏళ్లు జైల్లో...!

కాన్‌బెర్రా: ఓ మహిళ తన నలుగురు పిల్లలను చంపిన నేరంపై 20 ఏళ్లపాటు ఖైదీగా గడిపింది. ఆమె పిల్లలు సహజ కారణాలతో చనిపోయారంటూ తాజాగా శాస్త్రీయంగా రుజువు కావడంతో క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేశారు. ఆస్ట్రేలియాలోని న్యూసౌత్‌వేల్స్ రాష్ట్రం గ్రాఫ్టన్‌కు చెందిన కాథ్లీన్ ఫోల్బిగ్‌కు కలెబ్, పాట్రిక్, సారా, లారా అనే నలుగురు పిల్లలు. వీరంతా 1989-99 మధ్య దశాబ్ద కాలంలో 19 రోజుల నుంచి 19 నెలల వయస్సుల్లో చనిపోయారు. ఆ సమయంలో ఫోల్బిగ్ పిల్లల పెంపకంలో కష్టనష్టాల గురించి తన డైరీలో రాసుకున్నారు. వీటితోపాటు ఇతర సాక్ష్యాల ఆధారంగా 2003లో ఆమెకు 30 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఫోల్బిగ్ మాత్రం నేరం చేయలేదంటూ కోర్టులో పోరాటం సాగిస్తున్నారు. అరుదైన ఈ కేసు దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆమె సంతానం సహజంగానే, 'కామ్2-జీ114ఆర్'అనే జన్యుపరంగా వచ్చే గుండె జబ్బులతో చనిపోయారని నిపుణులు తేల్చారు. ఆమెకు మద్దతుగా 90 మంది నిపుణుల సంతకాలతో ప్రభుత్వానికి అర్జీ వెళ్లింది. అన్నిటినీ పరిశీలించిన ప్రభుత్వం ఫోల్బిగ్(55)కు బేషరతుగా క్షమాభిక్ష ప్రసాదిస్తూ సోమవారం విడుదల చేసింది.

ఛత్తీస్‌గఢ్‌లో పేలిన మందుపాతర

ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్‌స్టేషన్ పరిధి గల టేకుమెట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ముగ్గురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం ఉదయం కూంబింగ్ సమయంలో ఎండుటాకుల కింద అమర్చిన ప్రెజర్‌బాంబు పేలి సీఆర్‌పీఎఫ్ 85వ, 222వ బెటాలియన్లకు చెందిన ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యారు. వీరిని మొదటి గంగులూరుకు, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో రాయ్‌పూర్‌కు తరలించారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం


మొక్కలు పంపిణీ చేస్తున్న ఉదయ నిధి స్టాలిన్

సాక్షి, చెన్నై: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రిఫెక్స్ గ్రూప్ మెగా మొక్కల పెంపకం డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. ట్రీస్ ఫర్ లైఫ్ నినాదంతో లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని గ్రీన్‌వేస్ రోడ్డులోని కురింజి ఇల్లంలో క్రీడల శాఖమంత్రి ఉదయ నిధి స్టాలిన్, మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేశ్ కుమార్, కమిషనర్ రాధాకృష్ణన్, రిఫెక్స్ గ్రూప్ ఎండీ అనిల్ జైన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేయించి, మొక్కలను మంత్రి అందజేశారు.

న్యూస్‌రీల్

విమాన చార్జీలకు రెక్కలు

సాక్షి, చెన్నై: చెన్నై నుంచి ఢిల్లీ, ముంబై, కొల్‌కతా వంటి నగరాలకే కాదు, తమిళనాడులోని ఇతర నగరాలకు విమాన చార్జీలు అమాంతంగా పెరిగాయి. రైల్వే ప్రమాదం కారణంగా విమాన సేవల మీద దృష్టి పెట్టినవాళ్లు అధికంగా ఉన్నారు. దీంతో చెన్నై స్వదేశీ విమానాశ్రయం శని, ఆది, సోమవారాలలో కిట కిటలాడాయి. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో చార్జీలు సైతం పెరగడం గమనార్హం. మదురై - చెన్నై మధ్య విమాన సేవలకు సాధారణ రోజుల్లో రూ. 3,629 చార్జీ వసూలు చేయగా, ప్రస్తుతం రూ. 9 వేల నుంచి రూ.10 వేల వరకు వసూళ్లు చేశారు. తూత్తుకుడి - చెన్నై మధ్య రూ. 4,401 వసూళ్లు చేయగా, ప్రస్తుతం రూ. 9 వేల నుంచి రూ.12 వేల వరకు చార్జీలు పెరిగాయి. తిరుచ్చి - చెన్నై మధ్య గతంలో రూ. 2,718 వసూలు చేయగా, ప్రస్తుతం రూ.10,111 వేలుగా చార్జీలు ఉండటం గమనార్హం. ఇదే విధంగా తిరువనంతపురం, కొచ్చి - చెన్నైల మధ్య సైతం చార్జీలు అనూహ్యంగా పెరిగాయి.

దీపావళి చీటీ ద్వారా రూ. 13 కోట్ల మోసం

కొరుక్కుపేట: దీపావళి చీటీ లాటరీ ద్వారా రూ. 13 కోట్ల మోసం చేసి పరారైన ఘటన కొరుక్కుపేటలో చోటుచేసుకుంది. దీంతో బాధితులు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. వివరాలు.. చెన్నై కొరుక్కుపేట కత్తివాక్కం ఏఆర్ మోటార్స్ అనే కంపెనీని నడుపుతున్న బాలమురుగన్ (40) దీపావళి చీటీ నిర్వహించాడు. ఆయన వద్ద 300 మందికి పైగా దీపావళి టిక్కెట్లు కట్టారు. ఈ క్రమంలో చెల్లింపు పూర్తి చేసిన వారికి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసినట్లు తెలుస్తోంది. దీంతో బాధితులు వెళ్లి డబ్బు అడగడంతో బాలమురుగన్ అదృశ్యమయ్యాడు. బాలమురుగన్‌కు మద్దతుగా అన్నాడీఎంకే ఉన్నట్లు తెలుస్తోంది. ఈమేరకు 100 మందికి పైగా బాధితులు చెన్నై కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం కొరుక్కుపేట-కత్తివాక్కం హైవే వద్ద ఉన్న వారి కార్యాలయాన్ని ముట్టడించి రోడ్డును దిగ్బంధించారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్. కె.నగర్ ఇన్‌స్పెక్టర్ రవి బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

టిక్కెట్ లేకుండానే 300 మంది రైలు ప్రయాణం

కొరుక్కుపేట: తిరుచెందూరు రైల్వేస్టేషన్‌లో టికెట్లు ఇచ్చేందుకు కౌంటర్‌లో సిబ్బంది లేకపోవడంతో 300 మంది టిక్కెట్ లేకుండానే తిరునెల్వేలికి ప్రయాణించారు. రైల్వే స్టేషన్లలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన సిబ్బంది పనిచేస్తుండడంతో టిక్కెట్లు దొరకడం చాలా కష్టమని ప్రయాణికులు వాపోతున్నారు. వివరాలు.. తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ నుండి తిరునెల్వేలికి రోజూ ఉదయం 7.20, 8.25, 10.15, 12.20, మధ్యాహ్నం 2.30, 4.35, సాయంత్రం 6.15, రాత్రి 8.10 గంటలకు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. పనుల నిమిత్తం తిరునెల్వేలికి వెళ్లే వారు ఉదయం 7.20, 8.25 గంటలకు ఈ రైలులో ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. అలాగే నజరేత్, శ్రీవైకుంఠం, కరడంగనల్లూర్, పాళైయంగోట్టై వంటి పట్టణాలకు వెళ్లే ప్రయాణికులు అధికంగా ఉండడంతో ఈ రెండు రైళ్లు నిత్యం రద్దీగా ఉంటాయి. సోమవారం ఉదయం 7.20 గంటలకు నెలైకి వెళ్లే రైలు ఎక్కేందుకు తిరుచెందూర్ రైల్వే స్టేషన్‌కు వందల మంది ప్రజలు క్యూ కట్టారు. కానీ టికెట్ ఇవ్వడానికి కౌంటర్ వద్ద ఉదయం 7.15 వరకు ఉద్యోగి ఎవరూ రాలేదు. దీంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు సిద్ధమయ్యారు. అప్పుడు తమిళం తెలియని స్టేషన్ మాస్టర్ టిక్కెట్లు ఇవ్వడం మొదలుపెట్టాడు. అయితే తనకు తమిళం రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో సుమారు 300 మంది ప్రయాణికులు తిరుచిరాపల్లి సెంథూర్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తర్వాత టిక్కెట్లు లేకుండానే రైలు ఎక్కి అందరూ వెళ్లిపోయారు. తిరుచెందూరు రైల్వేస్టేషన్‌లో సోమవారం డ్యూటీలో ఉండాల్సిన వ్యక్తి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే సెలవు తీసుకోవడమే ఈ సమస్యకు కారణంగా తేలింది.

బల్లిపడిన ఆహారం తిని 30 మంది విద్యార్థులకు అస్వస్థత

తిరువొత్తియూరు: చెన్నై సమీపంలోని పూందమల్లి - ఆవడి రోడ్డులో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల నడుస్తోంది. ఇక్కడ చాలా మంది విద్యార్థులు చదువుతున్నారు. తమిళనాడులోని పలు జిల్లాలకు చెందిన 1000 మందికి పైగా విద్యార్థులు ఈ కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. యథావిధిగా ఆదివారం రాత్రి విద్యార్థులకు భోజనం వడ్డించారు. అయితే ఆ ఆహారం తిన్న 30 మందికి పైగా విద్యార్థులు ఒక్కసారిగా వాంతులు చేసుకుంటూ స్పృహతప్పి పడిపోయారు. బాధితులను వెంటనే కళాశాల నిర్వాహకులు రక్షించి పోరూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. తిరువేర్కాడు పోలీసుల చేపట్టిన దర్యాప్తులో బల్లి పడిన ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు తేలింది. అలాగే పూందమల్లి రెవెన్యూ శాఖ, ఆహార భద్రత విభాగం అధికారులు కూడా కళాశాల క్యాంపస్‌కు వెళ్లి సమస్యకు గల కారణాన్ని అన్వేషించే పనిలో పడ్డారు.

వేసవి సెలవుల పొడిగింపు

అనుకున్నదే అయ్యింది.. సూర్యప్రతాపం కారణంగా వేసవి సెలవులను మరో వారం పాటు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం విద్యాశాఖ కీలక ప్రకటన జారీ చేసింది. ఇక ముందస్తుగా పాఠశాలలను తెరిచినా, ప్రత్యేక తరగతుల పేరిట విద్యార్థులను వేధించినా కఠిన చర్యలు తప్పవని ప్రైవేటు విద్యా సంస్థలకు ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

- భానుడి భగభగలతో విద్యాశాఖ ఉత్తర్వులు
- అనుమతి లేకుండా స్కూళ్లు తెరిస్తే కఠిన చర్యలు
- ప్రైవేటు పాఠశాలల యాజమాన్యానికి తీవ్ర హెచ్చరిక
- జూన్ 12, 14 తేదీల్లో పాఠశాలల పునః ప్రారంభించాలని నిర్ణయం


పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినులు (ఫైల్)

సాక్షి, చెన్నై: గత విద్యా సంవత్సరం చివరిలో పబ్లిక్ పరీక్షలు ముగిసినానంతరం రాష్ట్రంలో ఏప్రిల్ 28వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ముందుగా నిర్ణయించిన మేరకు జూన్ 1వ తేదీ 8 నుంచి 12వ తరగతి వరకు పాఠశాలలను తెరిచేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే, ఎండల ప్రభావం ఏ మాత్రం తగ్గని దృష్ట్యా, వేసవి సెలవులను జూన్ 7వ తేదీ వరకు పొడిగించారు. అయితే, అనేక ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ ఉత్తర్వులను రాష్ట్రంలో ఖాతరు చేయలేదు. ముందుగా నిర్ణయించినట్టుగా జూన్ ఒకటో తేదీనే పాఠశాలలను రీ ఓపెన్ చేశారు. ఈ సమాచారంతో విద్యాశాఖ అధికారుల ఆగ్రహానికి ప్రైవేటు పాఠశాలలు గురి కావాల్సి వచ్చింది. చివరకు పాఠశాలల పునఃప్రారంభించాల్సిన తేదీ జూన్ 7 అని తెలియజేసే బోర్డులు అన్ని పాఠశాలల ముందూ ప్రత్యక్షమయ్యాయి. అయితే, రాష్ట్రంలో ఎండ వేడిమి ఏమాత్రం తగ్గలేదు. అనేక జిల్లాలో ఆదివారం, సోమవారం 108 ఫారిన్ హీట్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో పాఠశాలల ప్రారంభ తేదీని మార్చాలనే డిమాండ్ తెర మీదకు వచ్చింది.

విద్యార్థుల క్షేమం కోసం..

నైరుతి రుతు పవనాలు కేరళ తీరాన్ని తాకేందుకు మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నట్లు ఇటీవల వాతావరణ కేంద్రం ప్రకటించింది. అంత వరకు రాష్ట్రంలో అనేక జిల్లాలో ఎండ వేడమి అధికంగానే ఉంటుందని వివరించారు. దీంతో విద్యా శాఖమంత్రి అన్బిల్ మహేశ్ నేతృత్వంలోని అధికారుల బృందం సోమవారం ఉదయం సచివాలయంలో సీఎం స్టాలిన్‌ను కలిశారు. రాష్ట్రంలో ఎండల ప్రభావం గురించి వివరించారు. పాఠశాలలను ఇప్పుడు తెరిచిన పక్షంలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని, సెలవులను పొడిగించాలని సీఎంను కోరారు. సీఎం స్టాలిన్ ఆమోదించడంతో మరో వారం పాటు సెలవులను పొడిగిస్తూ విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేశ్ ఉత్తర్వులు ఇచ్చారు.


మంత్రి అన్బిల్ మహేశ్

ఆ మేరకు 6 నుంచి 12వ తరగతికి ఈనెల 12వ తేదీ పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. అలాగే 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఈనెల 14వ తేదీన పాఠశాలలు తెరుస్తారు. 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం రోజు నుంచే విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఐఏఎస్ అధికారి గజలక్ష్మి నేతృత్వంలోని బృందం సిద్ధం చేసింది. ఇక, ప్రైవేటు విద్యాసంస్థలకు తీవ్ర హెచ్చరికలు చేశారు. ముందుగానే పాఠశాలలను రీ ఓపెనింగ్ చేసిన పక్షంలో ఆయా యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫిర్యాదులు వచ్చిన పక్షంలో సీజ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వానికి ముఖ్యమని, అందుకే వేసవి సెలవులు వారం రోజులు పొడిగించాల్సి వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా తమిళనాడుతో పాటుగా పుదుచ్చేరిలోనూ సెలవులు పొడిగించారు. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఈనెల 14వ తేదీ 1 నుంచి 12వ తరగతి వరకు పాఠశాలలు తెరచుకోనున్నాయి. కాగా, ఓ వైపు సెలవులు పొడిగించారో లేదో మరోవైపు చెన్నై, శివారు జిల్లాలో సాయంత్రం వాతావరణం పూర్తిగా మారింది. ఉరుములు మెరుపులతో సోమవారం కాసేపు వర్షం పడడం గమనార్హం. అలాగే, అరుప్పు కోట్టైలో వడగళ్ల వాన పడింది. ఈదురు గాలుల దెబ్బకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

పట్టాలెక్కిన కోరమాండల్

2 రోజుల తర్వాత షాలిమర్‌కు ప్రయాణం



సాక్షి, చెన్నై: చెన్నై నుంచి షాలిమర్ వైపుగా కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రెండురోజుల అనంతరం పట్టాలెక్కింది. ఈ రైలు మంగళవారం షాలిమర్‌కు చేరుకోనుంది. వివరాలు.. ఒడిశా బాలసోర్ వద్ద శుక్రవారం కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైలు, హౌరా ఎక్స్‌ప్రెస్‌లు ఢీకొన్న దుర్ఘటనతో చెన్నై నుంచి అనేక రైళ్ల సేవలు రద్దు చేశారు. ఈ ప్రమాదంలో తమిళులు పెద్దసంఖ్యలో చిక్కుకున్నట్టుగా వచ్చిన సమాచారంతో సహాయక చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో తమిళులు ఎవరూ మరణించలేదు. స్వల్పగాయాలతో బయట పడ్డ వాళ్లే అధికం. అందరూ సురక్షితంగా రాష్ట్రానికి వచ్చేయడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఒడిశాలో ప్రమాదం జరిగిన ప్రదేశంలో రైల్వే ట్రాక్‌ను పునరుద్ధరించడంతో మళ్లీ రైళ్ల సేవలపై అధికారులు దృష్టి పెట్టారు. దీంతో చెన్నై నుంచి ఉత్తరాది రాష్ట్రాల వైపుగా వెళ్లే పలు రైళ్ల సేవలను సోమవారం పునరుద్ధరించారు. అలాగే రెండురోజులుగా పూర్తిగా నిలుపుదల చేసిన చెన్నై – షాలిమర్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌ను మళ్లీ ప్రారంభించారు. ముందుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు రైలు బయలు దేరే సమాచారాన్ని మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా పంపించారు. దీంతో ఈ రైలు సోమవారం ఉదయం చెన్నై ఎంజీఆర్ సెంట్రల్ రైల్వే స్టేషన్ నుంచి 10.45 గంటలకు బయలు దేరింది. ఈ రైలు విజయవాడ, రాజమండ్రి, విశాఖ పట్నం మీదుగా బాలాసోర్ వైపుగా కోలకతాలోని షాలిమర్‌కు మంగళవారం ఉదయం చేరుకోనుంది.

కాయిదే మిల్లత్‌కు ఘన నివాళి


కాయిదే మిల్లత్‌కు నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు


నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే నాయకులు

- ఘనంగా జయంతి వేడుకలు
- సమాధి వద్ద సీఎం సహా పలువురి నేతల పుష్పాంజలి

సాక్షి, చెన్నై: ఇండియన్ యూనియన్ ముస్లీం లీగ్ వ్యవస్థాపకుడు కాయిదే మిల్లత్ మహ్మద్ ఇస్మాయిల్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ట్రిప్లికేన్‌లోని పెద్ద మసీదు ఆవరణలోని ఆయన సమాధి వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం అధికారికంగా నివాళులర్పించారు. వివరాలు..ఏటా కాయిదే మిల్లత్ జయంతి వేడుకను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ట్రిప్లికేన్‌లోని పెద్ద మసీదు వద్ద ఉన్న ఆయన సమాధి పరిసరాలను ఉదయాన్నే సుందరంగా తీర్చిదిద్దారు. పెద్దఎత్తున ముస్లిం సంఘాల నేతలు, రాజకీయ పార్టీ నాయకులు అక్కడికి తరలి రావడంతో ఆ పరిసరాలు కిక్కిరిశాయి. ముస్లిం మతపెద్దలు ప్రత్యేక పాత్యహా నిర్వహించారు. సీఎం ఎంకే స్టాలిన్ నేతృత్వంలో మంత్రులు దురై మురుగన్, ఉదయ నిధి స్టాలిన్, సెంజి మస్తాన్, ఎంపీలు దయానిధి మారన్ తదితరులు, పలువురు ఎమ్మెల్యేలు తరలి వచ్చి నివాళులర్పించారు. సమాధిపై మల్లెపూలతో సిద్ధం చేసిన ఛాదర్‌ను సీఎం సమర్పించారు. అనంతరం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి తరఫున ఆ పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్, నేతలు జయకుమార్, నత్తం విశ్వనాథన్, వలర్మతి తదితరులు పలు పుష్పాలతో సిద్ధం చేసి ఛాదర్‌ను సమాధిపై కప్పి నివాళులర్పించారు. అలాగే, ఇండియన్ యూనియన్ ముస్లీం లీగ్ అధ్యక్షుడు ఖాదర్ మోహిద్దీన్, సీనియర్ నేత అబుబక్కర్, పలు ముస్లీం సంఘాలు, పార్టీల నాయకులు వేర్వేరుగా తరలి వచ్చిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్టాలిన్ పేర్కొంటూ, కాయిదే మిల్లత్ సేవల్ని గుర్తుచేశారు. గొప్ప కాలేజీ చదువు మానేసి దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో చేరిన గొప్ప దేశ భక్తుడు అని పేర్కొన్నారు. నియోజకవర్గానికి వెళ్లకుండానే విజయ కేతనం ఎగుర వేసిన నాయకుడు అని తెలిపారు. రాష్ట్రంలో అన్ని మతాల మధ్య సోదరభావం పెంపునకు మిల్లత్ కృషి చేశారని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా తమిళ భాషను అధికారిక భాషగా ప్రకటించాలని తొలుత ఉభయ సభల్లో గళం విప్పిన నేత మిల్లత్ అని కొనియాడారు.

చిక్కిన అరికొంబన్!

- మత్తు ఇంజెక్షన్ ఇచ్చి అదుపులోకి..
- సాయంగా కుంకీలు
- దట్టమైన అడవిలోకి మదపుటేనుగు
- ఊపిరి పీల్చుకున్న తేని వాసులు
- 144 సెక్షన్ ఎత్తివేత


లారీలో అరి కొంబన్‌ను తరలిస్తున్న సిబ్బంది

సాక్షి, చెన్నై : కేరళ – తమిళనాడు సరిహద్దులలోని తేని జిల్లా వాసులను హడలెత్తిస్తూ వచ్చిన అరి కొంబన్ ఏనుగు ఎట్టకేలకు పట్టుబడింది. సోమవారం ఉదయం దీనికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చి పట్టుకున్నారు. కుంకీల సాయంతో లారీలో ఎక్కించి దట్టమైన అడవిలో వదిలి పెట్టేందుకు తీసుకెళ్లారు. వివరాలు.. కేరళ రాష్ట్రం ఇడిక్కి జిల్లా పరిధిలో గత కొంతకాలంగా అరి కొంబన్ ఏనుగు హడలెత్తిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏనుగు దాడికి పంట పొలాలు నాశనం అయ్యాయి. అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ప్రత్యేక ఆపరేషన్ ద్వారా ఈ ఏడాది ఏప్రిల్‌లో అతికష్టంపై ఈ ఏనుగును పట్టుకున్నారు. తెక్కడైలోని దట్టమైన పెరియార్ రిజర్వర్ ఫారెస్ట్‌లోకి తీసుకెళ్లి వదిలి పెట్టారు. దీనికి రేడియో కాలర్ అమర్చి కదలికలను పరిశీలిస్తూ వచ్చారు. అయితే, కేరళను వీడిన ఈ అరి కొంబన్ ఏనుగు గత నెలాఖరులో తమిళనాడులోని తేని జిల్లాలోకి ప్రవేశించింది.

వారం రోజులకు పైగా అవస్థలు

తేని జిల్లా పరిధిలోని కంబం పట్టణంలోకి తొలుత దూసుకొచ్చిన ఈ అరికొంబన్ రోడ్ల మీద పరుగులు తీస్తూ, వాహనాలపై తన ప్రతాపం చూపించింది. ఈ క్రమంలో పలువురిపై దాడి చేసింది. ఒకరిని కొట్టి చంపేసింది. గత వారానికి పైగా ఆ తర్వాత గూడలూరు పరిసరాలలో వీరంగం సృష్టించింది. దీంతో అక్కడ 144 సెక్షన్ అమలు చేశారు. జనం ఇళ్లకే పరిమితమయ్యారు. పట్టుకునేందుకు వచ్చిన అధికారుల కళ్లు గప్పి తప్పించుకుంటూ వచ్చిన ఈ అరికొంబన్ సోమవారం ఉదయం షణ్ముగా నదీ డ్యాం తీరంలో ఉన్నట్లు రైతులు గుర్తించారు. తక్షణం అధికారులు, వైద్యులు అక్కడికి చేరుకున్నారు. పథకం ప్రకారం చాకచక్యంగా రెండుడోస్‌ల మత్తు ఇంజెక్షన్లను ఈ ఏనుగుకు ఇచ్చారు. వెను వెంటనే స్వయంబు, అరిసి రాజ, ఉదయన్ అనే మూడు కుంకీ ఏనుగుల సాయంతో అరి కొంబన్‌ను చుట్టుముట్టారు. కుంకీ ఏనుగుల సహకారంతో బలవంతంగా లారీలోకి అరి కొంబన్‌ను ఎ క్కించారు. ఇది మళ్లీ తప్పించుకోకుండా ఆగమేఘాలపై లారీలో దట్టమైన అడవిలో వదిలి పెట్టేందుకు తీసుకెళ్లారు. మార్గం మధ్యలో కట్టిన తాళ్లను ఈ ఏనుగు తెంచి పడేయడంతో ఉత్కంఠ నెలకొంది. అతికష్టం మీద ఈ ఏనుగును బంధించారు. అడవిలోకి తీసుకెళ్లి వదిలి పెట్టే సమయంలో ఈ ఏనుగు ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా వైద్యులు పరిశీలించనున్నారు. వారం రోజులకు పైగా తమ కంటి మీద కునుకు లేకుండా చేసిన అరి కొంబన్ చిక్కడంతో తేని వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక్కడి పట్టణాలు, గ్రామాల్లో విధించిన 144 సెక్షన్‌ను వెనక్కి తీసుకున్నారు. ఇదిలా ఉండగా, ఈ అరి కొంబన్ రూపంలో ఎదురైన నష్టం తీవ్రతను అంచనా వేయడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు.

కలకాడు వాసుల నిరసన

పట్టుబడ్డ అరి కొంబన్ ఏనుగును తిరునల్వేలి జిల్లా కలకాడు అభయారణ్యంలో వదిలి పెట్టాలని రాష్ట్ర అటవీ అధికారులు నిర్ణయించారు. తేని నుంచి కలకాడుకు లారీలో ఈ ఏనుగును తీసుకొచ్చారు. అయితే కలకాడు అడవుల్లో ఈ ఏనుగును వదిలిపెట్టడాన్ని పరిసర గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఏనుగుతో వచ్చిన లారీని ప్రజలు సాయంత్రం అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. అనేక మందిని పొట్టన పెట్టుకున్న ఈ ఏనుగును ఇక్కడ వదిలి పెడితే, తమకు భద్రత లేకుండా పోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు నిరసనకారులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసినానంతరం అభయారణ్యంలోకి ఏనుగును తీసుకెళ్లారు. ప్రస్తుతం వైద్యుల అబ్జర్వేషన్‌లో అరి కొంబన్‌ఉంది. అదే సమయంలో ఈ ఏనుగును మది కట్టాం చోళైలో వదిలి పెట్టేందుకు ఆదేశించాలని కోరుతూ మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలైంది.

విద్యా విధానంలో మార్పులు తప్పనిసరి



ప్రసంగిస్తున్న గవర్నర్‌ఆర్ఎన్ రవి

సాక్షి, చెన్నై: తమిళనాడు విద్యా విధానంలో మార్పులు తప్పనిసరి అని.. రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి స్పష్టం చేశారు. వీసీల మహానాడులో ఇందుకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. వివరాలు. రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల వీసీల మహానాడుకు నీలగిరి జిల్లా ఊటీ వేదికగా గవర్నర్ ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశానికి పలు వర్సిటీల వీసీలు హాజరయ్యారు. ఇందులో గవర్నర్ రవి ప్రసంగిస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాలు తమిళనాడుతో పోటీ పడే స్థాయిలో విద్యా రంగంలో దూసుకెళ్తున్నాయన్నారు. ప్రస్తుతం ఇక్కడున్న విద్యా విధానం యువత మేథా సంపతి, ప్రతిభ, భవిష్యత్తుకు అనుగుణంగా లేదని పేర్కొంటూ, మార్పు అవశ్యం అని వ్యాఖ్యానించారు. తమిళనాడు ప్రాథమిక విద్యకు మాత్రమే కాకుండా, ఉన్నత విద్యకు ప్రాధాన్యత మరింతగా పెరగాలని సూచించారు. యువత ప్రతిభను గుర్తించి, అందుకు అనుగుణంగా పాఠ్యాంశాలు అందించక పోవడంతో అభివృద్ధి అన్నది కుంటు పడుతోందన్నారు. ప్రస్తుతం కేంద్రం తీసుకొచ్చిన జాతీయ విద్యా విదానంలో యువత ప్రతిభకు తగ్గట్లుగా అనేక అంశాలు ఉన్నాయని వివరించారు. ఈ కాలంలో చదువుకు తగ్గ ఉద్యోగం తక్కడం లేదన్నారు. సాంకేతికత విస్తృతంగా అభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో ఇక్కడి విద్యా విధానంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులను అభ్యసిస్తున్న వారికి దక్కుతున్న ఉద్యోగాలు, ఇంజినీరింగ్ చేసిన వారికి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఈ సమావేశంలో ఉన్నత విద్యాలయాలలో పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులు, తమిళం తర్జుమా తదితర అంశాల గురించి చర్చించారు.

వెంటాడిన మృత్యువు

- ట్రాక్టర్‌ను అధిగమించే సమయంలో డివైడర్‌ను ఢీకొన్న వ్యాన్
- ముగ్గురికి తీవ్రగాయాలు
- అంబులెన్స్‌లో వెళ్తుండగా మరోసారి ప్రమాదం
- డ్రైవర్ సహా ముగ్గురు మృత్యువు ఒడిలోకి..


గాయపడిన వారిని పరామర్శిస్తున్న అధికారులు


గుంతలో బోల్తాపడిన అంబులెన్స్


ప్రమాదానికి గురైన ట్రాక్టర్, వ్యాను

సాక్షి, చెన్నై: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరుడిని దర్శించుకు వెళ్తున్న ఓ కుటుంబాన్ని ప్రమాదం రెండు సార్లు వెంటాడింది. ట్రాక్టర్‌ను అధిగమించే క్రమంలో మొదట వ్యాన్ ప్రమాదం బారినన పడింది. గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమ్నీ ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తాతా మనవరాలుతో పాటు అంబులెన్స్ డ్రైవర్ మరణించారు. పెరంబలూరు వద్ద సోమవారం వేకువ జామున ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. దిండుగల్ జిల్లా నాగల్ నగర్‌కు చెందిన కుప్పుస్వామి(60) కుటుంబం ఆదివారం తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రి వ్యాన్‌లో తిరుగు పయనమయ్యారు. వ్యాన్‌ను దిండుగల్‌కు చెందిన సెల్వరాజ్(48) నడిపాడు. పెరంబలూరు వద్ద చెన్నై – తిరుచ్చిజాతీయ రహదారిలో ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను అధిగమించే ప్రయత్నంలో మొదట వ్యాన్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కుప్పు స్వామి(60), ఆయన మనవరాలు కవి ప్రియ (22), బంధువులు గణేష్(42), నీల (65), ట్రాక్టర్‌లో ప్రయాణించిన డ్రైవర్ కిలవన్(45), స్వామి దాస్(40), శేఖర్ (42) గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ కుప్పుస్వామి, కవి ప్రియను అంబులెన్స్‌లో పెరంబలూరు ఆసుపత్రికి తరలించేందుకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. అంబులెన్స్‌ను డ్రైవర్ రాజేంద్రన్ నడిపాడు. ఘటనా స్థలంనుంచి అంబులెన్స్ బయలు దేరగానే అటువైపుగా వేగంగా వచ్చిన ఆమ్నీ ప్రైవేటు బస్సు దాన్ని ఢీకొంది. బస్సు ఢీకొన్న వేగానికి అంబులెన్స్ పిట్ట గోడను ఢీకొట్టి, రోడ్డు పక్కనే ఉన్న గోతిలో పడింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్,రాజేంద్రన్, కుప్పు స్వామి, కవి ప్రియ ఘటనా స్థలంలోనే మరణించారు. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిలో గంటన్నర పాటుగా వాహనాల రాకపోకలు స్తంభించాయి. కేసు నమోదు చేసిన పోలీసులు మృత దేహాలను పోస్టుమార్టానికి తరలించారు.

క్లుప్తంగా

బైక్ ప్రమాదంలో ఇద్దరి మృతి

అన్నానగర్: బోడి సమీపంలో ఆదివారం సాయంత్రం బైకు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వివరాలు.. తేని జిల్లా బోడి సమీపంలోని మీనాక్షిపురం గ్రామానికి చెందిన పొన్నుసామి (80) రైతు. గత రాత్రి గ్రామ సమీపంలోని రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్నాడు. అంతలో అటుగా వస్తున్న ద్విచక్రవాహనం అతడిని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అలాగే మోటార్ సైకిల్ నడుపుతున్న బోడి సమీపంలోని విశ్యాపురానికి చెందిన హోటల్ కార్మికుడు గణేశన్ (35) కూడా గాయపడ్డాడు. తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరు వ్యక్తులనూ తేని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పొన్నుసామి, గణేషన్ సోమవారం ఉదయం మృతి చెందారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూతురు ప్రేమ వివాహం చేసుకుందని తండ్రి ఆత్మహత్య

అన్నానగర్: కీరనూరు సమీపంలో కూతురు ప్రేమ వివాహం చేసుకోవడంతో మనస్తాపం చెందిన తండ్రి ఆదివారం విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. పుదుకోట్టై జిల్లా కీరనూరు సమీపంలోని కలమావూరు దక్షిణ మండలానికి చెందిన సింగరాయర్ (44). ఇతని కుమార్తె 4 నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకోవడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఈ స్థితిలో సింగరాయర్ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషం తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు గమనించి తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సింగరాయర్ మరణించారు. కిరణూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుతాఘాతంతో రైతు మృతి

అన్నానగర్: పాలకోడు సమీపంలో ఆదివారం సాయంత్రం విద్యుతాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. వివరాలు.. ధర్మపురి జిల్లా పాలకోడ్ సమీపంలోని ఊమయన్ కోట్టై గ్రామానికి చెందిన గోవిందరాజ్ (35) రైతు. ఇతని భార్య రేవతి (32). వీరికి కుమారుడు ప్రవీణ్‌కుమార్ (14), కుమార్తె ధనశ్రీ (10) ఉన్నారు. ఆదివారం సాయంత్రం గోవిందరాజు తన పిల్లలతో ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో పొరపాటున గోడపై ఉన్న విద్యుత్ మీటర్ పై చేయి వేశాడు. విద్యుదాఘాతానికి గురై స్పృహతప్పి పడిపోయాడు. అతని అరుపులు విన్న ఇరుగుపొరుగు వారు రక్షించి పాలకోడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం గోవిందరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మహేంద్రమంగళం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత తిరుత్తణి జట్టు


వాలీబాల్ టోర్నీ విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఎస్పీ విఘ్నేష్.


ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న తిరుత్తణి-పులరంపాక్కం జట్లు

తిరుత్తణి: జిల్లాస్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో తిరుత్తణి జట్టు చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా వాలీబాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో శనివారం, ఆదివారం వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. తిరుత్తణి డాక్టర్ రాధాకృష్ణన్ ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాల మైదానంలో విద్యుత్ దీపాల వెలుగులో రాత్రి వేళ చేపట్టిన పోటీల్లో పురుషుల విభాగంలో 40 జట్లు, స్త్రీల విభాగంలో పది జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో స్త్రీల విభాగంలో తిరువొత్తియూరు జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఇక పురుషుల విభాగంలో తిరుత్తణి జట్టు పులరంపాక్కం జట్టు ఫైనల్‌లో తలపడ్డాయి. పోటాపోటీగా సాగిన పోరులో చివరికి తిరుత్తణి జట్టు చాంపియన్‌గా నిలిచింది. గెలుపొందిన జట్టుకు తిరుత్తణి డీఎస్పీ విఘ్నేష్ ట్రోఫీతో పాటు రూ. 10వేలు నగదు బహుమతి, మెమొంటోను ప్రదానం చేశారు. ద్వితీయ స్థానం పొందిన జట్టుకు ట్రోఫీతో రూ. 5 వేలు అందజేశారు. వాలీబాల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కుప్పుస్వామి, కోశాధికారి భారతి తదితరులు వాలీబాల్ పోటీలకు ఏర్పాట్లు చేశారు.



వేడుకగా చేపలు పట్టే ఉత్సవం

కొట్టంపట్టి సమీపంలో ఆదివారం ఫిషింగ్ ఫెస్టివల్ సందర్భంగా గ్రామస్తులు పెద్దసంఖ్యలో కొలనులో దిగి చేపలు పట్టారు. వివరాలు.. మదురై జిల్లా కొట్టంపట్టి సమీపంలోని మంగళంపట్టిలో ఆదివారం సంప్రదాయ చేపల పండుగ జరిగింది. చాలా ఏళ్ల తర్వాత గతేడాది కురిసిన వర్షాలకు నీటి తొట్టెలు పూర్తిగా నిండాయి. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో కన్మాయిలో నీరు అడుగంటిపోవడంతో చేపల పండుగ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ప్రకారం మంగళంపట్టిలోని కూప్పిటాచ్చి కన్మాయిలో చేపల పండుగ ఆదివారం నిర్వహించారు. అయ్యపట్టి, గున్నారంపట్టి, ఒట్టకోవిల్‌పట్టి తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు ఉదయం నుంచి కన్మాయిలో గ్రామస్తులు కలసి చేపలు పట్టడం ప్రారంభించారు. కాట్లా, క్యాట్ ఫిష్, వైరల్ వంటి స్థానిక చేపలను పట్టుకున్నారు. అనంతరం ఈ చేపలను అమ్మకుండా తమ ఇళ్లలో వండుకుని తిన్నారు. తద్వారా తమను లక్ష్మీదేవి కటాక్షిస్తుందని వీరు విశ్వసిస్తారు.

– అన్నానగర్

22 కిలోల గంజాయి సీజ్


స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

అన్నానగర్: మైలాడుదురై సమీపంలో సోమవారం వేకువజామున రైలులో అక్రమంగా తరలిస్తున్న 22 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తిరుచ్చి రైల్వే పోలీస్ సూపరింటెండెంట్ సెంథిల్‌కుమార్ , స్పెషల్ డివిజన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ షీలా, తిరుచ్చి రిజర్వ్ గంజాయి నివారణ స్పెషల్ ఫోర్స్ సబ్-ఇన్‌స్పెక్టర్ శివరామన్, నార్కోటిక్స్ ఇంటెలిజెన్స్ డివిజన్ పోలీసులు తిరుపతి - మన్నార్గుడి బామిని ఎక్స్‌ప్రెస్ రైలును సోమవారం వేకువజామున తనిఖీ చేశారు. సిర్కాలీ రైల్వే స్టేషన్‌కు వచ్చే ముందు కోచ్ వెనుక ఉన్న అన్‌రిజర్వ్‌డ్ ప్యాసింజర్ కంపార్ట్‌మెంట్‌లోని టాయిలెట్ దగ్గర అనుమానాస్పదంగా ఉన్న రెండు బ్యాగులను గుర్తించి ప్రయాణికులను ప్రశ్నించారు. వాటు తమవి కావని చెప్పడంతో మైలాడుతురై రైల్వే స్టేషన్‌లో వాటిని దించి పరిశీలించారు. అందులో 22 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు.

బైకును ఢీకొన్న లారీ
– ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

అన్నానగర్: తిరువెన్నెనల్లూరు సమీపంలో సోమవారం ఉదయం లారీ చక్రాల్లో ఇరుక్కుని ఇద్దరు కళాశాల విద్యార్థులు మృతి చెందారు. వివరాలు.. తిరుచ్చి మనచనల్లూర్ మాధవప్పెరుమాళ్ టెంపుల్ స్ట్రీట్‌కు చెందిన రాహుల్ (19), మైలాడుదురై సమీపంలోని క్లియనూరుకు చెందిన షేక్ అల్లావుద్దీన్ కుమారుడు షఫీక్ (19). తిరుచ్చి సమయపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీకామ్ 2వ సంవత్సరం చదువుతున్నారు. ఈ నేపథ్యంలో స్నేహితుడి ఇంటి వేడుకకు హాజరయ్యేందుకు రాహుల్, షఫీక్ ఇద్దరూ శనివారం బైకులో పుదుచ్చేరికి బయలుదేరారు. కార్యక్రమం ముగించుకుని ఇద్దరూ సోమవారం తెల్లవారుజామున తిరుచ్చికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ స్థితిలో ఉదయం 6.45 గంటలకు విల్లుపురం జిల్లా తిరువెన్నెనల్లూరు సమీపంలోని ఇరువేల్‌పట్టు సీడ్ ఫామ్ సమీపంలోకి రాగానే ఎదురుగా సిమెంట్ మిక్స్‌తో వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసేందుకు యత్నించారు. అప్పుడు అనూహ్యంగా బైకుని లారీ ఢీకొట్టింది. ఇందులో రాహుల్, షఫీక్ కిందపడి లారీ చక్రంలో చిక్కుకున్నారు. రెప్పపాటు సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరూ నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం గురించి తెలుసుకున్న తిరువెన్నెనల్లూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సెల్వరాజ్ రాహుల్, షఫీక్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ముండియంబాక్కం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నామక్కల్‌కు చెందిన లారీ డ్రైవర్ అరుల్(30)ని అరెస్టు చేసి ప్రశ్నిస్తున్నారు.

3 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం


పట్టుబడిన రేషన్ బియ్యం

అన్నానగర్: కోవిల్‌పట్టి సమీపంలోని తోటలో కేరళకు తరలించేందుకు నిల్వ ఉంచిన 3 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తూత్తుకుడి పౌరసరఫరాల క్రైమ్ ఇన్వెస్టిగేషన్ విభాగానికి అందిన సమాచారం మేరకు ఇన్‌స్పెక్టర్ అల్బిన్ బ్రిగిట్టే మేరీ, ఏటుక్కుల్ కందసుబ్రమణియన్, పూలయ్య నాగరాజన్ నేతృత్వంలోని పోలీసులు సవలప్పరి-కోవిల్‌పట్టి బైపాస్ రోడ్డుపై ఆదివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో వెల్లలంగొట్టాయికి చెందిన ఉచ్చిమగలి (40) ఆ ప్రాంతంలోని తోటలో బియ్యం బస్తాలు నిల్వ ఉంచినట్లు తెలియడంతో అక్కడికి వెళ్లి ప్రశ్నించారు. ఒక్కొక్కటి 40 కిలోల బరువున్న 75 బస్తాల్లోని మొత్తం 3 టన్నుల రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు గుర్తించి నిందితుడిని అరెస్టు చేశారు. విచారణలో నిందితుడు తిరుమంగళకురిచ్చికి చెందిన మురుగన్, ఈశ్వరన్‌తో కలిసి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కేరళకు అక్రమంగా తరలించేందుకు నిల్వ చేసినట్లు తేలింది. దీంతో తూత్తుకుడి సివిల్ సప్‌లై అండ్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ పోలీసులు ఉచ్చిమకలి, మురుగన్, ఈశ్వరన్‌పై కేసు నమోదు చేశారు. ఉచ్చిమగలిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 3 టన్నుల రేషన్ బియ్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. మురుగన్, ఈశ్వరన్ కోసం కూడా గాలిస్తున్నారు.

నకిలీ నోట్ల తయారీ కేసులో ముగ్గురు మైనర్ల అరెస్టు

అన్నానగర్: వేదారణ్యంలో నకిలీ 200, 100 రూపాయల నోట్లను తయారు చేస్తున్న ముగ్గురు మైనర్లను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి స్కానింగ్ మిషన్, కంప్యూటర్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. నాగై జిల్లా వేదారణ్యం సమీపంలోని కతారిపురంలో ముగ్గురు వ్యక్తులు నకిలీ నోట్లను తయారు చేసి చెలామణి చేస్తున్నట్లు పోలీసు సూపరింటెండెంట్ హర్ష్‌సింగ్‌కు రహస్య సమాచారం అందింది. దీంతో వేదారణ్యం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుభాష్ చంద్రబోస్, గరియాపట్నం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పశుపతి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వేదారణ్యం ప్రాంతానికి చెందిన 14, 15, 16 ఏళ్ల వయసున్న ముగ్గురు బాలురను అదుపులోకి తీసుకుని విచారించారు. కతారిపులంలో బంధువుకు చెందిన స్టూడియోలో 200, 100, 50, 20 రూపాయల నోట్లను స్కాన్ చేసి కంప్యూటర్ ద్వారా నకిలీ నోట్లను ముద్రించి చెలామణి చేసినట్లు తేలింది. తర్వాత నకిలీ నోట్లు, స్కానింగ్ మిషన్‌ని, కంప్యూటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కరియాపట్నం పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురు బాలురను అరెస్టు చేశారు.

ఉరివేసుకుని పారిశ్రామికవేత్త ఆత్మహత్య

అన్నానగర్: కరుంగల్ సమీపంలో ఆదివారం రాత్రి ఓపారిశ్రామికవేత్త ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. కన్యాకుమారి జిల్లా కరుంగల్ సమీపంలోని నెడియవిలకం ప్రాంతానికి చెందిన తంబిదురై సొంత ట్రక్కులతో వ్యాపారం చేస్తున్నాడు. ఇతనికి స్మైలీన్ ప్రభుదాస్ (32) అనే కుమారుడు ఉన్నాడు. తండ్రి నడుపుతున్న ట్రక్కుతో వ్యాపారంలో బాధ్యతలు నిర్వర్తించేవాడు. అతను ఆల్డ్రిన్ ఎస్తేర్ బాయ్ (29)ని వివాహం చేసుకున్నాడు. ఇతనికి ఐదేళ్ల కుమారుడు, 6 నెలల కుమార్తె ఉన్నారు. స్మైల్ ప్రభుదాస్ వ్యాపారంలో నష్టాలను చవిచూశారని, అప్పుల బాధలు ఉన్నాయని చెబుతున్నారు. దీంతో ఆయన గత కొన్ని రోజులుగా నిరుత్సాహంగా కనిపించారు. ఈ స్థితిలో ఆదివారం స్మైలీన్ ప్రభుదాస్ ఇంటిపై అంతస్తులో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది చూసిన అతని కుటుంబ సభ్యులు స్మైల్ మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. అతని భార్య ఆల్డ్రిన్ ఎస్తేర్ భాయ్ కరుంగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు స్మైల్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆచారిపాళ్యం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోలీవుడ్ టాక్స్

మాధవన్‌కు జంటగా కంగనా


నటి కంగనా రనౌత్


నటుడు మాధవన్

తమిళ సినిమా: నటుడు మాధవన్ కంగనా రనౌత్ లో క్రేజీ కాంబో నూతన చిత్రం రానుంది. అలైప్పాయుదే చిత్రం ద్వారా కోలీవుడ్‌కు కథానాయకుడిగా పరిచయమై చాక్లెట్ బాయ్‌గా గుర్తింపు పొందిన నటుడు మాధవన్. ఆ తర్వాత అన్ని రకాల పాత్రలు పోషిస్తూ ఆల్ రౌండర్‌గా రాణిస్తున్నారు. అదేవిధంగా సంచలనటిగా ముద్ర వేసుకున్న బాలీవుడ్ నటి కంగనా రనౌత్. ముఖ్యంగా తమిళంలో తలైవి చిత్రంలో దివంగత ముఖ్యమంత్రి జయలలిత పాత్రలో నటించిన పాపులర్ అయ్యారు. వీరిద్దరూ బహుభాషా నటులే. దర్శకులు గానూ అవతారం ఎత్తారు. ఇకపోతే మాధవన్, కంగనా రనౌత్ కలిసి 2011లో నటించిన హిందీ చిత్రం తాను వెడ్స్ మను మంచి విజయాన్ని సాధించింది. దీంతో ఇదే జంట మళ్లీ దానికి సీక్వెల్‌లో నటించారు. కాగా సుమారు 8 ఏళ్ల తర్వాత ఈ జంట ముచ్చటగా మూడోసారి కలిసి నటించనున్నట్లు తాజా సమాచారం. అయితే ఈ సారి ఈ జంట నటింబోతోంది తమిళ చిత్రంలో కావడం విశేషం. ఈ చిత్రాన్ని ట్రైడెంట్ ఆర్ట్స్ సంస్థ అధినేత రవీంద్రన్ పాన్ ఇండియా స్థాయిలో నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. కాగా అయోధ్ది చిత్రంతో దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకున్న మూర్తి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి పనిచేసే ఇతర నటీనటులు, సాంకేతిక వర్గం ఎంపిక జరుగుతున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

నయన్ ఫిట్ నెస్ రహస్యం అదే..!


నటి నయనతార

తమిళ సినిమా: సంచలనం అన్న పదానికి మారు పేరు నయనతార అనవచ్చు. ఎక్కడో కేరళా రాష్ట్రంలోని మారుమూల గ్రామంలో పుట్టి, పలు ఆశనిరాశల మధ్య నటిగా మారి, అవమానాలు, విమర్శల నడుమ కథానాయకిగా ఎదిగి, ఇప్పుడు క్రేజీ ఇండియన్ హీరోయిన్‌గా వెలిగొందుతున్నారు. దక్షిణాది సినీ పరిశ్రమంలో అత్యధిక పారితోషికం డిమాండ్ చేస్తున్న లేడీ సూపర్ స్టార్ ఈమె. నాలుగు పదుల వయసును టచ్ చేయనున్న నయనతార ఇప్పటికీ అందులో, ఫిట్‌నెస్‌లో తగ్గేదేలే అన్నట్లు సాగుతున్నారు. పెళ్లి చేసుకుని ఇద్దరు కవల పిల్లలకు తల్లి (సరోగసీ విధానం ద్వారా) అయినా నయనతార ఇప్పటికీ కథానాయకిగా నటిస్తూనే ఉన్నారు. అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్న ఈ బ్యూటీ ఫిట్‌నెస్ రహస్యం వివరాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అవేంటో చూద్దాం. నయనతార బరువు తగ్గడానికి, ఫిట్నెస్‌గా ఉండటానికి కారణం జిమ్ వర్కౌట్స్, యోగలే. ముఖ్యంగా నయనతార ఫిట్‌నెస్‌కు యోగా బాగా ఉపకరించింది. అందుకే ఈమె నిత్యం రెండు గంటలు యోగ చేస్తారట. ఇక ఈమె డైట్ ప్లానింగ్‌లో కచ్చితంగా కొబ్బరినీళ్లు ఉండాల్సిందేనట. ఇక ఉదయం అల్పాహారంలో పళ్ల రసం కంపల్సరీ. పళ్లరసం బరువును తగ్గించడంతోపాటు ఎనర్జీ పెరగడానికి దోహదపడుతుందట. ఇక మధ్యాహ్నం భోజనంలో నాన్ వెజ్, గుడ్డు, కాయగూరలు సమపాళ్లలో తీసుకుంటారట. ముఖ్యంగా కార్బోహైడ్రేట్ కలిగిన పదార్థాలను దూరంగా పెడతారట ఇకపోతే రోజుకు 8.00 గంటలు నిద్రపోవడమనే అలవాటును పాటిస్తారట. మంచి నిద్రవల్ల కూడా బరువు తగ్గుతుందట. కాగా ప్రస్తుతం ఈమె హిందీలో షారుక్ ఖాన్ జంటగా జవాన్ తో పాటు టెస్ట్, ఇరైవన్ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.

విజయ్ 68వ చిత్రం టైటిల్ ఇదేనా?


విజయ్‌తో దర్శకుడు వెంకట్ ప్రభు

తమిళ సినిమా: స్టార్ కథానాయకుల చిత్రాలు ప్రారంభం కాక ముందు నుంచే ప్రచారం హోరెత్తుతుందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. నటుడు విజయ్ కొత్త చిత్రం గురించి ఇలానే రోజుకో వార్త సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. ప్రస్తుతం ఈయన లియో చిత్రంలో నటిస్తున్నారు. లోకేష్ కనకరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సెవెన్ స్క్రీన్ స్టూడియో పతాకంపై ఎస్ఎస్ లలిత్ కుమార్ భారీ బడ్జెట్లో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. నటి త్రిష, ప్రియా ఆనంద్ నాయకలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. చిత్ర షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. లియో చిత్రం దీపావళికి థియేటర్లో విడుదల చేయడానికి ముస్తాబవుతోంది. దీంతో విజయ్ తన 68వ చిత్రానికి రెడీ అయిపోతున్నారు. దీనికి పలు దర్శకులు క్యూలో ఉండగా అనూహ్యంగా వెంకట్ ప్రభు పేరు ముందుకు రావడం విశేషం. ఇందులో నటి త్రిష మరోసారి విజయ్‌తో జతకట్టనున్నట్లు ప్రచారం జరుగుతున్నా అధికారికంగా వెల్లడికాలేదు. ప్రస్తుతం దర్శకుడు వెంకట ప్రభు ఇందులో నటించే నటీనటులు సాంకేతిక వర్గం ఎంపికపై దృష్టి పెట్టినట్లు సమాచారం అయితే ఈ చిత్రంలో విజయ్‌కు విలన్‌గా నటుడు ఎస్ జే.సూర్యను నటింపజేయడానికి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఇది తండ్రి కొడుకుల మధ్య అభిప్రాయ భేదాలు నేపథ్యంలో సాగే ఈ కుటుంబ కథా చిత్రంగా ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన కథా చర్చలు చెన్నై సముద్ర తీరంలోని ఒక స్టార్ హోటల్లో జరుగుతున్నట్లు సమాచారం. మరో విషయం ఏమిటంటే ఈ చిత్రానికి క్రికెట్ క్రీడకు సంబంధించిన పేరును నిర్ణయించాలని భావిస్తున్నట్లు, ఆ విధంగా దీనికి సీఎస్‌కే అనే పేరు పెట్టారని భావిస్తున్నట్లు తెలిసింది. దీనికి నటుడు విజయ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే అధికారికంగా వెల్లడించాలని చిత్ర యూనిట్ భావిస్తున్నట్లు సమాచారం. సీఎస్‌కే పేరు బయటకు రావడంతో విజయ్ అభిమానులు ఆనందాల్లో మునిగి తేలుతున్నారు.


థియేటర్లో పిల్లలతో నటుడు హిప్ హాప్ తమిళా ఆది

బాలల కోసం వీరన్

తమిళ సినిమా: సత్య జ్యోతి ఫిలిమ్స్ పతాకంపై టీజీ త్యాగరాజన్ సమర్పణలో సెంథిల్ త్యాగరాజన్ అర్జున్ త్యాగరాజన్ నిర్మించిన తాజా చిత్రం వీరన్. నటుడు, సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళా ఆది కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి మరకతమణి చిత్రం ఫేమ్ ఏఆర్ కె.శరవణ్ కథా, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించారు. ఈ నెల 2వ తేదీన విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. కాగా నేటివిటీ సూపర్ హీరో కథతో రూపొందిన ఈ చిత్రంలో పిల్లలు ఆలరించే పలు సన్నివేశాలు చోటు చేసుకోవడంతో వీరన్ చిత్రాన్ని ఆదివారం చెన్నైలో పిల్లల కోసం ప్రత్యేకంగా ప్రదర్శించారు. 80 మంది పైగా పిల్లలు చిత్రాన్ని చూసి ఈలలు వేస్తూ ఆనందించారని యూనిట్ వర్గాలు సోమవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రదర్శనకు చిత్ర కథానాయకుడు హిప్ హాప్ తమిళ ఆది, దర్శకుడు శరవణ్ తదితరులు విచ్చేశారు. ముఖ్యంగా నటుడు హిప్ హాప్ తమిళ ఆది పిల్లలతో కొంచెం సేపు ముచ్చటించారు. చిత్రం గురించి అభిప్రాయాలను అడిగి తెలుసుకుని వారితో ఫొటోలు దిగి సంతోషపరిచారు. ఈ సందర్భంగా వీరం చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు మంచి సమీక్షలు రాసిన విలేకరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సహజీవనం ఇతివృత్తంగా పానీపూరి

తమిళ సినిమా: ఇప్పుడు సమాజంలో ఎక్కువగా వినిపిస్తున్న మాట లీవ్ ఇన్ రిలేషన్ షిప్ (సహజీవనం). ఇలాంటి కథలతో ఇప్పటికే పలు చిత్రాలు, వెబ్ సిరీస్ వచ్చాయి. తాజాగా పానీపూరి పేరుతో మరో వెబ్ సిరీస్ విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు బాలాజీ వేణుగోపాల్ రూపొందిస్తున్న ఈ వెబ్ సిరీస్‌ను ఫుల్ హౌస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ నిర్మించింది. నటుడు లింగా, చాంబిక, ఇళంగో కుమరవేల్, కనిక, వినోద్ సాగర్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. నవనీత్ సుందర్ సంగీతం, ప్రవీణ్ బాలు ఛాయాగ్రహణం అందించిన ఈ వెబ్ సిరీస్ గురించి దర్శకుడు బాలాజీ వేణుగోపాల్ తెలుపుతూ లీవ్ ఇన్ రిలేషన్ షిప్ ఇతివృత్తంతో ఇంతకు ముందు వచ్చిన చిత్రాలు, వెబ్ సిరీస్‌ల కంటే ఈ పానీపూరి వెబ్ సిరీస్ పూర్తి భిన్నంగా ఉంటుందని చెప్పారు. ఒక ఫ్లాట్‌లో నివసిస్తున్న స్నేహితుల మధ్య లీవ్ ఇన్ రిలేషన్ షిప్ ఏర్పడుతుందన్నారు. అయితే వారికి ప్రకృతి ఆటంకంగా నిలుస్తుందన్నారు. అది ఎలాంటిది? దాని వల్ల వారు ఎదుర్కొనే సవాళ్లు ఏమిటి? చివరికి ఏమైంది అన్న పలు ఆసక్తికరమైన అంశాలతో సాగే వెబ్ సిరీస్ పానీపూరి అని తెలిపారు. ఈ వెబ్ సిరీస్ నిర్మాణ కార్యక్రమాలు దాదాపు పూర్తయ్యాయని, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఇది ఉంటుందన్నారు. షార్ట్ ఫ్లిక్స్ అనే ఓటీటీ ప్లాట్‌ఫారం ద్వారా త్వరలో ఇది త్వరలోనే స్ట్రీమింగ్ కానుందని తెలిపారు.


పానీపూరి వెబ్ సిరీస్ యూనిట్ సభ్యులు

క్లుప్తంగా

ఇద్దరు ఎస్ఐలు, నలుగురు కానిస్టేబుళ్ల బదిలీ

తిరువొత్తియూరు: సారా వ్యాపారులతో సంబంధాలు కలిగి ఉన్న ఇద్దరు ఎస్ఐలు, నలుగురు పోలీసు కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపత్తూరు తాలూకా పోలీస్‌స్టేషన్‌లోని స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర్లు శివాజీ, వెన్నెల, హెడ్ కానిస్టేబుల్ వసంత ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై సరైన చర్యలు తీసుకోవడం లేదని, సారా వ్యాపారులతో కుమ్మక్కైనట్టు ఎస్పీ ఆల్బర్ట్‌జాన్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ఆయన విచారణ చేపట్టి ముగ్గురిని సాయుధ బలగాలకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా వాణియంబాడి ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డివిజన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ గోపి కూడా మద్యం వ్యాపారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడైంది. అనంతరం అతడిని సాయుధ విభాగానికి బదిలీ చేస్తూ ఎస్పీ ఆదేశించారు.

తిరువళ్లూరులో భారీ వర్షం

తిరువళ్లూరు: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడడంతో పలు చోట్ల విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా మూడు నెలల నుండి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. సుమారు 30 నిమిషాల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో బజారువీధి, తేరడి, వీరరాఘవుడి ఆలయంతో పాటు పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాకలూరులో విద్యుత్ స్తంభాలపై చెట్లు కూలిపోవడంతో దాదాపు మూడు గంటల పాటు సరఫరా నిలిపి వేశారు. ఇదే విధంగా ఈకాడు, సేలై, తిరుప్పాచ్చూర్, పుల్లరంబాక్కం, పాండూరు, పూండి, తామరపాక్కం తదితర ప్రాంతాల్లో భారీ ఈదురు గాలితో కూడిన వర్షం పడింది.

కత్తితో బెదిరించి బంగారు చైన్ దోపిడీ

తిరువొత్తియూరు: సబ్బిన్ ఇన్‌స్పెక్టర్ భార్యను కత్తితో బెదిరించి ఎనిమిది సవర్ల బంగారు చైన్‌ను దోపిడీ చేసిన ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు. తిరువారూరు జిల్లా ముత్తుపేట సమీపంలో ఈసీఆర్ రోడ్డు ప్రాంతానికి చెందిన వారు కండనయూర్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఉన్నారు. ఆయన శనివారం విధులకు వెళ్లారు. ఇంటిలో అతని భార్య సంగీత, కుమార్తె సింధు ఉన్నారు. తల్లి, కుమార్తె ఇంటిమాట్లాడుతూ ఉండగా మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు ఇంటిలోకి చొరబడి సంగీతను కత్తితో బెదిరించి ఆమె మెడలో ఉన్న ఎనిమిది సవర్ల బంగారు చైను లాక్కుని పారిపోయారు. పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు.

అన్న హత్య కేసులో తమ్ముడికి యావజ్జీవం

తిరువొత్తియూరు: చెన్నై కొలత్తూరులో అన్నను హత్య చేసిన తమ్ముడికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. చెన్నై కొలత్తూరు కామరాజర్ నగరకు చెందిన పళని, తమిళ్ సెల్వన్ అన్నదమ్ములు. పళని వివాహమై కుటుంబంతో ఇంటి కింది పోర్షన్‌లో ఉంటున్నాడు. తమిళ్ సెల్వన్‌కు ఇంకా వివాహం కాలేదు. ఈ క్రమంలో అన్న, తమ్ముడికి కొన్నేళ్లుగా ఆస్తి పంపకాలపై గొడవలు జరుగుతున్నాయి. 2021 ఫిబ్రవరి 8వ తేదీ పళని, తమిళ్ సెల్వన్ గొడవ పడ్డారు. ఆగ్రహం చెందిన తమిళ్ సెల్వన్ కత్తితో అన్న పళనిపై దాడి చేసి హత్య చేశాడు. ఈ కేసు చెన్నై జిల్లా ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరుగుతూ వచ్చింది. పోలీస్‌ల తరఫున కార్పొరేషన్ న్యాయవాది జి.దేవరాజన్ హాజరై వాదనలు వినిపించారు. తమిళ్ సెల్వన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

సెంగోల్ ఏర్పాటు గర్వకారణం



మాట్లాడుతున్న సయ్యం మెహ్రా, రాజేష్ రాక్తే

కొరుక్కుపేట: నూతన పార్లమెంట్ భవనంలో సెంగోల్ (రాజ దండం) ఏర్పాటు చేయడం దేశానికే గర్వకారణమని ఆలిండియా జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసి) చైర్మన్ సయ్యం మెహ్రా తెలిపారు. చెన్నైలో సోమవారం కౌన్సిల్ ఆధ్వర్యంలో లాభం సెమినార్, జీజేసీ జ్యువెలర్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సెంగోల్‌ను రూపొందించిన ఉమ్మిడి బంగారు శెట్టి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో సయ్యం మెహ్రా మాట్లాడుతూ కొత్త పార్లమెంటులో సెంగోల్ ఏర్పాటు చేయడం చాలా సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిల్ వైస్ చైర్మన్ రాజేష్ రాక్తే, లాభం సదస్సు కన్వీనర్ సాహిల్ మెహ్రా, డైరెక్టర్ అశోక్ జైన్ పాల్గొన్నారు.

నలుగురి అరెస్ట్

తిరుత్తణి: కల్తీసారా తరలించిన నలుగురిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని విల్లుపురం, చెంగల్పట్టు జిల్లాల్లో ఇటీవల కల్తీసారా తాగి ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కల్తీసారాను అరికట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చర్యలు చేపట్టింది. ఎస్పీ సిబాస్ కల్యాణ్, డీఎస్పీ విఘ్నేష్ ఆధ్వర్యంలోని బృందం ఆంధ్రా సరిహద్దులోని నల్లాట్టూరు, అరుంగలం, చివ్వాడ, నెమిలి, ఎస్.ఎస్.కండ్రిగ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నగరి నుంచి సారా తరలించిన తిరువళ్లూరుకు చెందిన కదిరవన్, అరక్కోణంకు చెందిన హరి, చివ్వాడకు చెందిన వరదరాజ్, మిట్టకండ్రిగ శ్రీనివాసన్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

కారు, వ్యాన్ ఢీ



ప్రమాదానికి గురైన కారు

- ఇద్దరు మృతి
- ఆరుగురుకి తీవ్ర గాయాలు

అన్నానగర్: కరూర్ సమీపంలో ఆదివారం సాయంత్రం కారు, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ సహా ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని చిన్న కరుప్పూర్ గ్రామానికి చెందిన గౌతమన్ (56), అతని భార్య మాల (50). వీరికి కుమారుడు ఆకాష్ (21), ఓ కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో గౌతమన్, మాల, ఆకాష్, వారి బంధువులు గౌరి(48), తిరువారూరులోని నన్నిలం తూర్పు వీధి పూల తోటకు చెందిన హరిదాస్ (53), రాజేశ్వరి (45), హేమలత (54) కోయంబత్తూరు జిల్లా సూలూరులో గౌతమన్ కుమార్తెకు పెళ్లికొడుకును చూడటానికి వెళ్లారు. సూలూరులో వరుడిని చూసి అనంతరం ఏడుగురు ఒకే కారులో ఆదివారం కుంభకోణానికి బయలుదేరారు. గౌతమన్ కారు నడుపుతున్నాడు. కరూర్ జిల్లా పరమతి సమీపంలోని లక్ష్మీపురం వద్ద కరూర్ - కోయంబత్తూరు జాతీయ రహదారిపై కారు రాగానే ఎదురుగా వస్తున్న కార్గో వ్యాన్, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు శిథిలాలలో చిక్కుకున్న గౌతమన్, గౌరి అక్కడికక్కడే మృతి చెందారు. తిరుపూర్ జిల్లాకు చెందిన మాల, ఆకాష్, హరిదాస్, రాజేశ్వరి, హేమలత, ప్రిన్స్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కె.పరమతి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని అంబులెన్స్‌లో కరూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. అనంతరం గౌతం, గౌరి మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కరూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కె.పరమతి పోలీస్ ఇన్‌స్పెక్టర్ మురుగేశన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌కు రూ.200 డిమాండ్

తిరుత్తణి: ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వడానికి తిరుత్తణి ప్రభుత్వాసుపత్రి డాక్టర్ రూ.రెండు వందలు డిమాండ్ చేయడం వివాదాస్పదంగా మారింది. తిరుత్తణి ప్రభుత్వాసుపత్రిలో అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సునీతను ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం సోమవారం తిరుత్తణి డాక్టర్ రాధాకృష్ణనన్ వీధికి చెందిన దినకరన్ కుమారుడు యువరాజ్ కలిశారు. డాక్టర్ అప్లికేషన్ పూర్తిచేసి సంతకాలు పెట్టి సీల్‌వేసి రూ.రెండు వందలు అడగడంతో యువరాజ్ విస్తుపోయాడు. డబ్బు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించడంతో డాక్టర్ సంతకం పెట్టిన అప్లికేషన్ ఇవ్వకుండా తిప్పిపంపింది. యువరాజ్ ఇంటికి వెళ్లి విషయాన్ని తండ్రికి చెప్పాడు. అతను ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధికాదేవికి ఫిర్యాదు చేశారు. సర్టిఫికెట్లు ఇవ్వడం డాక్టర్లకు సంబంధించిందని, ఇందులో తాము చేసేదేమి లేదని, డబ్బులు అడిగితే ఇవ్వాల్సిందేనని డాక్టర్ రాధికాదేవి చెప్పడంతో ఏమి చేయాలో తెలియక అతను ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాడు.

అదుపు తప్పి దూసుకెళ్లిన కారు

- ఇద్దరి మృతి

అన్నానగర్: త్యాగదురుగం సమీపంలో ఆదివారం అదుపుతప్పిన కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కళ్లకురిచ్చి జిల్లా శంకరాపురం సమీపంలోని చట్టపుత్తూరు గ్రామానికి చెందిన గణపతి (58) బార్బర్. ఇతను పని మీద ఆదివారం త్యాగదుర్గానికి వెళ్లి చట్టపుత్తూరుకు తిరిగి వస్తున్నాడు. ఆ సమయంలో పీలమేడు బస్టాప్ దగ్గరకు వెళ్లేసరికి తిరువణ్ణామలై నుంచి త్యాగదుర్గం వైపు వస్తున్న కారు అదుపు తప్పి గణపతి స్కూటీని ఢీకొట్టింది. ఆగకుండా రోడ్డుపక్కన నిల్చున్న చిన్నసేలం కరియనూర్‌కు చెందిన ప్రభు భార్య సోనియా(33)పై దూసుకెళ్లింది. చివరికి ఓ చింతచెట్టును ఢీకొట్టి కారు ఆగిపోయింది. డ్రైవర్ పారిపోయాడు. అంతలోనే తీవ్రంగా గాయపడిన గణపతి, సోనియా అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం గురించి తెలుసుకున్న త్యాగతురుగం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. గణపతి భార్య కావేరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కారు డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.



సదస్సు

భారత దేశ 75వ స్వాతంత్ర్య దినోత్స వేడుకల్లో భాగంగా కేంద్ర గనులు, ఉక్కుమంత్రిత్వ శాఖ నేతృత్వంలో ఆజాది కా అమృత్ మహోత్సవ్ - ఆర్థిక ప్రగతి ప్రచారం 2023 పేరిట చెన్నైలో సదస్సు నిర్వహించారు. గనుల శాఖ సంయుక్త కార్యదర్శి యూసీ జోషి, ఉక్కు శాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ రాయ్, తమిళనాడు పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి పూజా కులకర్ణి, ఆయా విభాగాల ప్రతినిధులు సంజయ్ మోహతా, డాక్టర్ అనుపమ్ అగ్ని హోత్రి, డాక్టర్ మోహన్ అగర్వాల్ తదితరులు హాజరై పునరుత్పాదక శక్తి, ఆర్థిక వ్యవస్థ పరిరక్షణ, ఉక్కు ఉత్పత్తుల గురించి చర్చించారు. - సాక్షి, చెన్నై

న్యాయం చేయాలని నేలపై కూర్చుని మహిళ నిరసన



కుమారుడితో కలిసి ధర్నా చేస్తున్న మహిళ

వేలూరు: భర్త వేరొక యువతిని పెళ్లి చేసుకుని తనను, తన కుమారుడిని పట్టించుకోలేదని, న్యాయం చేయాలని కోరుతూ మహిళ సోమవారం వేలూరు కలెక్టరేట్‌లో నేలపై కూర్చుని నిరసన తెలిపింది. కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అధ్యక్షతన గ్రీవెన్ సెల్ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. వాటిపై కలెక్టర్ తాలూకా స్థాయి అధికారులతో మాట్లాడి న్యాయం చేయాలని ఆదేశించారు. అదే సమయంలో ఒడుగత్తూరు సమీపంలోని పెరిఏరివూరు గ్రామానికి చెందిన వేందామణి తన కుమారుడితో కలిసి గ్రీవెన్ సెల్ జరుగుతున్న గదికి చేరుకున్నారు. నేలపై కూర్చొని ధర్నాకు దిగింది. పోలీసులు ఆమెను అధికారుల వద్దకు తీసుకెళ్లారు. విచారణలో తన భర్త ఒక యువతిని వివాహం చేసుకుని తనను మోసం చేశాడని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరింది. విచారణ జరిపి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆమె ఆందోళన విరమించింది.

జిల్లాలో పది లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

వేలూరు: జిల్లా వ్యాప్తంగా పది లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు కలెక్టర్ కుమరవేల్ పాండియన్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వేలూరు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ పాఠశాల మైదానంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటాలని ఆదేశించారు. అదే విధంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు విధిగా ఒక మొక్క నాటుతామనే ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వాగులు, వంకలతో పాటు రోడ్డుకు ఇరు వైపులా మొక్కలు నాటడం వల్ల రానున్న తరానికి ఆరోగ్యకరమైన గాలిని అందించవచ్చన్నారు. ఇందులో అటవీశాఖ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ మణివన్నన్, ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, విద్యాశాఖ సీఈఓ మునస్వామి, అటవీ శాఖ అధికారి సుజాత, జిల్లా ఫారెస్ట్ అధికారి కళానిధి, అసిస్టెంట్ ఫారెస్ట్ రేంజర్ మణివన్నన్ పాల్గొన్నారు.

కుమార్తెకు లైంగిక వేధింపులు

- తండ్రి అరెస్టు..

అన్నానగర్: కోయంబత్తూరులో ఇంట్లో ఒంటరిగా ఉన్న కాలేజీ విద్యార్థినిని లైగింక వేధించిన తండ్రిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. కోయంబత్తూరుకు చెందిన 19 ఏళ్ల యువతి ఓ ప్రైవేట్ కాలేజీలో ప్లస్-2 చదువుతోంది. ఈమె తండ్రి కూలి పని చేస్తున్నాడు. కొన్ని నెలల క్రితమే మద్యానికి బానిసయ్యాడని, గంజాయికి కూడా అలవాటు పడ్డాడని తెలుస్తోంది. దీంతో రోజూ పని ముగించుకుని ఇంటికి రాగానే మద్యం తాగి వచ్చి భార్యాపిల్లలతో గొడవ పడేవాడు. ఈ స్థితిలో కళాశాలలో చదువుతున్న 19 ఏళ్ల విద్యార్థిని మాత్రమే ఈనెల 1వ తేదీన ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. మద్యం మత్తులో ఇంటికి వచ్చిన విద్యార్థిని తండ్రి కూతురు అని కూడా చూడకుండా లైగింక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో షాక్‌కు గురైన విద్యార్థిని తల్లి రాగానే తనకు జరిగిన దారుణం గురించి చెప్పింది. భార్య ప్రశ్నించడంతో కత్తితో పొడిచేందుకు ప్రయత్నించాడు. చివరికి బాధితురాలి ఫిర్యాదుతో 5 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నిందితుడిని స్థానిక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.

రెండు కిలోల బంగారు నగల స్వాధీనం

తిరువొత్తియూరు: చెన్నైలో పోలీసులు రెండు కిలోలు బంగారు నగలను స్వాధీనం చేసుకుని, ఆటోలో వచ్చిన యువకుడిని విచారిస్తున్నారు. చెన్నై వ్యాసార్పాడి ఎరుకన్జేరి హైవే రోడ్డులోని అంబేద్కర్ కళాశాల ఎదురుగా శనివారం రాత్రి ఎంఎంకేబి నగర్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ముత్తురాజు నేతృత్వంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఆటోను నిలిపి తనిఖీ చేయగా డ్రైవర్ పొంతన లేని సమాధానాలిచ్చాడు. క్షుణ్ణంగా పరిశీలించగా ఆటోలో రెండు కిలోల బంగారు నగలు ఉన్నట్లు గుర్తించారు. వాటికి తగిన ఆధారాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో వెళుతున్న వ్యక్తి రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రామ్ (24) అని తెలిసింది. చెన్నై సౌకర్ పేటలో ఉంటున్నట్లు గుర్తించారు. ఆంధ్ర రాష్ట్రం నెల్లూరు నుంచి బంగారు నగలను తీసుకుని వస్తున్నట్లు అతను చెప్పాడు. పోలీసులు నగలను నుంగంపాక్కంలో ఉన్న ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించారు.

మహిళలకు అవగాహన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ మణివన్నన్

వేలూరు: వేలూరు వేలపాడికి చెందిన ఆల్‌బ్రెట్ వినోద్(32) ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతను మహిళా సంరక్షణ కోసం బొమ్మ మిక్కీ మౌస్ వేషం ధరించి కరపత్రాల ద్వారా పలుచోట్ల అవగాహన కల్పిస్తున్నారు. వేలూరు కొత్త బస్టాండ్‌లో సోమవారం ఉదయం అవగాహన ప్రచార యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రను ఎస్పీ మణివన్నన్ ప్రారంభించి ఆల్‌బ్రెట్ వినోద్‌ను అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆడ పిల్లలకు తల్లిదండ్రులు మంచి, చెడులను తెలియజేయాలన్నారు. సెల్‌ఫోన్ అవసరానికి మాత్రమే ఉపయోగించాలన్నారు. మన అవసరాలను ఇతరులు తెలుసుకుంటే వారు మనల్ని ఉపయోగించుకుంటారన్నారు. దుస్తులు, ఆభరణాలను అందాల కోసమే ఉపయోగించాలని, అవి మనకు ప్రమాదంగా ఉండకూడదన్నారు. గ్యాస్, విద్యుత్ వస్తువులు ఉపయోగించే సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించడం నిషేధించాలన్నారు. మహిళా సంరక్షణ కోసం ప్రతి విద్యార్థినీ పోలీస్ స్టేషన్ నంబర్‌లను నమోదు చేసి పెట్టుకోవాలన్నారు.

లారీ చక్రం కింద చిక్కుకుని యువకుడి దుర్మరణం

తిరువొత్తియూరు: చెన్నై కోయంబేడులో లారీ చక్రం కింద చిక్కుకొని యువకుడు దుర్మరణం చెందాడు. అతని స్నేహితుడికి తీవ్రగాయాలయ్యాయి. మేల్ మాలయనూరుకు చెందిన భూపతి (27), అతని స్నేహితుడు ముత్తు పాండి (25) కోయంబేడులో ఉంటూ అంబత్తూర్‌లో ఉన్న ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి పని ముగించుకుని ఇద్దరు తమ గదికి రావడానికి మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. ముత్తుపాండి బైక్‌ను నడుపుతున్నాడు. భూపతి వెనక కూర్చుని ఉన్నాడు. కోయంబేడు వంద అడుగుల రోడ్డులో ఉన్న కొత్త వంతెనపై ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో బైక్ అదుపుతప్పి కింద పడటంతో లారీ చక్రం మోటారు సైకిల్‌పై దూసుకెళ్లింది. వారి కాళ్లపై లారీ చక్రం ఎక్కి దిగింది. వెంటనే స్థానికులు ఇద్దరినీ బయటకు తీసి కీల్పాక్కం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. భూపతి మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ముత్తుపాండికి ఆసుపత్రిలో తీవ్ర చికిత్స చేస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కంటైనర్ లారీ ఢీకొని డ్రైవర్ మృతి

తిరువొత్తియూరు: చెన్నై హార్బర్‌లో కంటైనర్ లారీ ఢీకొని మరో కంటైనర్ లారీ డ్రైవర్ మృతి చెందాడు. అలాగే రెడ్ హిల్స్ వద్ద రోడ్డుపై నిలబడి ఉన్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. తిరువూరుకు చెందిన సెంథిల్ కుమారు (50) కంటైనర్ లారీ డ్రైవర్. ఇతను చెన్నై హార్బర్‌లో కంటైనర్ లారీని నిలిపి పక్కన నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన మరొక కంటైనర్ లారీ అతని ఢీకొట్టడంతో మృతి చెందాడు. పోలీసులు కంటైనర్ లారీ డ్రైవర్ కన్నన్ (45)ను అరెస్టు చేశారు. అలాగే రెడ్ హిల్స్ సమీపం లక్ష్మీపురం ప్రాంతంలో బాబు (40) మురుగు నీటి లారీ డ్రైవరు. ఇతను ఆదివారం తెల్లవారుజామున కాటూరు చిట్కో వద్ద కొండలూరు బైపాస్ 400 రోడ్డులోకి లారీని తీసుకెళ్లాడు. తర్వాత లారీలో నీటిని బయటకు పోయడానికి వెనకకు తీశారు. ఆ సమయంలో రోడ్డు పక్కన నిలబడి ఉన్న తిరువణ్ణామలైకి చెందిన ఇలవరసన్ (21)ని లారీ ఢీకొంది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఆవడి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి లారీ డ్రైవరు బాబును అరెస్టు చేసి విచారణ చేస్తూ ఉన్నారు.

బావిలో పడి యువకుడి మృతి

అన్నానగర్: దిండుక్కల్ సమీపంలో సోమవారం బావిలో జారి పడి ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. దిండుక్కల్ సమీపంలోని పొన్మందురై నల్లేంద్రపురంకి చెందిన నట్రాయన్ కార్మికుడు. ఇతని కుమారుడు గౌతమ బుద్ధుడు (18). ఇతడు ఆదివారం ఇంటి నుంచి వెళ్లి అర్ధరాత్రి వరకు తిరిగి రాలేదు. వెంటనే అతని బంధువులు పలు ప్రాంతాల్లో వెతికినా అతడికి సంబంధించిన సమాచారం దొరకలేదు. దీంతో సోమవారం ఉదయం ఇంటి సమీపంలోని 40 అడుగుల లోతున్న బావిలో గౌతమ బుద్ధుడు శవంగా తేలాడు. దిండుక్కల్ అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని బావిలో నుంచి వెలికితీశారు. కాగా గౌతమ బుద్ధుడు ప్రమాదవశాత్తూ బావిలో జారి పడి మృతి చెందినట్లు తెలుస్తోంది. అనంతరం తాలూకా పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ నారాయణ , హెడ్ కానిస్టేబుల్ కరుణాకరన్‌కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.జోసెఫ్ మృతి



డాక్టర్ ఎన్ జోసెఫ్ (ఫైల్)

కొరుక్కుపేట: ప్రముఖ శాస్త్రవేత్త, తెలుగు సంఘాల్లో ఒకటైన మాస్ సంస్థ మాజీ అధ్యక్షుడు డా.ఎన్.జోసెఫ్ (83) ఇక లేరు. కొన్నేళ్లుగా వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతూ ఆదివారం చెన్నై పడూర్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య వసంత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలందరికీ వివాహాలు అయ్యాయి. డాక్టర్. ఎన్.జోసెఫ్ మాస్ సంస్థ వ్యవస్థాపక సభ్యుడిగా, అధ్యక్షులుగా ఎనలేని సేవలందించారు. చెన్నై అడయార్ లోని సీఎల్ఆర్ఐలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసి ప్రముఖ శాస్త్రవేత్తలలో ఒకరిగా ఎదిగి పదవీ విరమణ చేశారు. లెదర్ టెక్నాలజీపై అనేక పరిశోధక పత్రాలను సమర్పించి ఎన్నో అవార్డులు అందుకున్నారు. అంతేకాకుండా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సంస్థ అయిన లిడ్ క్యాప్‌కి కన్సల్టెంట్‌గా సేవలను అందించారు. ఆయన సారథ్యంలోనే కర్నూల్‌లో షూ తయారీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా మాస్ సంస్థ కోసం ఒక ట్రస్ట్‌ను ప్రారంభించి ఎస్సీ కమ్యూనిటీ యువతకు షూ తయారీలో శిక్షణలో ప్రోత్సహించాలనేది ఆయన చిరకాల వాంఛ. జోసెఫ్ మరణం మాస్ సంఘానికి తీరనిలోటని, మాస్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కొల్లి రాజు, ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి అజరతయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం 4 గంటలకు పడూర్‌లో క్రైస్తవ సంప్రదాయం ప్రకారం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

వక్ఫ్‌బోర్డు భూముల ఆక్రమణపై ఆందోళన

- 60 మంది ముస్లింల అరెస్టు



ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

తిరువళ్లూరు: సెంగుద్రం రోడ్డులో ఆక్రమణలకు గురైన వక్ఫ్‌బోర్డు భూములను స్వాధీనం చేసుకుని దర్గాకు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగిన ముస్లింలను పోలీసులు అరెస్టు చేశారు. తిరువళ్లూరు జిల్లా హైవేలీ అగరం ప్రాంతంలోని సెంగుద్రం రోడ్డులో బానుబీ దర్గా వుంది. దీని సమీపంలోనే విలువైన సుమారు 50 సెంట్ల భూమి వుంది. ఈ భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. ఆ భూమి వక్ఫ్ బోర్డుకు చెందినదిగా ఆరోపిస్తున్న ముస్లీంలు దాన్ని దర్గాకు అప్పగించాలని కోరుతూ ఆందోళన నిర్వహిస్తున్నారు. ఇంత వరకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ముస్లీంల సంఘాలు ర్యాలీగా వచ్చి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి ఆందోళనకారులతో చర్చలు జరిపి ఆందోళననూ విరమించాలని సూచించారు. వారు అంగీకరించక పోవడంతో 60 మంది ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కూవం, అడయార్ తీరాల్లో నిఘా కెమెరాలు

కొరుక్కుపేట: కూవం, అడయార్ తీరాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయం తీసుకుంది. చెన్నైలో భవనాలను కూల్చివేసే వ్యర్థాలను కాలువలు, నదుల ఒడ్డున వేస్తున్నారు. ముఖ్యంగా కూవం, అడయార్ నదుల ఒడ్డున పెద్ద మొత్తంలో నిర్మాణ వ్యర్థాలు వేస్తున్నారు. వీటిని నిరోధించేందుకు ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఇవ్వవచ్చని చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ ప్రకటించింది. నిర్మాణ వ్యర్థాలను ఎలా పారవేయాలనే దానిపై మార్గదర్శకాలను కూడా ప్రచురించారు. నిర్మాణ వ్యర్థాలను ఇష్టానుసారంగా పారవేస్తున్నారు. కూవం, అడయార్ ఒడ్డున రోజుకు దాదాపు 5,500 టన్నుల నిర్మాణ వ్యర్థాలు డంప్ అవుతున్నట్లు గుర్తించారు. పాత కూవం, అడయార్ నదుల్లో ప్రతిరోజూ 100 టన్నుల చెత్త వేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతోందన్నారు. చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జె.రాధాకృష్ణన్ కూవం అడయార్ ఒడ్డున నిర్మాణ వ్యర్థాలను పారబోయడాన్ని పూర్తిగా అరికట్టడంపై అధికారులతో సమాలోచనలు జరిపారు. ఆ సమయంలో కూవంలోని అడయార్ ఒడ్డున నిర్మాణ వ్యర్థాలను డంపింగ్ చేసేవారిని పట్టుకునేందుకు నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని ప్రకారం మొదటి దశలో కూవం, అడయార్ తీరాల్లో 150 నిఘా కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కెమెరా వీక్షణలు చెన్నై కార్పొరేషన్‌లోని కంట్రోల్ రూమ్‌కి అనుసంధానిస్తామని చెప్పారు.

సముదాయ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఆవడి ఎమ్మెల్యే నాజర్, పక్కన ఎమ్మెల్యే కృష్ణస్వామి

తిరువళ్లూరు: పూందమల్లి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.70 లక్షలతో నిర్మించిన సముదాయ భవనాన్ని మాజీ మంత్రి, ఆవడి ఎమ్మెల్యే నాజర్ సోమవారం ఉదయం ప్రారంభించారు. తిరువళ్లూరు జిల్లా వెల్లియూర్‌లో పూందమల్లి ఎమ్మెల్యే అభివృద్ధి నిధులు రూ.70 లక్షలతో కలైంజర్ శతజయంతి సముదాయ భవనాన్ని నిర్మించారు. పనులు పూర్తయిన నేపథ్యంలో సముదాయ భవనాన్ని సోమవారం ఉదయం ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, డీఎంకే జిల్లా కన్వీనర్ నాజర్ హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే కృష్ణస్వామి అధ్యక్షత వహించారు. నాజర్ మాట్లాడుతూ డీఎంకే అధికారంలోకి వచ్చిన తరువాత వేర్వేరు సంక్షేమ పథకాలను అమలు చేసి నిరుపేదలకు లబ్ధిచేకూర్చిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ చైర్‌పర్సన్ జయశీలిజయపాల్, వైస్ చైర్మన్ బర్థతుల్లాఖాన్, యూనియన్ కార్యదర్శి బుజ్జీరామకృష్ణన్ పాల్గొన్నారు.



క్విట్ టొబాకో

ఇండియన్ డెంటల్ అసోసియేషన్, అడయార్‌లోని క్యాన్సర్ ఇనిస్టిట్యూట్, సవిత దంత వైద్య కళాశాలల నేతృత్వంలో సోమవారం చెన్నై ఎలియట్స్ బీచ్‌లో క్విట్ టుబాకో పేరిట ర్యాలీ నిర్వహించారు. గంట పాటు జరిగిన ఈ అవగాహన ర్యాలీలో పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు విద్యార్థులు వివరించారు. - సాక్షి, చెన్నై

తల్లి, కొడుకు ఆత్మహత్య

కొరుక్కుపేట: విషవాయువు పీల్చి తల్లి, కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన ధర్మపురి సమీపంలో కలకలం రేపింది. ధర్మపురి జిల్లా ఓటపట్టి ప్రాంతానికి చెందిన పళనివేలు విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఆయనకు భార్య శాంతి (50), కొడుకు విజయ్ ఆనంద్ (30) ఉన్నారు. ఆనంద్ ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసి సొంతంగా వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో పళనివేలు బంధువు ఇంటిలో జరిగిన వివాహానికి వెళ్లి తిరిగి శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చారు. ఎంతసేపు పిలిచినా భార్య, కొడుకు తలుపులు తెరవలేదు. అనుమానంతో తలుపులు పగులగొట్టి చూడగా ఇద్దరూ మృతిచెంది ఉన్నారు. ముఖానికి ప్లాస్టిక్ కవర్లు కట్టుకుని నైట్రోజన్‌ను పీల్చి చనిపోయినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న ధర్మపురి డీఎస్పీ సెంథిల్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ నవాజ్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇంట్లో విజయ్ ఆనంద్ రాసిన లేఖను గుర్తించారు. వ్యాపారంలో స్నేహితులు రూ.25 లక్షలు మోసం చేశారని, అందువల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్టు అందులో రాశాడు.

వృద్ధుడి హత్య

- ఇద్దరు మహిళలు సహా నలుగురి అరెస్టు

తిరువొత్తియూరు: కుటుంబంలో జరిగిన ఘర్షణలో వృద్ధుడిని హత్య చేసిన కేసులో ఇద్దరు మహిళలు సహా నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మదురవాయల్ సమీపంలోని ఆలపాక్కం గోవిందప్పన్ను మొదటి వీధికి చెందిన అంగప్పన్ (65) భార్య, కుమార్తె, మేనల్లుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇతని ఇంటికి సమీపంలో సహోదరులు మురుగేశన్, మునస్వామి తదితరులు కుటుంబాలతో ఉంటున్నారు. ఈ క్రమంలో అంగప్పన్ కుటుంబానికి, అతని అన్న మురుగేషన్ కుటుంబానికి మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం అంగప్పన్ కుమార్తె విజయలక్ష్మి, మురుగేషన్ కోడలు వనిత (35) మధ్య వాగ్వాదం ఏర్పడింది. దీనిపై అంగప్పన్ ప్రశ్నించడంతో ఆగ్రహం చెందిన వనిత, ఆమె భర్త రవికుమార్ (40), వనిత సహోదరి కవిత (37), ఆమె భర్త విగ్నేష్ (35) అంగప్పన్‌పై తీవ్రంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతన్ని గెలుపాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ అతను ఆదివారం ఉదయం అతను మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న మధురవాయల్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని తీర్పాకం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇన్‌స్పెక్టర్ శివానంద కేసు నమోదు చేసి రవికుమార్, వనిత, విగ్నేశ్, కవితను అరెస్టు చేశారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థి ఆత్మహత్య

వేలూరు: వ్యవసాయ కళాశాల విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. తిరువణ్ణామలై జిల్లా వానాపురం సమీపంలోని వాయవచ్చనూరులో ప్రభుత్వ వ్యవసాయ కళాశాల, పరిశోధన కేంద్రం ఉంది. ఈ కళాశాలలో హోసూరుకు చెందిన కరుణానిధి కుమార్తె గాయత్రి(21) తృతీయ సంవత్సరం చదువుతుంది. ఈ నేపథ్యంలో గాయత్రి కళాశాల సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న వానాపురం పోలీసులు అక్కడికి చేరుకుని యువతి మృతదేహాన్ని బయటకు తీసి తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా తమ బిడ్డ మృతిపై అనుమానం ఉందని, న్యాయం చేయాలని కోరుతూ విద్యార్థిని బంధువులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. విద్యార్థిని శరీరంపై గాయాలున్నాయని, వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆసుపత్రిని ముట్టడించి ధర్నా నిర్వహించారు. పోలీసులు వారితో చర్చించి ఆందోళనను విరమింపజేశారు.



బ్రాండన్ కింగ్ సెంచరీ: విండీస్ గెలుపు

యూఏఈ జట్టుతో షార్జాలో జరిగిన తొలి వన్డేలో వెస్టిండీస్ ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. యూఏఈ నిర్దేశించిన 203 పరుగుల లక్ష్యాన్ని విండీస్ 35.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్ (112 బంతుల్లో 112; 12 ఫోర్లు, 4 సిక్స్‌) సెంచరీ చేశాడు. అంతకుముందు యూఏఈ 47.1 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటైంది. విండీస్ బౌలర్లలో కీమో పాల్ మూడు వికెట్లు తీయగా.. డ్రేక్స్, ఒడెన్ స్మిత్, యానిక్ కరియాలకు రెండు వికెట్లు చొప్పున లభించాయి.

మాపై ఎలాంటి ఒత్తిడీ లేదు: ద్రవిడ్



వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను ఎలాగైనా గెలవాలనే ఒత్తిడి తమపై లేదని, ఒక వేళ ఓడినా ఇటీవల టెస్టుల్లో సాధించిన విజయాల విలువ తగ్గదని భారత జట్టు హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ అభిప్రాయపడ్డాడు. గత రెండేళ్లుగా కష్టపడ్డారు కాబట్టి ముగింపుగా ఐసీసీ ట్రోఫీ గెలిస్తే సంతోషిస్తామని... అయితే ఆడిన ప్రతీ చోటా తమదైన ముద్ర వేయడం టీమిండియా సాధించిన ఘనతేనని ద్రవిడ్ గుర్తు చేశాడు.

సింధు సత్తాకు పరీక్ష!

నేటి నుంచి సింగపూర్ ఓపెన్ టోర్నీ

సింగపూర్: సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో టైటిల్ నిలబెట్టుకోవాలంటే భారత స్టార్ షట్లర్ పీవీ సింధు విశేషంగా రాణించాల్సి ఉంటుంది. నేడు మొదలయ్యే ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ సింధుకు తొలి రౌండ్‌లోనే కఠిన ప్రత్యర్థి ఎదురుకానుంది. ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ అకానె యామగుచి (జపాన్)తో సింధు తొలి రౌండ్‌లో ఆడనుంది. ముఖాముఖి రికార్డులో సింధు 14–9తో ఆధిక్యంలో ఉంది. భారత్‌కే చెందిన మరో స్టార్ సైనా నెహ్వాల్ తొలి రౌండ్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ (థాయ్‌లాండ్)తో తలపడనుంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో వాంగ్‌చరోన్ (థాయ్‌లాండ్)తో కిడాంబి శ్రీకాంత్... కొడాయ్ నరోకా (జపాన్)తో ప్రణయ్... సునె యామ (జపాన్)తో ప్రియాన్షు రజావత్... చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో లక్ష్య సేన్ ఆడతారు.



భారత్‌కు రెండో విజయం



కాకామిగహారా (జపాన్): మహిళల జూనియర్ ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. మలేసియా జట్టుతో సోమవారం జరిగిన పూల్ ‘ఎ’ రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో గెలుపొందింది. భారత్ తరఫున ముంతాజ్ ఖాన్ (10వ ని.లో), దీపిక (26వ ని.లో) ఒక్కో గోల్ సాధించగా... మలేసియా జట్టుకు దియాన్ నజేరి (6వ ని.లో) ఏకైక గోల్ అందించింది. రెండు మ్యాచ్‌లు ముగిశాక భారత్, కొరియా ఆరు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి. నేడు జరిగే మ్యాచ్‌లో కొరియాతో భారత్ ఆడుతుంది.

నిరసనలకు విరామం!

- ఉద్యోగాల్లో చేరిన బజరంగ్, సాక్షి
- పోరాటం కొనసాగిస్తామన్న రెజ్లర్లు

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలతో రెజ్లర్లు కొనసాగిస్తున్న నిరసనల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిరసనను ముందుండి నడిపించిన ఒలింపిక్ పతక విజేతలు బజరంగ్ పూనియా, సాక్షి మలిక్ రైల్వే శాఖలో తమ ఉద్యోగ బాధ్యతల్లో చేరారు. దాంతో పోరాటం నుంచి వీరు తప్పుకున్నట్లేనని, ఫలితం లేకుండానే నిరసన ముగిసినట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు బ్రిజ్‌భూషణ్‌పై ‘పోక్సో’ కేసుకు కారణమైన మైనర్ రెజ్లర్ తన ఫిర్యాదును వెనక్కి తీసుకున్నట్లుగా కూడా ప్రచారం జరిగింది. అయితే బజరంగ్, సాక్షి వీటిని ఖండించడంతో పాటు తమ పోరాటాన్ని ముగించలేదని స్పష్టం చేశారు. శనివారం అర్ధరాత్రి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో భేటీ అనంతరమే ఇవన్నీ జరగడం విశేషం.

ఉద్యోగం కూడా చేయాలి కదా!

శనివారం రాత్రి అమిత్ షాతో రెజ్లర్లు భేటీ అయ్యారు. కేంద్ర హోం మంత్రి ఎలాంటి హామీ ఇచ్చారనే దానిపై స్పష్టత లేకపోయినా, అంతా చట్ట ప్రకారమే వ్యవహరిస్తాం అని మాత్రమే ఆయన చెప్పినట్లు సమాచారం. అయితే రైల్వేలో ఓఎస్‌డీలుగా పని చేస్తున్న బజరంగ్, సాక్షి సోమవారం తమ ఉద్యోగాల్లో చేరిపోవడంతో ఆ సమావేశంలో ఏదో జరిగిందని వినిపించింది. కానీ సాక్షి వీటిని కొట్టిపారేసింది. అది సాధారణ భేటీ మాత్రమేనని, అందులో ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆమె వెల్లడించింది. ఉద్యోగంలో చేరడంపై సాక్షి స్పష్టతనిచ్చింది. ‘నేను ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ హోదాలో పని చేస్తున్నాను. నాకూ కొన్ని బాధ్యతలున్నాయి. నిరసనల్లో పాల్గొనని సమయంలో అధికారిక బాధ్యతలు నిర్వహించాలి కదా’ అని 2016 రియో ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతకం సాధించిన సాక్షి మలిక్ చెప్పింది.



రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్ పూనియా, సాక్షి మలిక్ (ఫైల్)

ఉద్యమం ఆగదు!

ఉద్యోగంలో చేరినంత మాత్రాన తాము నిరసన నుంచి తప్పుకున్నట్లు కాదని, వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లి పోరాడతామని రెజ్లర్లు స్పష్టం చేశారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేసి చర్యలు తీసుకునే వరకు ఇది కొనసాగుతుందని వారు చెప్పారు. తమ ఉద్యమాన్ని బలహీన పర్చేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగానే ఈ పని చేస్తున్నారని వినేశ్ ఫొగాట్ వ్యాఖ్యానించింది. ‘మా గురించి పుకార్లు వ్యాప్తి చేస్తున్న వారికి అసలు మహిళా రెజ్లర్ల బాధలు ఏమిటో తెలుసా? బలహీనులే గుండాల ముందు తలవంచుతారు. కానీ మేం కాదు’ అని వినేశ్ ట్వీట్ చేసింది. మైనర్ రెజ్లర్ తమ ఫిర్యాదులు వెనక్కి తీసుకుందనే వార్తలు కూడా అబద్ధమని వారు స్పష్టం చేశారు. బజరంగ్, సాక్షి, వినేశ్ సంయుక్తంగా ఒకే తరహా ట్వీట్‌తో తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ‘ఆందోళనలో వెనక్కి తగ్గామంటూ వస్తున్న వార్తలు పుకార్లు మాత్రమే. మాకు నష్టం కలిగేంచేందుకే దీనిని ప్రచారం చేస్తున్నారు. మేం ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. మా పతకాలకు రూ.15 విలువ కట్టినవారు ఇప్పుడు మా ఉద్యోగాల వెంట పడ్డారు. మేం జీవితాలను పణంగా పెట్టాం. దాని ముందు ఉద్యోగం చాలా చిన్న విషయం. ఉద్యోగం పేరుతో భయపెట్టించకండి. మాకు న్యాయం దక్కడంలో ఉద్యోగం అడ్డుగా ఉందని భావిస్తే వదిలేసేందుకు పది సెకన్ల సమయం పట్టదు’ అని వారు ట్వీట్ చేశారు.

అంతా కంటితుడుపే!

రెజ్లర్లు అమిత్‌షాను కలిసిన తర్వాతే ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోవడంలో ఆశ్చర్యం లేదని సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ అన్నారు. ‘సమస్య పరిష్కారం కోసమంటూ రెజ్లర్లతో అమిత్ షా కలిశారు. నాకు తెలిసి బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయరు. ఏదో కంటితుడుపుగా చార్జ్‌షీట్ దాఖలు చేస్తారు. అతనికి బెయిల్ లభిస్తుంది. ఆపై ఏం మాట్లాడినా ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది అంటూ తప్పించుకుంటారు’ అని సిబాల్ ట్వీట్ చేశారు. అయితే రెజ్లర్లు పలు వివరణలు ఇచ్చినా తాజా పరిస్థితిని బట్టి చూస్తే వారి నిరసనల తీవ్రత తగ్గిందని, బయటి వ్యక్తుల నుంచి ఏ రకమైన మద్దతూ లభించక ఆందోళన బలహీనపడిందనేది మాత్రం స్పష్టం.

హంపి గేమ్ ‘డ్రా’... హారిక పరాజయం

సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిన్స్ కప్ మహిళల అంతర్జాతీయ చెస్ టోర్నీలో 2020 చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తొలి ‘డ్రా’ నమోదు చేసింది. ఇరీనా క్రష్ (అమెరికా)తో జరిగిన రెండో రౌండ్ గేమ్‌ను హంపి 43 ఎత్తుల్లో ‘డ్రా’గా ముగించింది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికకు తొలి ఓటమి ఎదురైంది. ప్రపంచ మాజీ చాంపియన్ అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్)తో జరిగిన రెండో గేమ్‌లో హారిక 54 ఎత్తుల్లో ఓడిపోయింది. మూడో గేమ్‌లో హంపితో హారిక తలపడుతుంది. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. ప్రస్తుతం కొస్టెనిక్ రెండు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.



55 ఏళ్ల తర్వాత...

- గ్రాండ్‌స్లామ్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో బ్రెజిల్ క్రీడాకారిణి
- ఫ్రెంచ్ ఓపెన్‌లో బీత్రిజ్ హదాద్ ఘనత

పారిస్: బ్రెజిల్ సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 55 ఏళ్ల తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో ఆ దేశ క్రీడాకారిణికి క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారైంది. ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో బ్రెజిల్‌కు చెందిన బీత్రిజ్ హదాద్ మాయ క్వార్టర్ ఫైనల్ చేరింది. టెన్నిస్‌లో ఓపెన్ శకం (1968లో) మొదలయ్యాక దివంగత మరియా బ్యూనో చివరిసారి బ్రెజిల్ తరఫున గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో క్వార్టర్ ఫైనల్ చేరింది. 1968లో మరియా బ్యూనో ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టోర్నీలలో క్వార్టర్ ఫైనల్‌కు... యూఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరింది. మరియా బ్యూనో ఐదు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గినా ఆ విజయాలన్నీ ఓపెన్ శకంకంటే ముందు వచ్చాయి.

సోమవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 14వ ర్యాంకర్ బీత్రిజ్ 3 గంటల 51 నిమిషాల్లో 6–7 (3/7), 6–3, 7–5తో సారా సారిబెస్ టోర్మో (స్పెయిన్)పై విజయం సాధించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో క్వార్టర్ ఫైనల్లో ఏడో ర్యాంకర్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) 6–3, 6–1తో బెర్నార్డా పెరా (అమెరికా)పై, అమెరికా టీనేజర్ కోకో గాఫ్ 7–5, 6–2తో షిమెద్లోవా (స్లొవేకియా)పై, రెండో సీడ్ సబలెంకా (బెలారస్) 7–6 (7/5), 6–4తో స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరారు. పురుషుల సింగిల్స్ విభాగంలో నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే), ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), ఆరో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) క్వార్టర్ ఫైనల్లోకి చేరారు.



బీత్రిజ్

ధనుశ్ శ్రీకాంత్ ‘పసిడి’ గురి

జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ

సుల్ (జర్మనీ): జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ షూటర్ ధనుశ్ శ్రీకాంత్ పసిడి పతకంతో మెరిశాడు. సోమవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ధనుశ్ శ్రీకాంత్ విజేతగా నిలిచాడు. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో హర్‌మెహర్ సింగ్–సంజన సూద్ జోడీ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించింది. కాంస్య పతక మ్యాచ్‌లో హర్‌మెహర్–సంజన ద్వయం ‘షూట్ ఆఫ్’లో డేవిడ్ జాన్సన్–ఫెలిసియా (స్వీడన్) జోడీపై గెలిచింది. ఎనిమిది మంది పాల్గొన్న రైఫిల్ ఫైనల్లో ధనుశ్ శ్రీకాంత్ 249.4 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచాడు. బధిరుడైన శ్రీకాంత్ కొన్నేళ్లుగా అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్నాడు. 2021 జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో శ్రీకాంత్ టీమ్ విభాగంలో స్వర్ణం సాధించాడు. 2019 జూనియర్ ఆసియా చాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో పసిడి పతకాలు సొంతం చేసుకున్నాడు.



సిద్ధార్థ్‌కు స్వర్ణ పతకం

యెచోన్ (దక్షిణ కొరియా): ఆసియా జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మూడో స్వర్ణం చేరింది. సోమవారం జరిగిన పురుషుల షాట్‌పుట్ ఈవెంట్‌లో 17 ఏళ్ల సిద్ధార్థ్ చౌదరీ పసిడి పతకం గెలిచాడు. సిద్ధార్థ్ ఇనుప గుండును 19.52 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. జావెలిన్ త్రోలో శివమ్ (72.34 మీటర్లు)... 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో షారుఖ్ (8ని:51.74 సెకన్లు).. లాంగ్‌జంపర్ సుష్మిత (5.96 మీటర్లు) రజత పతకాలు నెగ్గారు.



సినిమా

నేను మీరే నాన్నా..!


- ఐశ్వర్యా రజనీకాంత్



రజనీకాంత్, ఐశ్వర్య

‘‘నేను మిమ్మల్ని చూస్తూ పెరిగాను. కానీ మీతో షూటింగ్ చేసే రోజు వస్తుందని ఊహించలేదు. మీరంటే నాకు ఆరాధన.. స్ఫూర్తి... ఒక్కోసారి నేను ప్రపంచాన్ని మీ ద్వారా చూస్తాను. కానీ ఎక్కువసార్లు మీతో పాటు ప్రపంచాన్ని చూస్తాను. ఈ క్రమంలో నేను గ్రహించింది ఏంటంటే.. ‘నేను మీరే’ అని. అప్పా (నాన్న) రోజు రోజుకీ నాకు మీ మీద ఉన్న ప్రేమ రెట్టింపు అవుతోంది’’ అంటూ ‘సూపర్ స్టార్‌తో షూటింగ్’ అనే హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియా ద్వారా ఓ ఎమోషనల్ పోస్ట్‌ని షేర్ చేశారు రజనీకాంత్ పెద్ద కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ‘లాల్ సలామ్’ చిత్రంలో మొయిద్దీన్ భాయ్‌గా రజనీకాంత్ కీ రోల్ చేస్తున్నారు. సూపర్ స్టార్‌ని డైరెక్ట్ చేయడం ఏ డైరెక్టర్‌కి అయినా ఎగ్జయిటింగ్‌గా ఉంటుంది. ఇక స్వయానా కూతురు అయితే.. ఆ ఫీలింగ్ రెండింతలు ఉంటుంది. ఆ భావాన్నే ఐశ్వర్య సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఇక క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ‘లాల్ సలామ్’లో స్టార్ క్రికెటర్ కపిల్ దేవ్ కీలక పాత్ర చేస్తున్నారు. ఈ చిత్రంలో రజనీ పాత్ర ముంబై నేపథ్యంలో ఉంటుంది. రజనీ–కపిల్ పాల్గొనగా ఇటీవల ముంబైలో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.

నటన.. నిర్మాణం.. బిజీ



రానా

టాలీవుడ్ హీరో రానా, బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్‌ల కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కేందుకు రంగం సిద్ధమౌతున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఈ సినిమాలో రానా, వరుణ్ ధావన్ హీరోలుగా నటించడం లేదట. వరుణ్ ధావన్ హీరోగా రానా ఈ సినిమాను నిర్మించనున్నారట. ఈ చిత్రం నిర్మాణంలో రానాతో పాటు సునీల్ నారంగ్ కూడా భాగస్వామ్యులు అవుతారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాకు ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. అలాగే మలయాళ హీరో దుల్కర్ సల్మాన్‌తో రానా ఓ సినిమాను నిర్మించనున్నారని సమాచారం. ఇలా గతంలోనూ రానా పలు సినిమాలకు నిర్మాతగా ఉన్న సంగతి తెలిసిందే. ఒకవైపు నటుడిగా మరోవైపు నిర్మాతగా బిజీగా ఉంటున్నారు రానా. ప్రస్తుతం హీరోగా రానా చేతిలో ఉన్న చిత్రాల్లో ‘రాక్షసరాజు’ (వర్కింగ్ టైటిల్) ఒకటి. ‘నేనే రాజు నేను మంత్రి’ చిత్రం తర్వాత దర్శకుడు తేజ–రానా కాంబినేషన్‌లో రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.

నేను తెలుగు బిడ్డనే

- సిద్ధార్థ్



కార్తీక్, దివ్యాంశా, సిద్ధార్థ్, సురేష్‌బాబు, టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్

‘‘తెలుగు కవిత్వం చదివి, చూసి అది నా లోపలకి వెళ్లిపోయింది. సో.. నేను చెప్పినా... చెప్పక పోయినా.. తెలుగు బిడ్డనే’’ అని సిద్ధార్థ్ అన్నారు. సిద్ధార్థ్ హీరోగా కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘టక్కర్’. ఈ చిత్రంలో దివ్యాంశా కౌశిక్ హీరోయిన్‌గా నటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ప్యాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వ ప్రసాద్ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సిద్ధార్థ్ మాట్లాడుతూ– ‘‘టక్కర్’ ఒక యాక్షన్ ఫిల్మ్. న్యూ ఏజ్ లవ్‌స్టోరీ కూడా ఉంటుంది. కొంతకాలం తర్వాత నేను చేసిన కమర్షియల్ సినిమా ఇది’’ అన్నారు. ‘‘మా గురువుగారు శంకర్ సినిమాలకు తెలుగు ప్రేక్షకుల ఆదరణ, మీ హీరో సిద్ధార్థ్, దివ్యాంశ... ఈ మూడు కారణాల వల్లే ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. ఈ సినిమా ఓ ట్రెండ్ సెట్టర్ అవుతుంది’’ అన్నారు కార్తీక్ జి. క్రిష్. ‘‘టక్కర్’ విజయం సాధిస్తుంది’’ అన్నారు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్. ‘‘విశ్వప్రసాద్, వివేక్‌గార్లు నాకు మంచి మిత్రులు. ‘టక్కర్’ చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నాను’’ అన్నారు నిర్మాత డి. సురేష్‌బాబు. ఈ వేడుకలో దర్శకులు ‘బొమ్మరిల్లు’ భాస్కర్, తరుణ్ భాస్కర్, వెంకటేశ్ మహా తదితరులు పాల్గొన్నారు.

టిల్లు వచ్చేది అప్పుడే..



సిద్ధు జొన్నలగడ్డ

‘డీజే టిల్లు పేరు.. వీని స్టయిలే వేరు..’ అంటే యూత్‌తో పాటు ఫ్యామిలీస్‌ని కూడా ఆకట్టుకున్నాడు టిల్లు. సిద్ధు జొన్నలగొడ్డ టైటిల్ రోల్‌లో మీడియమ్ బడ్జెట్‌తో రూపొందిన ‘డీజే టిల్లు’ మంచి వసూళ్లు రాబట్టింది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా సిద్ధు జొన్నలగడ్డతోనే నాగవంశీ, సాయి సౌజన్య ‘టిల్లు స్క్వేర్’ చిత్రం నిర్మిస్తున్నారు. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్ కథానాయిక. ఈసారి రెట్టింపు వినోదం గ్యారంటీ అంటూ.. సెప్టెంబర్ 15న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు సోమవారం చిత్ర యూనిట్ ప్రకటించింది. అలాగే సిద్ధు, అనుపమల రొమాంటిక్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది. ఈ చిత్రానికి సంగీతం: రామ్ మిరియాల, శ్రీ చరణ్ పాకాల, కెమెరా: సాయి ప్రకాశ్ ఉమ్మడిసింగు, సమర్పణ: శ్రీకర స్టూడియోస్.

ఇక నవ్వించే సినిమాలే చేస్తా!


- డైమండ్ రత్నబాబు



‘‘ప్రతి రచయిత, దర్శకుడు వారి బలాలు ఏమిటో తెలుసుకోవడానికి కాస్త సమయం పడుతుంది. రచయితగా ‘పిల్లా నువ్వులేని జీవితం’ (కొన్ని కామెడీ సన్నివేశాలు), ‘సీమశాస్త్రి’, ‘ఈడోరకం ఆడోరకం’లాంటి నవ్వించిన సినిమాలే నాకు ఇండస్ట్రీలో పేరు తెచ్చాయి. దర్శకుడిగా నేను చేసిన రెండు సినిమాలు (బుర్రకథ, సన్నాఫ్ ఇండియా) ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. దీంతో నా బలం కామెడీ అని నమ్మి ‘అన్‌స్టాపబుల్’ మూవీ చేశాను. ఇకపై ప్రతి ఏడాది నా నుంచి ఓ నవ్వించే సినిమా వస్తుంది. ఒకవేళ ప్రయోగాలు చేయాలనుకుంటే ఓటీటీలో చేస్తా’’ అన్నారు డైమండ్ రత్నబాబు. వీజే సన్నీ, సప్తగిరి హీరోలుగా, నక్షత్ర, అక్సా ఖాన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘అన్‌స్టాపబుల్’. డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో రజిత్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు డైమండ్ రత్నబాబు మాట్లాడుతూ– ‘‘ఈ సినిమాలో కల్యాణ్ పాత్రలో సన్నీ, జిలానీ రాందాస్‌గా సప్తగిరి నటించారు. చాలామంది హాస్యనటులు నటించారు. ఇక ‘అన్‌స్టాపబుల్’ సినిమా కాన్సెప్ట్‌ని చెప్పలేను. కానీ ఈ సినిమాలోని ప్రతి పాత్రకు ప్రాముఖ్యత ఉంటుంది. ప్రీ క్లైమాక్స్‌లో అన్ని పాత్రలు ఓ పాయింట్‌కు కలుస్తాయి. ఈ అంశాలను థియేటర్స్‌లోనే చూడాలి. సినిమాలపై ఉన్న ప్యాషన్‌తో రజిత్‌రావు రాజీ పడకుండా నిర్మించారు. నిజం చెప్పాలంటే.. యాక్షన్, ఫ్యామిలీ తరహా సినిమాలను తీయడం కంటే కామెడీ సినిమాలు తీయడం కత్తిమీద సాము వంటిది. కానీ ఈ విషయంలో జంధ్యాల, ఈవీవీ, రేలంగి, ఎస్వీ కృష్ణారెడ్డిగార్లు సక్సెస్ అయ్యారు. నేను రచయితగా ఎలా అయితే నవ్వించానో దర్శకుడిగానూ నవ్వించే సినిమాలే చేస్తాను’’ అని అన్నారు.

ఏ రచయిత అయినా కెప్టెన్ ఆఫ్ ది షిప్ (డైరెక్టర్) కావాలనుకుంటాడు. నేను అలానే రచయిత నుంచి దర్శకుడిని అయ్యాను. నేను రచయితగా ఉన్నప్పుడు కొంతమంది దర్శకులతో అభిప్రాయబేధాలు వచ్చి ఉండొచ్చు, మన కుటుంబాల్లో ఉన్నట్లు ఇండస్ట్రీలో కూడా అలాంటివి సహజమే. అయినా ఇప్పుడు ప్రతి రచయితలోనూ ఓ దర్శకుడు ఉన్నాడు. తమిళ పరిశ్రమలో ఎవరైతే కథ రాస్తారో వాళ్లకే దర్శకత్వం చేసే చాన్స్ కూడా ఉంటుంది. తెలుగులో కూడా అది మొదలైనట్లుంది.

మళ్లీ ఆవారాగా...?



కార్తీ

మళ్లీ ఆవారాగా కనిపించనున్నారట కార్తీ. లింగుసామి దర్శకత్వంలో కార్తీ, తమన్నా హీరో హీరోయిన్లుగా వచ్చిన తమిళ చిత్రం ‘పయ్యా’ (తెలుగులో ‘ఆవారా’). 2010లో విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి చెప్పుకోదగ్గ ఆదరణ లభించింది. ఈ సినిమాకు సీక్వెల్ తీయాలని కొంత కాలంగా లింగుసామి ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే రెండో భాగంలో ఆర్య హీరోగా చేస్తారనే వార్తలు వచ్చాయి. తాజాగా మళ్లీ కార్తీ పేరే తెరపైకి వచ్చింది. కార్తీ నటించే చాన్స్ ఎక్కువగా ఉందని కోలీవుడ్ అంటోంది.

లైఫ్.. డెత్.. ఫేట్.. ఇదే సర్కిల్



సాయి రోనక్, నీలకంఠ

సాయి రోనక్ హీరోగా, బాబా భాస్కర్, అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘సర్కిల్’. నీలకంఠ దర్శకత్వంలో ఎమ్.వి. శరత్ చంద్ర, టి. సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ‘సర్కిల్’ టీజర్‌ను విడుదల చేశారు. సాయి రోనక్ మాట్లాడుతూ– ‘‘ఈ సినిమాలో నేను ఫొటోగ్రాఫర్ పాత్ర చేశాను’’ అన్నారు. ‘‘సర్కిల్ ఆఫ్ లైఫ్, సర్కిల్ ఆఫ్ డెత్, సర్కిల్ ఆఫ్ ఫేట్ .. అనే ఈ మూడు అంశాల కలయికయే ఈ చిత్రం. తన జీవితంలో జరిగిన కొన్ని ఘటనల కారణంగా తనకు ఎవరు మిత్రుడో, ఎవరు శత్రువో తెలుసుకోలేని సందిగ్ధంలో పడే హీరో ఆ పరిస్థితుల నుంచి ఎలా బయటపడతాడన్నదే ఈ సినిమా కథ’’ అన్నారు నీలకంఠ. ‘‘ఈ సినిమా ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది. మా తర్వాతి సినిమాను కూడా నీలకంఠగారితోనే చేయాలనుకుంటున్నాం’’ అన్నారు నిర్మాత శరత్ చంద్ర.

ఆరు రోజుల్లో ఆగస్ట్ 6 పూర్తి



దుర్గాప్రియ

ఆర్.కె. గాంధీ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం ‘ఆగస్ట్ 6 రాత్రి’. బి. సుధాకర్, కంభం దినేష్ కుమార్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం రెండో షెడ్యూల్ పూర్తయింది. అజయ్ రాహుల్, దుర్గాప్రియ, పవన్ వర్మ, సుప్రితా రాజ్, నాగమహేశ్, ధీరజ అప్పాజి తదితరులు నటిస్తున్నారు. ఆర్.కె. గాంధీ మాట్లాడుతూ– ‘‘6 రోజుల్లో ‘ఆగస్ట్ 6 రాత్రి’ని పూర్తి చేసి, రికార్డు సాధించాలన్నదే మా ధ్యేయం. ఐదు రోజుల షూటింగ్ పూర్తయింది. ఇంకో రోజులో సినిమా మొత్తం పూర్తి చేస్తాం. క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో కూడిన లవ్‌స్టోరీగా ఈ సినిమా ఉంటుంది’’ అన్నారు.

మనాలీలో ప్రేమ



రఘురామ్, శృతి శెట్టి

రఘురామ్ హీరోగా నటిస్తున్న చిత్రం ‘ఓహ్’. శృతి శెట్టి, నైనా పాఠక్ హీరోయిన్లు. ఏకరీ సత్యనారాయణ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రం తాజా షెడ్యూల్ ఈ నెల 10 నుంచి వరంగల్‌లో జరగనుంది. ఈ షెడ్యూల్‌లో రెండు ఫైట్స్‌ను చిత్రీకరిస్తారు. ‘‘కులుమనాలి బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ప్యూర్ లవ్‌స్టోరీ ఇది. సెప్టెంబరు 29న సినిమాని రిలీజ్ చేయాలనుకుంటున్నాం’’ అన్నారు సత్యనారాయణ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
240	60
62,787	18,594

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,283	▲	42
డోజోన్స్	33,630	▽	131
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,600	▽	7
డాక్స్	15,937	▽	87
షాంఘై	3,232	▲	2
నికాయ్	32,217	▲	693

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,601
బంగారం (99.5 స్వచ్ఛత)	59,362
వెండి (కేజీ)	71,462

18,600 పాయింట్ల చేరువలో నిఫ్టీ

- సూచీలకు అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- కలిసొచ్చిన ప్రపంచ పరిణామాలు
- రెండో రోజూ కొనసాగిన లాభాలు
- ఆటో, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్



ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎంఅండ్‌ఎం షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారమూ లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలు సైతం కలిసొచ్చాయి. దేశీయ మే సేవారంగ కార్యకలాపాలు వరుసగా రెండో నెలా 13 ఏళ్ల గరిష్ట స్థాయి 62 పాయింట్లుగా నమోదవడం సెంటిమెంట్‌ను మరింత బలపరిచింది. ఫలితంగా సెన్సెక్స్ 240 పాయింట్లు పెరిగి 62,787 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 60 పాయింట్లు దూసుకెళ్లి 18,594 వద్ద నిలిచింది. ఆటో, ప్రైవేట్ బ్యాంక్స్, కన్జూమర్ డ్యూరబుల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, ప్రభుత్వరంగ బ్యాంక్స్ షేర్లలో అమ్మకాలు నెలకొన్నాయి. ఉదయం సెన్సెక్స్ 212 పాయింట్లు పెరిగి 62,759 వద్ద, నిఫ్టీ 78 పాయింట్లు బలపడి 18,612 వద్ద మొదలయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 62,752 వద్ద కనిష్టాన్ని, 62,943 గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 18,583 – 18,640 పరిధిలో ట్రేడైంది. ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ సమావేశ ప్రారంభం (మంగళవారం) నేపథ్యంలో చివర్లో కొంత లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. చిన్న తరహా షేర్లకు అధిక డిమాండ్ నెలకొనడంతో బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ ఇండెక్సులు అరశాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.701 కోట్ల షేర్లను అమ్మేయగా, దేశీయ ఇన్వెస్టర్లు రూ.1,196 కోట్ల షేర్లు కొన్నారు. అంతర్జాతీయ క్రూడాయిల్ ధరలు పెరగడం, అమెరికా డాలర్ బలపడటంతో రూపాయి విలువ 24 పైసలు క్షీణించి 82.63 స్థాయి వద్ద స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- ఆర్‌బీఐ వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చనే అంచనాలతో ఆటో షేర్లు పరుగులు తీశాయి. ఎంఅండ్‌ఎం, అశోక్‌లేలాండ్, టాటా మోటార్స్ భారత్ ఫోర్జ్, మారుతీ 4–1% లాభపడ్డాయి. అలాగే ఫైనాన్స్ షేర్లూ లాభపడ్డాయి.
- ఒపెక్ దేశాలు ఈ జూలై (వచ్చే నెల) నుంచి క్రూడాయిల్ ఉత్పత్తిలో కోత విధించేందుకు సిద్ధమవడంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగాయి. దీంతో ఆయిల్ ఇండియా, ఓఎన్‌జీసీ, ఎంఆర్‌పీఎల్, చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 3–1 శాతం రాణించాయి.

బైబ్యాక్‌కు విప్రో రెడీ

రూ. 12,000 కోట్లు వెచ్చించేందుకు సై

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్) చేపట్టనుంది. ఇందుకు వాటాదారులు అనుమతించినట్లు కంపెనీ తాజాగా పేర్కొంది. దీంతో ఒక్కో షేరుకి రూ. 445 ధర మించకుండా 26.96 కోట్ల షేర్లను బైబ్యాక్ చేయనున్నట్లు తెలియజేసింది. ఇందుకు రూ. 12,000 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది.



ఈ అంశాలపై కంపెనీ స్క్రూటినైజర్ నివేదికను విడుదల చేసింది. దీనిప్రకారం బైబ్యాక్‌కు అనుకూలంగా 99.9% వోటింగ్ నమోదైంది. ఈ వోటింగ్‌ను మే 3–జూన్ 1 మధ్య చేపట్టినట్లు నివేదిక వెల్లడించింది. కంపెనీ ఈక్విటీలో 4.91% వాటాకు సమానమైన 26.96 కోట్లకుపైగా షేర్లను బైబ్యాక్ చేసేందుకు విప్రో బోర్డు గతంలోనే ఆమోదించింది. బైబ్యాక్‌లో కంపెనీ ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ సైతం పాలుపంచుకోనున్నాయి.

ఈ వార్తల నేపథ్యంలో విప్రో షేరు ఎన్‌ఎస్‌ఈలో యథాతథంగా రూ. 405 వద్ద ముగిసింది.

మేలో సేవలు ఓకే!

61.2కు పీఎంఐ బిజినెస్‌యాక్టివిటీ ఇండెక్స్

న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తిలో మెజారిటీ వెయిటేజ్ ఉన్న సేవల రంగం ఏప్రిల్‌తో పోల్చితే... మే నెల్లో కొంత నెమ్మదించింది.ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 61.2కు తగ్గింది. ఏప్రిల్‌లో ఈ సూచీ 62 వద్ద ఉంది. నిజానికి ఏప్రిల్ నెల సూచీ 13 సంవత్సరాల గరిష్ట స్థాయి. మే స్థాయి సూచీ కూడా 13 సంవత్సరాల్లో రెండవ అతిపెద్ద సంఖ్య కావడం గమనార్హం. దేశంలో డిమాండ్ పరిస్థితులు, కొత్త ఆర్డర్ల సానుకూల ధోరణులు కొనసాగుతున్నట్లు నెలవారీ గణాంకాలు వెల్లడించాయి. నిజానికి సూచీ 50లోపునకు పడిపోతేనే క్షీణతగా పరిగణించడం జరుగుతుంది. ఆపైన ఉంటే వృద్ధి ధోరణిగానే భావిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల రంగం వరుసగా 22 నెలల నుంచి వృద్ధి బాటనే ఉంది. మే నెల్లో సేవల రంగంలో ఉపాధి అవకాశాలు కూడా మెరుగ్గానే ఉన్నట్లు ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటిలిజెన్స్‌లో ఎకనమిక్స్ విభాగ అసోసియేట్ డైరెక్టర్ పోలియానా డీ లిమా పేర్కొన్నారు.



సేవలు–తయారీ కలిపితే.. యథాతథం

ఇదిలావుండగా, సేవలు–తయారీకి సంబంధించి ఉమ్మడి ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ మేలో ఏప్రిల్ స్థాయిలోనే యథాతథంగా 61.6గా ఉంది. మేలో ఒక్క 'తయారీ' రంగం చూస్తే పటిష్ట ఫలితం నమోదయ్యింది. తయారీ సూచీ 31 నెలల గరిష్ట స్థాయిలో 58.7కు చేరినట్లు ఎకనామిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలియానా డీ లిమా పేర్కొన్నారు. సరఫరాల చైన్ పరిస్థితుల్లో కూడా పురోగతి కనిపించినట్లు తెలిపారు. దాదాపు 400 కంపెనీల ప్యానల్‌కు పంపిన ప్రశ్నలు, వాటి సమాధానాల ప్రాతిపదికపై ఎస్‌అండ్‌పీ గ్లోబల్ పీఎంఐ కదలికలు ఉంటాయి. 2005 డిసెంబర్‌లో సమాచార సేకరణ ప్రారంభమైంది. జూన్ 8వ తేదీన ఆర్‌బీఐ పాలసీ సమావేశ నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో తాజా సేవలు, తయారీ మే నెల ఫలితాలు వెలువడ్డాయి.

జీఆర్‌టీ జ్యువెలర్స్ వజ్రాల పండుగ

హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్ 'డైమండ్ ఫెస్టివల్' పేరుతో గొప్ప ఆఫర్‌ను ప్రకటించింది. ప్రత్యేకంగా చేతితో తీర్చిదిద్దిన అద్భుతమైన వజ్రాలు, అన్‌కట్ డైమండ్స్‌పై 25 శాతం వరకు తగ్గింపు అందిస్తుంది. ప్లాటినం ఆభరణాలపై కూడా ఆఫర్లు ఉన్నాయి. 'కస్టమర్లందరికీ వజ్రాల కలను నిజం చేసుకునే అవకాశం కల్పించడమే ఈ డైమండ్ ఫెస్టివల్ ప్రధాన ఉద్దేశం. కావున వారంతా ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము' అని జీఆర్‌టీ జ్యువెలర్స్ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

6-6-2023	
విశాఖ	515–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
5-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

ఈ-టూ వీలర్ల జోరుకు బ్రేకులు!

- ధరలు పెంచుతున్న కంపెనీలు
- ఫేమ్–2 సబ్సిడీ తగ్గడమే కారణం
- అమ్మకాలు క్షీణిస్తాయన్న పరిశ్రమ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు మరింత ప్రియం అయ్యాయి. ఇప్పటికే ప్రధాన కంపెనీలు వివిధ మోడళ్ల ధరలను పెంచాయి. ఇతర కంపెనీలు వీటిని అనుసరిస్తున్నాయి. ఫేమ్–2 పథకం కింద ఇచ్చే సబ్సిడీకి భారీ పరిశ్రమల శాఖ కోత విధించడమే మోడళ్ల ఖరీదవడానికి కారణం. భారత్‌లో ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల వినియోగం పెరిగేందుకు 2015లో కేంద్రం తీసుకొచ్చిన ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్ (హైబ్రిడ్) ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఇన్ ఇండియా (ఫేమ్) పథకం దేశీ ఈవీ రంగానికి బూస్ట్ ఇచ్చింది అనడంలో సందేహం లేదు. అయితే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల సబ్సిడీని అకస్మాత్తుగా తగ్గించడం వల్ల అమ్మకాల్లో భారీ క్షీణతకు దారితీయవచ్చని సొసైటీ ఆఫ్ మాన్యుఫాక్చరర్స్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఎస్‌ఎంఈవీ) హెచ్చరించింది.

సబ్సిడీ తగ్గుదల ఇలా..

2023 జూన్ 1 లేదా ఆ తర్వాత రిజిస్టర్ అయ్యే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలపై ఫేమ్–2 పథకం కింద సబ్సిడీని తగ్గిస్తూ కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు వెలువరించింది. దీని ప్రకారం కిలోవాట్ అవర్‌కు గతంలో ఇచ్చిన రూ.15,000 సబ్సిడీ కాస్తా ఇక నుంచి రూ.10,000 ఉంటుంది. ప్రోత్సాహకాలపై పరిమితి ఎక్స్–ఫ్యాక్టరీ ధరలో గతంలో ఉన్న 40 శాతం నుండి 15 శాతానికి చేర్చారు. రానున్న రోజుల్లో పరిశ్రమ వాస్తవిక వృద్ధి చూస్తుందని బజాజ్ అర్బనైట్ ప్రెసిడెంట్ ఎరిక్ వాస్ సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. కాగా, 2023 మే నెలలో దేశవ్యాప్తంగా అన్ని కంపెనీలవి కలిపి ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు 1,04,755 యూనిట్లు రోడ్డెక్కాయి. ఏప్రిల్‌తో పోలిస్తే ఇది 57 శాతం అధికం. జూన్ 1 నుంచి కొత్త ధరలు అమలులోకి వస్తున్నాయన్న నేపథ్యం కూడా ఈ విక్రయాల జోరుకు కారణమైంది. ఓలా, టీవీఎస్, ఏథర్, బజాజ్, ఆంపియర్ టాప్–5లో నిలిచాయి.

వృద్ధి వేగానికి కళ్లెం..: ప్రభుత్వ చర్యతో ఈ–టూ వీలర్ల వేగానికి కళ్లెం పడుతుందని ఎస్‌ఎంఈవీ తెలిపింది. పెట్రోల్‌తో నడిచే ద్విచక్ర వాహనాలు, ఈ–టూవీలర్ల మధ్య ధర వ్యత్యాసం అమాంతం పెరుగుతుందని రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా వెల్లడించింది. ఈవీల జోరు పెరిగే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతివ్వాలని అవేరా ఏఐ మొబిలిటీ ఫౌండర్ రమణ తెలిపారు.

కస్టమర్లు సన్నద్ధంగా లేరు..

భారత్‌లో ధర సున్నితమైన అంశం అని ఎస్‌ఎంఈవీ ఎస్‌ఎంఈవీ డైరెక్టర్ జనరల్ సోహిందర్ గిల్ తెలిపారు. ద్విచక్ర వాహనం కోసం అధికంగా ఖర్చు పెట్టేందుకు కస్టమర్లు సన్నద్ధంగా లేరని స్పష్టం చేశారు. 'పెట్రోలుతో నడిచే ద్విచక్ర వాహనాల్లో అధిక భాగం మోడళ్లు రూ.1 లక్ష కంటే తక్కువ ధరలో లభిస్తున్నాయి. ఈవీ కోసం రూ.1.5 లక్షలకు పైగా ఖర్చు చేసే అవకాశాలు చాలా తక్కువ. మార్కెట్ వృద్ధి చెందే వరకు సబ్సిడీలను కొనసాగించాల్సిందే. భారత్‌లో మొత్తం ద్విచక్ర వాహనాల్లో ఈవీల వాటా ప్రస్తుతం 4.9 శాతమే. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ ప్రకారం ఇది 20 శాతానికి చేరుకోవడానికి నిరంతర రాయితీలు ఇవ్వాల్సిందే' అని వివరించారు.

వరుసలో బజాజ్ చేతక్..

బజాజ్ చేతక్ ధర రూ.22,000 పెరిగింది. దీంతో చేతక్ ప్రారంభ ధర ఎక్స్‌షోరూంలో రూ.1.44 లక్షలకు చేరింది. టీవీఎస్ మోటార్ కంపెనీ ఐక్యూబ్ ధర వేరియంట్‌ను బట్టి రూ.17–22 వేల మధ్య పెరిగింది. ఏథర్ 450ఎక్స్ ప్రో సుమారు రూ.8,000 అధికం అయింది. దీంతో ఈ మోడల్ ప్రారంభ ధర బెంగళూరు ఎక్స్‌షోరూంలో రూ.1,65,435లకు చేరింది. ఓలా ఎలక్ట్రిక్ టూ–వీలర్లు రూ.15,000 వరకు ప్రియం అయ్యాయి. ప్రస్తుతం ఎస్1–ప్రో రూ.1,39,999, ఎస్1 రూ.1,29,999, ఎస్1 ఎయిర్ ధర రూ.1,09,999 పలుకుతోంది. ఈ–స్కూటర్ మోడల్స్ ధరలను పెంచబోమని హీరో ఎలక్ట్రిక్ ఇప్పటికే తెలిపింది.

హైదరాబాద్‌లో ఎస్‌బీఐ 5వ ప్రత్యేక 'స్టార్టప్' బ్రాంచ్



హైదరాబాద్: స్టార్టప్స్ అవసరాలను తీర్చడానికి గాను బ్యాంకింగ్ దిగ్గజం– స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) హైదరాబాద్‌లో మరో ప్రత్యేక శాఖను ప్రారంభించింది. హైదరాబాద్‌లో ఈ తరహా బ్రాంచ్ 5వది కావడం గమనార్హం. మాదాపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖారా కొత్త శాఖను ప్రారంభించారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే అవకాశాలున్న స్టార్టప్స్‌కు అన్ని స్థాయిల్లో తగిన సహాయ సహకారాలు అందించాలన్నది ఎస్‌బీఐ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో (సీఎస్‌ఆర్) భాగంగా ఆయన ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు రూ.50 లక్షల చెక్‌ను అందజేశారు. అదేవిధంగా ఆదర్శ (హోమ్ ఫర్ చిల్డ్రన్)కు మారుతీ ఇకో వెహికల్‌ను కూడా ప్రదానం చేశారు.

దశాబ్దాల కల దరిదాపుల్లో!

పోలవరం పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం జగన్

- 2021 జూన్ నాటికే సుందర జలాశయంగా పోలవరం
- రికార్డు సమయంలో స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్ పూర్తి
- 2021 జూన్ 11నే స్పిల్ వే మీదుగా 6.1 కి.మీ.ల పొడవునా గోదావరి ప్రవాహం మళ్లింపు
- గతేడాది వరదల్లా ఎంత వరద వచ్చినా తట్టుకుని నిలబడేలా కాఫర్ డ్యామ్ ఎత్తు 44 మీటర్లకు పెంపు
- గత ఫిబ్రవరి 15 నాటికి 31.5 మీటర్ల ఎత్తుతో దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి
- వరదల్లోనూ ప్రధాన డ్యామ్ పనులు చకచకా చేసేందుకు మార్గం సుగమం



సాక్షి, అమరావతి: అఖండ గోదావరిపై ఎనిమిది దశాబ్దాల స్వప్నాన్ని సాకారం చేస్తూ జలయజ్ఞంలో భాగంగా దివంగత వైఎస్సార్ చేపట్టిన పోలవరం ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. కేంద్రం నిధులు ఇవ్వడంలో జాప్యం చేస్తుండటంతో ఆర్థిక ఇబ్బందుల్లోనూ రాష్ట్ర ఖజానా నుంచే పోలవరం పనులకు నిధులు వ్యయం చేస్తున్నారు. రికార్డు సమయంలో స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి 2021 జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని స్పిల్‌వే మీదుగా 6.1 కి.మీ. పొడవున మళ్లించారు. ఎగువ కాఫర్ డ్యామ్‌తో గోదావరి ప్రవాహానికి అడ్డుకట్ట వేసి స్పిల్‌వే ద్వారా వరదను దిగువకు విడుదల చేస్తుండటంతో 2021 జూన్ నాటికే పోలవరం జలాశయంగా సుందర రూపం సంతరించుకుంది. గోదావరికి ఎంత వరద వచ్చినా సమర్థంగా తట్టుకునేలా ఎగువ కాఫర్ డ్యామ్ ఎత్తును 44 మీటర్లకు గతేడాది యుద్ధప్రాతిపదికన పెంచారు. దిగువ కాఫర్ డ్యామ్‌ను 31.15 మీటర్ల ఎత్తుతో పూర్తి చేశారు. గోదావరి వరదల్లోనూ ప్రధాన డ్యామ్ పనులు చేపట్టి చకచకా పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టారు. టీడీపీ హయాంలో కమీషన్ల దాహంతో చంద్రబాబు చేపట్టిన పనుల వల్ల 2019 అక్టోబర్ 1న భారీ వరద ఉధృతికి ప్రధాన(ఈసీఆర్ఎఫ్–ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ కోతకు గురై దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై నాలుగు చోట్ల అగాధాలు ఏర్పడ్డాయి. దిగువ కాఫర్ డ్యామ్ కోతకు గురై భారీ అగాధం ఏర్పడింది. టీడీపీ హయాంలో వరద ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌లు కట్టకుండా డయాఫ్రమ్‌వాల్ పనులు చేపట్టడం వల్ల మానవ తప్పిదంతో ఈ విధ్వంసం చోటుచేసుకుందని ఐఐటీ(హైదరాబాద్), సీడబ్ల్యూసీ, డీడీఆర్పీలు తేల్చాయి. లేదంటే 2021 నాటికే సీఎం వైఎస్ జగన్ పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ఉండేవారని అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోలవరం పనులను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడంపై సీఎం జగన్ దిశానిర్దేశం చేయనున్నారు.

శరవేగంగా యథాస్థితికి తెచ్చే పనులు

సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ మార్గదర్శకాల మేరకు ఇసుకతో నింపిన జియోమెంబ్రేన్ బ్యాగ్‌లను దిగువ కాఫర్ డ్యామ్‌లో ఏర్పడిన అగాధంలోకి వేసి వైబ్రో కాంపాక్షన్ చేస్తూ పూడ్చివేశారు. ఆ తర్వాత దిగువ కాఫర్ డ్యామ్‌ను 31.5 మీటర్ల ఎత్తుతో గత ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేశారు. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ భవితవ్యం తేల్చడం, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను పూడ్చి యథాస్థితికి తేవడంపై రెండేళ్లపాటు సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ, ఎన్‌హెచ్‌పీసీ, సీడబ్ల్యూపీఆర్ఎస్, ఐఐటీల ప్రొఫెసర్లతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరిపింది. వీటిని కొలిక్కి తెచ్చి ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాల్లోకి ఇసుకను నింపి వైబ్రోకాంపాక్షన్ చేస్తూ పూడ్చటం ద్వారా యథాస్థితికి తెచ్చే విధానాన్ని ఖరారు చేశారు. డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట్ల సమాంతరంగా కొత్తగా 'యూ' ఆకారంలో డయాఫ్రమ్ వాల్ నిర్మించి పాత దానితో అనుసంధానం చేయనున్నారు. ఇందుకు రూ.2,020.05 కోట్ల వ్యయం కానుంది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలోకి వందలాది టిప్పర్లతో ఇసుకను తరలించి వైబ్రోకాంపాక్షన్ ద్వారా పూడ్చి యథాస్థితికి తెచ్చే పనులను వేగంగా చేస్తున్నారు. వరదల్లోనూ డయాఫ్రమ్ వాల్ పనులు చేపట్టి ప్రధాన డ్యామ్‌ను చకచకా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. ప్రధాన డ్యామ్ పూర్తయ్యేలోగా 960 మెగావాట్లతో చేపట్టిన జలవిద్యుత్ కేంద్రాన్ని పూర్తి చేసే దిశగా పనులను వేగవంతం చేశారు.

జీవనాడికి బాబు ద్రోహం..

అధికారంలో ఉండగా పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకున్న చంద్రబాబు 2013–14 ధరల ప్రకారం రూ.20,398.61 కోట్లకే ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అంగీకరించారు. భూసేకరణ, పునరావాసం కోసమే రూ.33,168.23 కోట్లు అవసరమని సీడబ్ల్యూసీ తేల్చింది. ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడం ద్వారా విధ్వంసానికి కారణమైన చంద్రబాబు మరోవైపు నిధుల సమస్యను ఉత్పన్నం చేయడం ద్వారా జీవనాడి జీవం తీశారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. పోలవరం సవరించిన అంచనా వ్యయం 2017–18 ధరల ప్రకారం రూ.55,656.87 కోట్లుగా సీడబ్ల్యూసీ టీఏసీ ఖరారు చేసింది. ఆ మేరకు నిధులు విడుదల చేయాలంటే కేంద్ర మంత్రి మండలి ఆమోదం అవసరం. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జల్ శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన ప్రతి సందర్భంలోనూ రూ.55,656.87 కోట్ల వ్యయాన్ని ఆమోదించి సత్వరమే పోలవరం పూర్తి చేసేందుకు సహకరించాలని కోరుతూ వస్తున్నారు.

పునరావాసంపై ప్రత్యేక దృష్టి

పునరావాసం, ముంపునకు గురయ్యే భూమి సేకరణకు 2017–18 ధరల ప్రకారం రూ.33,163.28 కోట్లు అవసరం. టీడీపీ ఐదేళ్లలో అతి కష్టమ్మీద రూ.484 కోట్లు వ్యయం చేసి కేవలం 3,110 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక తొలి దశలో 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో 8,567 కుటుంబాలకు రూ.తొమ్మిది వేల కోట్లకుపైగా వ్యయం చేసి పునరావాసం కల్పించింది. లైడార్ సర్వే ప్రకారం 41.15 మీటర్ల పరిధిలో ఇంకా 25,911 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉంది.

2017-18 ధరల ప్రకారం సీడబ్ల్యూసీ, ఆర్‌సీసీ ఆమోదించిన, సవరించిన పోలవరం అంచనా వ్యయం రూ.కోట్లలో

అంశం	సీడబ్ల్యూసీ లెక్క	ఆర్‌సీసీ లెక్క
భూసేకరణ, పునరావాసం	33,168.23	28,172.21
హెడ్ వర్క్స్	9,734.34	9,734.34
కుడి కాలువ	4,318.97	2,865.75
ఎడమ కాలువ	4,202.69	2,720.80
జలవిద్యుత్కేంద్రం	4,124.64	4,124.64
పీపీఏ ఖర్చులు	108.00	108.00
మొత్తం	55,656.87	47,725.87

పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటిదాకా చేసిన వ్యయం

- జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించక ముందు రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయం రూ.4,730.71 కోట్లు
- జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయం రూ.16,218.78 కోట్లు
- ఇప్పటిదాకా పోలవరం ప్రాజెక్టుకు చేసిన వ్యయం రూ.20,949.49 కోట్లు
- ఇప్పటిదాకా కేంద్రం రీయింబర్స్ చేసిన మొత్తం రూ.14,418.39 కోట్లు
- కేంద్రం.. రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయి రూ.1800.39 కోట్లు
- 2017-18 ధరల ప్రకారం ప్రాజెక్టుకు ఇంకా వ్యయం చేయాల్సింది రూ.34,707.38 కోట్లు (సీడబ్ల్యూసీ టీఏసీ ఖరారు చేసిన లెక్క ప్రకారం)

నేడు పోలవరానికి సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఏలూరు జిల్లా పోలవరంలో పర్యటించనున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనులను పరిశీలించి.. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఇందుకోసం సీఎం జగన్ మంగళవారం ఉదయం 9 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి పోలవరం ప్రాజెక్ట్ వద్దకు చేరుకుంటారు. అక్కడ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలిస్తారు. అనంతరం ప్రాజెక్ట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం అక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

పోలవరం తొలిదశకు రూ.12,911 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఈ నిధుల విడుదలకు సంబంధించి కేంద్ర జలశక్తి శాఖ కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన పంపాలని కోరామన్నారు. కేంద్ర మంత్రిమండలి ఆమోదం తీసుకుని నిధులు విడుదల చేస్తామని లేఖలో పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తిచేసి తొలిదశలో ముందస్తుగా ఫలాలను రైతులకు అందించేందుకు వీలుగా రూ.10,000 కోట్లను అడ్‌హాక్‌గా (ముందస్తుగా) ఇవ్వాలని ప్రధాని మోదీని గత ఏడాది జనవరి 3న ఢిల్లీలో సీఎం జగన్ ప్రతిపాదించారు. 2013–14 ధరల ప్రకారం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.20,398.61 కోట్లేనని కానీ, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూ సేకరణ, నిర్వాసితుల పునారావాసానికే రూ.33,168.23 కోట్లని, ఈ నేపథ్యంలో ప్రాజెక్టును పూర్తిచేయడానికి సాధ్యపడదని ప్రధాని మోదీకి సీఎం వివరించారు. 2017–18 ధరల ప్రకారం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) ఖరారుచేసిన రూ.55,656.87 కోట్లను ఆమోదించి, ఆ మేరకు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేసేటప్పుడు విభాగాల వారీగా పరిమితులు విధిస్తున్నారని, దాన్ని తొలగించి ప్రాజెక్టు అంచనా వ్యయం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుని రీయింబర్స్‌మెంట్ చేయాలని కూడా కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన ప్రధాని.. పోలవరం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయాలని కేంద్ర జలశక్తి శాఖను ఆదేశించారు.

రూ.10,911.15 కోట్లు ఇవ్వాలని సీడబ్ల్యూసీ సిఫారసు

ఫలితంగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ దీనిపై స్పందించి ప్రాజెక్టు తొలిదశలో ప్రధాన డ్యామ్, కాలువల పనుల పూర్తికి, 41.15 మీటర్ల కాంటూరు పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి ఎన్ని నిధులు అవసరమో ప్రతిపాదనలను పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పోలవరం తొలిదశ పూర్తికి రూ.15వేల కోట్లు మంజూరు చేయాలని పీపీఏ ద్వారా కేంద్ర జలశక్తి శాఖకు గతేడాది జనవరి 10న రాష్ట్రం ప్రతిపాదనలు పంపింది. పంకజ్‌కుమార్ మార్గదర్శకాల మేరకు రాష్ట్రం పంపిన ప్రతిపాదనలు పరిశీలించిన కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుష్వీందర్ సింఘ్ వోరా రూ.10,911.15 కోట్లను ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేశారు. బిల్లుల చెల్లింపుల్లో విభాగాల వారీగా విధించిన పరిమితులను తొలగించాలని సూచించారు. ఈ క్రమంలోనే గత ఏడాది మార్చి 4న సీఎం జగన్‌తో కలిసి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు చేసిన తప్పిదంవల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు ఏర్పడ్డ భారీ అగాధాలను పరిశీలించారు. ఆ సమయంలో డయాఫ్రం వాల్ మరమ్మతులు, భారీ అగాధాలను పూడ్చివేసి యథాస్థితికి తేవడానికి చేపట్టే పనులకు అయ్యే వ్యయాన్ని కేంద్రమే భరించాలని సీఎం జగన్ చేసిన ప్రతిపాదనపై షెకావత్ సానుకూలంగా స్పందించారు. ఈయన ఆదేశాల మేరకు ఈ ఏడాది మార్చి 4, 5 తేదీల్లో నిపుణుల బృందం డయాఫ్రమ్ వాల్, అగాధాలను పూడ్చి యథాస్థితికి తెచ్చే విధానాన్ని ఖరారు చేశాయి. ఇందుకు రూ.2,020.05 కోట్ల వ్యయమవుతుందని తేలుస్తూ కేంద్ర జలశక్తి శాఖకు నివేదిక సమర్పించాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న పంకజ్‌కుమార్ తొలిదశ పూర్తికి రూ.10,911.15 కోట్లు, డయాఫ్రమ్ వాల్, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని యథాస్థితికి తెచ్చే పనులు చేపట్టడానికి రూ.2 వేల కోట్లు వెరసి రూ.12,911.15 కోట్లు మంజూరు చేయాలని చేసిన సిఫార్సును కేంద్ర ఆర్థికశాఖ ఆమోదించింది.

దశల వారీగా నీటినిల్వ..

పోలవరం ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 45.72 మీటర్లు. గరిష్ట నీటినిల్వ 194.6 టీఎంసీలు. కొత్తగా నిర్మించే ఏ ప్రాజెక్టులోనైనా సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారం ఆ ప్రాజెక్టు పూర్తయిన తొలిఏడాది దాని పూర్తి నిల్వ సామర్థ్యంలో 1/3వ వంతు.. మరుసటి ఏడాది 2/3వ వంతు, ఆ తరువాత పూర్తిస్థాయిలో నీటి నిల్వచేయాలి. ఈ సమయంలో ఏవైనా లీకేజీలుంటే వాటికి అడ్డుకట్ట వేసి ప్రాజెక్టుకు భద్రత చేకూర్చాలన్న ఉద్దేశంలోనే సీడబ్ల్యూసీ ఈ మార్గదర్శకాలను రూపొందించింది. వాటి ప్రకారం పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక తొలి ఏడాది 41.15 మీటర్లలో నీటిని నిల్వచేస్తారు. ఆ తరువాత దశల వారీగా నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ గరిష్ట నీటి మట్టం 45.74 మీటర్లలో నీటి నిల్వచేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి.

తిరుపతి రైలులో అగ్ని ప్రమాదం

సాక్షి, చెన్నై/టంగుటూరు: మచిలీపట్నం నుంచి తిరుపతి వెళ్తున్న ప్యాసింజర్ రైలులో ఆదివారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. ఈ ఘటన ప్రకాశం జిల్లా టంగుటూరు రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. రైలులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావటంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రయాణికులు చైన్ లాగి ఆపి, మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశారు. కొంతమంది రైలు దిగి చీకట్లోనే పరుగులు తీశారు. రైల్వే అధికారులు రంగంలోకి దిగి మంటల్ని అదుపు చేశారు. కాగా తమిళనాడులో కొల్లాం–చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎస్–3 కోచ్ అడుగు భాగంలో పగుళ్లు ఏర్పడినట్టు రైల్వే సిబ్బంది గుర్తించారు. దీంతో రైలును నిలిపివేసి.. ఆ బోగీలోని ప్రయాణికులను వేరే దానిలోకి పంపారు. అనంతరం పగుళ్లు ఏర్పడిన బోగీని రైలు నుంచి వేరు చేసి దాని స్థానంలో కొత్త కోచ్‌ను చేర్చారు. దీంతో రైలు కాస్త ఆలస్యంగా తిరిగి బయల్దేరింది.

దేశంలో ఐఐటీ-మద్రాస్ నంబర్‌వన్

సాక్షి, న్యూఢిల్లీ/రాయదుర్గం: దేశంలోని విద్యాసంస్థల్లో అన్ని విభాగాల్లో కలిపి ఐఐటీ–మద్రాస్ అత్యుత్తమ విద్యాసంస్థగా నిలిచింది. మొత్తం విభాగాల్లో ఐఐటీ–మద్రాస్‌కు మొదటిస్థానం దక్కడం ఇది ఐదోసారి కాగా, ఇంజినీరింగ్ విభాగంలో వరుసగా ఎనిమిదోసారి నంబర్‌వన్ స్థానాన్ని నిలుపుకోవడం విశేషం. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్–2023) నివేదికను విద్య, విదేశీ వ్యవహారాల శాఖల సహాయ మంత్రి డాక్టర్ రాజ్‌కుమార్ రంజన్ సింగ్ సోమవారం విడుదల చేశారు. బోధనా అభ్యాసం, వనరులు, పరిశోధన, వృత్తిపరమైన అభ్యాసం, గ్రాడ్యుయేషన్ ఫలితం వంటి అంశాల ఆధారంగా విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, లా, మెడికల్ కాలేజీలకు ర్యాంకులను ప్రకటించారు. వీటిలో అన్ని కేటగిరీల్లో ఐఐటీ–మద్రాస్ తొలిస్థానంలో ఉండగా, ఐఐఎస్సీ–బెంగళూరు రెండో స్థానంలో, ఐఐటీ–ఢిల్లీ మూడో స్థానంలో నిలిచాయి. ఇక తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఐఐటీ–హైదరాబాద్ 14వ స్థానం,



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 20వ స్థానం, నిట్–వరంగల్ 53, ఉస్మానియా యూనివర్సిటీ 64, వడ్డేశ్వరంలోని కేఎల్ కాలేజ్ ఎడ్యుకేషనల్ యూనివర్సిటీ 50, ఆంధ్రా యూనివర్సిటీ 76వ స్థానంలో నిలిచాయి. ర్యాంకింగ్స్ కోసం 200కు పైగా యూనివర్సిటీలను సర్వేచేశారు. దరఖాస్తు చేసిన దాదాపు 8వేల సంస్థల నుంచి 2,023 ర్యాంకులను ప్రకటించారు.

అత్యుత్తమ వర్సిటీల విభాగంలో...

ఇక అత్యుత్తమ వర్సిటీల విభాగంలో ఐఐఎస్సీ–బెంగళూరు తొలి స్థానంలో ఉండగా, హెచ్‌సీయూ 10వ స్థానం, ఓయూ 36, హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 84వ స్థానంలో నిలిచాయి. ఏపీలోని ఆంధ్రా యూనివర్సిటీ 43, శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ 60వ స్థానం దక్కించుకున్నాయి. ఇంజినీరింగ్ విభాగంలో ఐఐటీ–హైదరాబాద్ 8వ, నిట్–వరంగల్ 21వ స్థానంలో ఉన్నాయి. పరిశోధన విభాగంలో ఐఐటీ–హైదరాబాద్ 14వ స్థానంలో, హెచ్‌సీయూ 25వ స్థానంలో నిలిచాయి. మేనేజ్‌మెంట్ విభాగంలో ఐఐఎం–వైజాగ్ 29వ, ఐసీఎఫ్ఏఐ–హైదరాబాద్ 40వ స్థానంలో ఉన్నాయి. ఫార్మసీలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్–హైదరాబాద్ తొలి స్థానంలో ఉండగా, న్యాయ విభాగంలో నల్సార్ యూనివర్సిటీ 3వ స్థానంలో ఉంది. ఇన్నోవేషన్ విభాగంలో ఐఐటీ–హైదరాబాద్ 3వ స్థానంలో నిలిచింది. వ్యవసాయ విభాగంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్–హైదరాబాద్ 32వ స్థానంలో ఉంది.

జాతీయ ర్యాంకుల్లో మెరిసిన ఏపీ వర్సిటీలు

ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకుల్లో ఘనత చాటిన 25 ఉన్నత విద్యాసంస్థలు

ఆంధ్రా, ఎస్వీయూ, ఎన్జీరంగా వర్సిటీలకు ఉత్తమ స్థానాలు

కేఎల్, విజ్ఞాన్, క్రియా తదితర సంస్థలకూ ర్యాంకులు



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/ఏఎన్‌యూ/ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయి ర్యాంకుల్లో రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థలు ఉత్తమ ర్యాంకులతో మెరిశాయి. ఎన్‌ఐఆర్‌ఎఫ్–2023 ర్యాంకుల్లో 25 రాష్ట్ర ఉన్నత విద్యాసంస్థలు సత్తాచాటాయి. యూనివర్సిటీలు, డిగ్రీ కాలేజీలు, పరిశోధనా సంస్థలు, ఇంజనీరింగ్ కళాశాలలు, మేనేజ్‌మెంటు, ఫార్మసీ, మెడికల్, దంత వైద్యం, న్యాయ విద్యా సంస్థలు, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, ఇన్నోవేషన్, వ్యవసాయ తదితర 13 విభాగాల్లో కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఈ ర్యాంకులను ప్రకటించింది. 2022 వరకు 12 విభాగాల్లోనే ర్యాంకులను ప్రకటిస్తూ రాగా ఈసారి కొత్తగా ఇన్నోవేషన్ కార్యక్రమాలకూ ర్యాంకులను ఇచ్చారు. ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో కేఎల్ యూనివర్సిటీ 50వ ర్యాంకులో, ఆంధ్రా యూనివర్సిటీ–విశాఖ 76వ ర్యాంకులో నిలిచాయి. యూనివర్సిటీల కేటగిరీలో ఎస్వీ యూనివర్సిటీ 60వ ర్యాంకు దక్కించుకుంది. ఇంజినీరింగ్ కాలేజీల కేటగిరీలో ఐఐటీ తిరుపతి 59వ ర్యాంకులో, విజ్ఞాన్ యూనివర్సిటీ 85వ ర్యాంకు, ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ 94వ ర్యాంకులో ఉన్నాయి. ఇక మేనేజ్‌మెంట్ కేటగిరీలో ఐఐఎం విశాఖ పట్నం 29వ ర్యాంకు, క్రియా యూనివర్సిటీ – శ్రీ సిటీ 74వ ర్యాంకు దక్కించుకున్నాయి.

మెరుగుపడ్డ వెటర్నరీ వర్సిటీ ర్యాంక్

తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ గత ర్యాంకును మెరుగుపర్చుకుంది. వ్యవసాయ అనుబంధ విభాగంలో గతేడాది 57వ స్థానంలో ఉన్న వేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీ ఈ ఏడాది ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకుల్లో 31వ స్థానానికి ఎగబాకింది. అలాగే ఇక వెటర్నరీ యూనివర్సిటీల్లో చూస్తే 7వ స్థానం నుంచి 4వ స్థానానికి చేరుకుంది. పరిశోధన, విస్తరణ కార్యకలాపాల్లో వర్సిటీ గత మూడేళ్లుగా అత్యుత్తమ ప్రతిభను కనపరుస్తోందని వీసీ వీ.పద్మనాభరెడ్డి పేర్కొన్నారు.

ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో రెండు సంస్థలు

ఓవరాల్ విభాగంలో ఆంధ్రా యూనివర్సిటీ, కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ యూనివర్సిటీ (వడ్డేశ్వరం) చోటు సంపాదించాయి. యూనివర్సిటీల విభాగంలో 4 సంస్థలకు ర్యాంకులు వచ్చాయి. డిగ్రీ కాలేజీల విభాగంలో రాష్ట్రంలోని సంస్థలకు ర్యాంకులు దక్కలేదు. ఇక ఇంజనీరింగ్ కాలేజీల విభాగంలో 4 విద్యాసంస్థలు ర్యాంకులను దక్కించుకున్నాయి. మేనేజ్‌మెంటు విభాగంలో మూడు సంస్థలు ర్యాంకులను కైవసం చేసుకున్నాయి. 2022 ర్యాంకింగ్స్‌లో 33వ స్థానంలో ఉన్న ఐఐఎం విశాఖపట్నం నాలుగు స్థానాలు మెరుగుపరచుకుని ఈ ఏడాది 29వ ర్యాంకుకు ఎగబాకింది. న్యూజెనరేషన్ ఐఐఎంలలో మాత్రం విశాఖపట్నం టాప్‌లో నిలిచిందని డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ వెల్లడించారు. త్వరలో టాప్–20లో చోటు సాధించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఫార్మసీ విభాగంలో గత ఏడాదిలో మాదిరిగానే ఈసారి కూడా 9 విద్యా సంస్థలకు జాతీయర్యాంకులు దక్కాయి. డెంటల్‌కాలేజీల విభాగంలో విష్ణు డెంటల్ కాలేజ్– భీమవరం కాలేజీ ర్యాంకును సాధించింది. ఆర్కిటెక్చర్ ప్లానింగ్ విభాగంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా)–విజయవాడ ర్యాంకును కైవసం చేసుకుంది. అగ్రికల్చర్ విభాగంలో ఎన్జీ రంగా వర్సిటీ 20వ ర్యాంకులో నిలిచింది.

ట్రాక్టర్ బోల్తా.. ఏడుగురు దుర్మరణం


గనికపూడి మేరమ్మ


గనికపూడి సలోమి


గనికపూడి రత్నకుమారి


కట్టా నిర్మల


గనికపూడి సుహాసిని


మామిడి ఝాన్సీరాణి


మిక్కిలి నాగమ్మ

▶ మొదటి పేజీ తరువాయి

పొన్నూరు మండలం జూపూడిలో తమ బంధువుల ఇంట పుష్పాలంకరణ వేడుకకు హాజరయ్యేందుకు ట్రాక్టర్‌పై బయల్దేరారు. అరగంట తరువాత ట్రాక్టర్ వట్టిచెరుకూరు గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుపై వెళ్తూ ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు మార్జిన్ దిగిపోయి బోల్తా పడింది. ఒక్కసారిగా ట్రాక్టర్ బోల్తా పడటంతో ట్రాలీలో ఉన్న మహిళలు ఒక్కసారిగా కిందపడిపోగా.. వారిపై ట్రాలీ పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో కొండేపాడుకు చెందిన మిక్కిలి నాగమ్మ (55), గనికపూడి మేరమ్మ (50), గనికపూడి రత్నకుమారి (55), కట్టా నిర్మల (55), గనికపూడి సుహాసిని (40), మామిడి ఝాన్సీరాణి (46) అక్కడికక్కడే మృతి చెందగా.. అదే గ్రామానికి చెందిన గనికపూడి సలోమి (55) గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాదంలో మరో 18 మందికి గాయాలు కాగా.. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. వీరంతా గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్పీ ఆరిఫ్ హఫీస్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐ సుబ్బారావు ఉన్నారు. గుంటూరు జీజీహెచ్‌కు చేరుకున్న కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్‌పవార్, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ వేణు గోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, జనసేన నేత నాదెండ్ల మనోహర్ ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించనున్నట్టు మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.25 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించనున్నట్టు వెల్లడించారు.

క్లుప్తంగా...

నాకు పెళ్లి వద్దు.. చదువుకుంటా

- దిశా యాప్ ద్వారా బాలిక ఫిర్యాదు
- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

ఏలూరు టౌన్: తనకు చదువుకోవాలని ఉన్నా.. పెద్దలు బలవంతంగా పెళ్లి చేస్తున్నారంటూ ఓ బాలిక దిశ యాప్ ద్వారా ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు బాలిక వద్దకు చేరుకుని.. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వివాహాన్ని అడ్డుకున్నారు. ఈ వివరాలను పోలీసులు సోమవారం మీడియాకు వెల్లడించారు. ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం వెంకటాపురానికి చెందిన బాలికకు ఈనెల 8వ తేదీన వివాహం జరిపించేందుకు ఆమె తల్లిదండ్రులు ముహూర్తం నిర్ణయించారు. తనకు ఇంకా చదువుకోవాలని ఉందని చెప్పినా పెద్దలు వినకపోవడంతో.. ఆమె ఆదివారం ఉదయం 9.37 గంటలకు దిశ యాప్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తక్షణమే స్పందించిన దిశ సిబ్బంది సమీపంలోని తడికలపూడి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ వెంకన్న, సిబ్బందితో కలిసి 10 నిమిషాల్లోనే బాలిక ఇంటికి చేరుకొని.. ఆమెను విచారించారు. 'ఇంటర్‌లో మంచి మార్కులు తెచ్చుకున్నాను. కనీసం గ్రాడ్యుయేషన్ అయినా పూర్తి చేయాలని ఉంది. నా చదువు పూర్తయ్యాక మా అమ్మ, నాన్న చెప్పినట్లే చేస్తా' అని ఆ బాలిక పోలీసులతో పాటు తన తల్లిదండ్రులకు చెప్పింది. పోలీసులు కూడా ఆ బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. ఆమె చదువును మధ్యలోనే అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. బాలికకు పెళ్లి చేయడం నేరమని వివరించారు. మంచి మార్కులు తెచ్చుకుంటున్న ఆమెను మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. ఇందుకు ఆమె తల్లిదండ్రులు అంగీకరించారు. దీంతో బాలిక సంతోషం వ్యక్తం చేసింది. పోలీసులకు, దిశ యాప్ తీసుకొచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది.

కేజీబీవీ పోస్టుల దరఖాస్తుకు నేటి వరకు గడువు పెంపు

సాక్షి, అమరావతి: కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో బోధనా సిబ్బంది పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం వరకు గడువు పొడిగించారు. కాంట్రాక్టు పద్ధతిలో ఈ పోస్టులను భర్తీ చేస్తుండగా, ఇప్పటి వరకు 27,484 మంది అభ్యర్థులు ఫీజు చెల్లించారు. కానీ, 23,030 మంది మాత్రమే దరఖాస్తులను సమర్పించారు. ఈ క్రమంలో మిగిలిన 4,454 మంది అభ్యర్థుల అభ్యర్థన మేరకు దరఖాస్తు గడువును పెంచినట్లు సమగ్ర శిక్ష కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇదే అభ్యర్థులకు చివరి అవకాశమని స్పష్టం చేసింది.

ఎన్‌ఐఆర్‌ఎఫ్‌లో 'విజ్ఞాన్'కు 75వ ర్యాంకు

చేబ్రోలు: ఎన్‌ఐఆర్‌ఎఫ్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) ర్యాంకులలో విజ్ఞాన్ యూనివర్సిటీకి స్థానం దక్కింది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సోమవారం విడుదల చేసిన ఉన్నత స్థాయి విద్యాసంస్థల ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకులలో జాతీయ స్థాయిలో 75వ ర్యాంకు లభించిందని వీసీ పి.నాగభూషణ్ తెలిపారు. ర్యాంకు వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ ఏజెన్సీల నుంచి గ్రాంట్లు మంజూరుకు అవకాశం ఉందని చెప్పారు. ప్రముఖ బహుళ జాతి కంపెనీలు క్యాంపస్ ఎంపికల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ ర్యాంకు సమష్టి కృషితోనే సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా ఐక్యూఏసీ టీమ్‌ను వర్సిటీ చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు అభినందించారు.

పేదల ఇళ్లపై పిచ్చి రాతలు..

బాబు కొంప కొల్లేరవుతుందనే!

ప్రభుత్వ మేలును వక్రీకరించేందుకే విషం కక్కుతున్న ఈనాడు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 30 లక్షలకు పైగా పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తూ 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకాన్ని సీఎం జగన్ ప్రభుత్వం అమలుచేస్తోంది. దీంతో కొన్ని దశాబ్దాలుగా పూరిళ్లు, గుడిసెలు, అద్దె ఇళ్లలో మగ్గిన పేదలకు సొంతిళ్లు సమకూరుతున్నాయి. దీన్నిచూసి టీడీపీకి రాజకీయ భవిష్యత్ ఉండదని ఎల్లో మీడియా ఈ పథకంపై తొలి నుంచి విషం కక్కుతోంది. ప్రభుత్వం చేస్తున్న మేలును కప్పిపుచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈనాడు పత్రికలో రామోజీరావు పిచ్చిరాతలు ప్రచురిస్తున్నారు. ఇదే క్రమంలో 'పల్లె పేదలకు ఒక్క ఇల్లూ కట్టలేదు' అంటూ సోమవారం కూడా తన అక్కసును వెళ్లగక్కింది. పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చేస్తున్న సాయం నామమాత్రమేనంటూ రాసుకొచ్చింది. ఈ క్రమంలో పథకం ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వం చేస్తున్న మేలును ఓసారి పరిశీలిస్తే..

రూ.56 వేల కోట్లతో స్థలాల పంపిణీ

పేదలందరికీ ఇళ్ల పథకం కింద రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ఉచితంగా స్థలాలను ప్రభుత్వం పంపిణీ చేపట్టింది. పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఈ భూమి విలువ రూ.వేల కోట్లలో ఉంది. ప్రభుత్వ భూములతో పాటు, ప్రైవేట్ భూములను సేకరించి ఏకంగా 71,811.9 ఎకరాల భూమిని నిరుపేదలైన మహిళల పేరిట పంపిణీ చేశారు. ఈ భూమి మార్కెట్ విలువ రూ.56,102.91 కోట్ల మేర ఉంటోంది. ఉచితంగా పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాల విలువ మార్కెట్‌లో రూ.2.5 లక్షల నుంచి రూ.10 లక్షల మేర ఉంది. ఇదే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఒక్క సెంటు స్థలం కూడా పంపిణీ చేసిన దాఖలాల్లేవు. సొంతంగా స్థలాలు ఉన్న వారికి మాత్రమే ఇళ్ల నిర్మాణానికి అనుమతులిచ్చారు. ఇలాంటి చంద్రబాబు లీలలేవీ ఈనాడు రామోజీరావుకు కనపడవు.

రూ.36వేల కోట్లతో సదుపాయాలు..

పేదలకు ఉచిత స్థలాల పంపిణీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 17వేలకు పైగా వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో ఏకంగా కొత్తగా ఊళ్లనే సీఎం జగన్ ప్రభుత్వం నిర్మిస్తోంది. ఈ క్రమంలో కొత్తగా ఏర్పాటయ్యే కాలనీల్లో సదుపాయాల కల్పనకు రూ.36,026 కోట్లు ఖర్చుచేస్తున్నారు. కాలనీల్లో పేదల ఇళ్ల నిర్మాణాలకు నీరు, విద్యుత్ సరఫరాకు, అప్రోచ్ రోడ్లు ఇతర సదుపాయాల కల్పనకు రూ.3,117 కోట్లు ఖర్చు పెట్టగా, మిగిలిన రూ.32,909 కోట్లతో శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. శాశ్వత సదుపాయాల కల్పనలో భాగంగా నీటి సరఫరాకు రూ.4,128 కోట్లు.. విద్యుత్, ఇంటర్నెట్‌కు రూ.7,989 కోట్లు, డ్రైనేజీ వ్యవస్థకు రూ.7,227 కోట్లు, రోడ్లు, ఆర్చ్‌ల నిర్మాణానికి రూ.10,251 కోట్లు, పట్టణాల పరిధిలోని కాలనీల్లో సదుపాయాల కల్పనకు రూ.3,314 కోట్లు కేటాయించారు. పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇంత మేలు చేస్తున్నా రామోజీ అక్కసు తీరడంలేదు.

యూనిట్ కాస్ట్ రూ.1.80 లక్షలకు అదనంగా రూ.90వేలు..

ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ 21.25 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులిచ్చింది. ఇందులో 2.62 లక్షల టిడ్కో ఇళ్లు కాగా, మిగిలినవి సాధారణ ఇళ్లు. సాధారణ ఇళ్ల నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షల చొప్పున ఇస్తున్నారు. దీనికి అదనంగా రూ.90 వేల వరకు ప్రభుత్వం ప్రతి లబ్ధిదారునికి మేలు చేకూరుస్తోంది. పావలా వడ్డీకి రూ.35 వేలు బ్యాంకు రుణం ఇవ్వడంతో పాటు, ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఇసుక అందించడం ద్వారా రూ.15వేలు, మార్కెట్ ధరల కన్నా తక్కువకు నిర్మాణ సామాగ్రి సరఫరా చేయడం ద్వారా మరో రూ.40వేల మేర ప్రభుత్వం లబ్ధిచేకూరుస్తోంది. ఈ లెక్కన ఉచితంగా స్థలం ఇవ్వడంతో పాటు, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.7 లక్షల చొప్పున పేదలకు మేలు చేస్తోంది.

ఏఎన్‌యూ 'ఇంజినీరింగ్' నోటిఫికేషన్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ విధానంలో బీటెక్, ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించేందుకు ఏఎన్‌యూ ఇంజినీరింగ్ టెస్ట్–2023కి సోమవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. టెస్టుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 19 ఆఖరు తేదీగా పేర్కొన్నారు.

సుగర్ ఫ్యాక్టరీలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే చదలవాడ దౌర్జన్యం!

- పోలీసులకు ఫిర్యాదు చేసిన నేటమ్స్ సుగర్స్ జీఎం



నిండ్ర (చిత్తూరు జిల్లా): తిరుపతి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు చదలవాడ కృష్ణమూర్తి సోమవారం గూండాలతో వచ్చి దౌర్జన్యం చేసి, విలువైన పత్రాలు తీసుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. నిండ్ర నేటమ్స్ సుగర్స్ జనరల్ మేనేజర్ ప్రసాద్ (హెచ్‌ఆర్) సోమవారం నిండ్ర పోలీసులకు ఈమేరకు ఫిర్యాదు చేశారు. చదలవాడ కృష్ణమూర్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. చదలవాడ కృష్ణమూర్తి సోమవారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో కర్మాగారం ఆవరణలోకి పది మంది గూండాలను తీసుకొని వచ్చారని తెలిపారు. అక్కడ ఉన్న సిబ్బందిని బెదిరించి కర్మాగారం కార్యాలయంలోకి ప్రవేశించి, విలువైన పత్రాలను తీసుకెళ్లారని తెలిపారు. రైతులలో భయాందోళన కలిగించడానికే ఈ పని చేశారని చెప్పారు. కృష్ణమూర్తికి, కర్మాగారానికి ఎలాంటి సంబంధం లేదని, తమ అనుమతి లేకుండానే లోపలికి ప్రవేశించారని, ఇది నేరమని చెప్పారు. అదేవిధంగా చర్చలు జరిపి రైతులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించి కర్మాగారం నిర్వహణకు ప్రయత్నం చేస్తున్న దశలో ఇలా చేయడం సరికాదని, ఆయనపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మరుగుదొడ్ల నిధులు స్వాహా చేసిన టీడీపీ ఎమ్మెల్యే!

- చెంబులతో ఎమ్మెల్యే స్వామి ఇంటి వరకు ర్యాలీకి నిర్ణయం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ అశోక్‌బాబు నేతృత్వంలో భారీ ర్యాలీ
- అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యే హైడ్రామా
- జాతీయ రహదారిపై ధర్నా అంటూ హంగామా
- అడ్డుకున్న పోలీసులపై తిరగబడ్డ ఎమ్మెల్యే అనుచరులు
- వైఎస్సార్‌సీపీ వారే దాడి చేశారని ఎమ్మెల్యే ఆరోపణ


టంగుటూరులో టీడీపీ ఎమ్మెల్యే స్వామి అవినీతిపై చెంబులతో నిరసన తెలుపుతున్న అశోక్‌బాబు

టంగుటూరు: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డోలబాల వీరాంజనేయస్వామి మరుగుదొడ్లు నిర్మించకుండానే నిధులు స్వాహా చేశారని వైఎస్సార్‌సీపీ ఆందోళనలు చేపట్టింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు నేతృత్వంలో సోమవారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని ఎమ్మెల్యే ఇంటి వరకు చెంబులతో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ముందుగానే ప్రకటించింది. అయితే తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఎమ్మెల్యే స్వామి హైడ్రామాకు తెరతీశారు. వైఎస్సార్‌సీపీ ర్యాలీకి పోటీగా ఆందోళన చేపట్టేందుకు తన ఇంటి వద్దకు రావాలని నియోజకవర్గ టీడీపీ కేడర్‌కు పిలుపునిచ్చారు. అయితే ఆయన ఆశించినంతగా జనాలు రాలేదు. దీంతో అసహనానికి గురైన ఎమ్మెల్యే స్వామి తన అనుచరులతో కలిసి జాతీయ రహదారి మీదకు వచ్చి ధర్నా చేయబోయారు. పోలీసులు అడ్డుకోవడంతో వారిపై ఎమ్మెల్యే, ఆయన మనుషులు తిరగబడ్డారు. ఈ తోపులాటలో ఎమ్మెల్యే చొక్కా చినిగింది. అయినా ఎమ్మెల్యే స్వామి వైఎస్సార్‌సీపీ వాళ్లే తనపై దాడిచేశారంటూ ఆరోపణలు చేశారు. ఇదిలా ఉండగా ముందుగా ఇచ్చిన పిలుపు మేరకు అశోక్‌బాబు టంగుటూరు బొమ్మల సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడకు ఆరు మండలాల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రసంగించారు. అక్కడి నుంచి చెంబులతో ర్యాలీగా బయల్దేరారు. అశోక్‌బాబును, పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే ఇంటికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. పేదల కోసం ఇచ్చిన మరుగుదొడ్ల నిధులను సైతం ఎమ్మెల్యే కాజేయడం సిగ్గుచేటని అశోక్‌బాబు విమర్శించారు.

గో ఆధారిత వ్యవసాయదారులకు చేయూత ఇవ్వాలి

- గో ఆధారిత వ్యవసాయదారుల మహా సమ్మేళనంలో వక్తలు

సాక్షి, అమరావతి: గో ఆధారిత వ్యవసాయదారులకు ప్రభుత్వం అవసరమైన ఆర్థిక చేయూతను ఇవ్వడంతోపాటు వారు పండించే రసాయన అవశేషాల్లేని ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత కార్యవర్గ సభ్యుడు భయ్యాజీ జోషి కోరారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల మహా సమ్మేళనం సోమవారం విజయవాడలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలో జరిగింది. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ వ్యవసాయంలో పంచభూతాలను సమ్మిళితం చేసుకుంటేనే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. భూ ఆరోగ్య పరిరక్షణకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్లే భూమిలో సారం తగ్గిపోతుందన్నారు. భారతీయ కిసాన్ సంఘం అఖిల భారత సంఘటనా కార్యదర్శి దత్తాత్రేయ కులకర్ణి మాట్లాడుతూ రైతులకు ఆదాయం పెరిగేందుకు వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడిపరిశ్రమ, కోళ్లు, గొర్రెలు, చేపల పెంపకంపై దృష్టి పెట్టాలన్నారు. గో ఆధారిత వ్యవసాయదారుల సంఘ అధ్యక్షుడు ముత్తవరపు మురళీకృష్ణ మాట్లాడుతూ తమ సంఘం పదేళ్లుగా అందిస్తున్న సేవల గురించి వివరించారు. గో ఆధారిత వ్యవసాయం చేసే రైతులకు ఏటా ఎకరాకు రూ.10వేలు చెల్లించేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని, రాష్ట్రంలో ఆర్గానిక్ అగ్రికల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేలా ప్రభుత్వ పెద్దలను కలిసి విజ్ఞప్తి చేయాలని, గో ఆధారిత వ్యవసాయం చేసే రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి జాతీయ రహదారుల వెంబడి రైతు మార్కెట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలని కోరుతూ ఈ మహాసమ్మేళనంలో తీర్మానించారు.

12న విత్తన మహోత్సవం

సాక్షి, అమరావతి: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గుంటూరు లాంలో ఈ నెల 12వ తేదీన విత్తన మహోత్సవం నిర్వహిస్తున్నట్టు వర్సిటీ వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మన రాష్ట్రంలో మన రైతు కోసం మన నాణ్యమైన విత్తనం కోసం మన వ్యవసాయ విశ్వవిద్యాలయం అనే నినాదంతో ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వర్సిటీ ఇప్పటివరకు అభివృద్ధి చేసిన అన్ని రకాల పంటల విత్తనాలను ప్రదర్శించడంతోపాటు తొలిసారి అమ్మకానికి అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077.
Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943